- కరెంటు కోతలపై సబ్‌స్టేషన్‌కు రైతుల తాళం
- పోలీసుల డీపీలతో సైబర్ మోసగాళ్ల కాల్స్!
- జేఎన్‌టీయూలో ఒక్కరోజే 8 లక్షల కోట్లు ఆవిరి
- స్టేట్‌హోం ఎదుట అంగన్‌వాడీల మహా ధర్నా
- ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టండి: జగన్

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

నిపుణ — పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శనివారం SATURDAY 20.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+8/4 Pages: 12+8/4 | సంపుటి (Volume): 14 ǁ సంచిక (Issue): 45 ǁ వెల (Price) రూ.6.50 | చతుర్దశి

శనివారం, సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-53. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: చతుర్దశి సాయంత్రం 6-00 వరకు. నక్షత్రం: పూర్వాషాఢ రాత్రి 1-48 వరకు. వర్జ్యం: పగలు 12-05 నుంచి పగలు 1-37 వరకు. రాహుకాలం: ఉదయం 9-07 నుంచి ఉదయం 10-44 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 5-52 నుంచి ఉదయం 7-36 వరకు. అమృతకాలం: రాత్రి 9-13 నుంచి రాత్రి 10-45 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



శుక్రవారం విమానాలు రద్దవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల పడిగాపులు

మైక్రో'స్లాప్' విపత్తు :(

ఇంటర్నెట్ ప్రపంచంలో అతిపెద్ద ఉపద్రవం!

- 'క్రౌడ్‌స్ట్రైక్' అప్‌డేట్‌లో బగ్‌తో తలెత్తిన సమస్య
- ఇంటర్నెట్ వాడే అన్ని రంగాలపైనా ప్రభావం
- పలు దేశాల్లో స్తంభించిన బ్యాంకింగ్ వ్యవస్థ
- గందరగోళంగా మారిన విమానయాన సేవలు
- **శంషాబాద్‌లో 36 విమాన సర్వీసుల రద్దు**
- 7-8 గంటలపాటు ప్రయాణికుల పడిగాపులు

బ్లూస్క్రీన్ ఎర్రర్‌తో విండోస్ సేవల్లో తీవ్ర అంతరాయం



టెక్ లోకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన 'బ్లూస్క్రీన్ ఎర్రర్' తో సాంకేతిక విపత్తు తలెత్తింది. ఊహించని ఈ ఉపద్రవం ఫలితంగా విశ్వవ్యాప్తంగా లక్షల కంప్యూటర్లు మొరాయించాయి. అనూహ్య పరిణామంతో అన్ని దేశాల్లో గందరగోళం మొదలైంది. ఇంటర్నెట్ ఆధారిత వ్యవస్థలన్నీ స్తంభించాయి. ఐటీ కంపెనీల్లో కంప్యూటర్లు షట్‌డౌన్ అవగా.. స్టాక్ మార్కెట్లు క్రాష్ అయ్యాయి. బ్యాంకుల్లో లావాదేవీలు, ఎయిర్‌పోర్టుల్లో విమానాలు నిలిచిపోయాయి. ప్రభుత్వ కార్యకలాపాలకూ, టీవీ చానళ్ల ప్రసారాలకూ ఆటంకాలు తప్పలేదు! సైబర్‌దాడి నుంచి రక్షించాల్సిన సాఫ్ట్‌వేర్ 'క్రౌడ్‌స్ట్రైక్' అప్‌డేషన్‌లో వచ్చిన బగ్‌తో ఈ ప్రమాదం జరిగినట్టు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. చివరికి సమస్యను పరిష్కరించడంతో ప్రపంచం ఊపిరి పీల్చుకుంది. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. > 7

మాఫీకి మరో మెలిక!

రుణమాఫీ కాకుంటే ఫిర్యాదు చేయాలట.. నెలరోజుల్లో చెప్తామంటున్న సర్కార్

- లక్ష లోపు అందరికీ పూర్తిచేశామంటున్న ప్రభుత్వం
- కాని వారు ఏఈవోలను సంప్రదించాలని సూచన
- మాఫీ కాక, జాబితాలో పేర్లులేక రైతుల్లో ఆందోళన
- బ్యాంకర్లు, అధికారుల చుట్టూ అన్నదాతల చక్కర్లు
- మరో లిస్ట్ వస్తదంటూ తిప్పిపంపుతున్న బ్యాంకర్లు
- రుణగ్రహీతల సమాచారమంతా బ్యాంకుల దగ్గరే..
- అయినా ఇన్ని లోపాలెట్లా జరిగాయని రైతుల ప్రశ్న



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి యూనియన్ బ్యాంక్‌లో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతులు

రుణాలు తీసుకున్నోళ్ల పేర్లున్నాయి. పాస్‌బుక్‌లు బ్యాంకుల దగ్గరే ఉన్నాయి. అవసరమైనోళ్ల ఆధార్, పాన్‌కార్డుల వివరాలూ ఉన్నాయి. ఎంత రుణం తీసుకున్నారనే లెక్కలూ లీడ్ బ్యాంకుల్లో ఉన్నాయి. లక్షలోపు రుణాలు తీసుకున్నోళ్లు ఎందరున్నారో.. ఒక్క బటన్ నొక్కితే.. డాటా అంతా కండ్లముందు కదలాడుతుంది. ఈ వ్యవస్థలోనే కేసీఆర్ రైతుబంధు జమచేసినప్పుడు పైసా పైసా లెక్క పక్కాగా రైతుకు చేరిపోతుంది. ఫోన్లు టింగ్ టింగుమని మోగిపోతుంది. మరి ఇప్పుడేమైంది?

రుణమాఫీ చేస్తామని 7 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలుసు. ఆగస్టు 15 నాటికి పూర్తిచేస్తామని 3 నెలలుగా సీఎం చెప్తనే ఉన్నారు. అయినా 15నిమిషాల్లో తేలాల్సిన లెక్కలపై ఇప్పటికీ స్పష్టత లేదు. అంతా గందరగోళం! ఎవరికి మాఫీ అయ్యిందో తెలీదు. కానివాళ్లకి ఎందుకు కాలేదో చెప్పే నాథుడే లేడు. సమాధానం చెప్పలేని స్థితిలో సర్కారు కొత్తపాట అందుకున్నది. మాఫీ కానివారు ఫిర్యాదు చేసుకోవాలని, నెలరోజుల్లో కారణం చెప్తామని అంటున్నది. సాగుపనులు వదిలి సర్కారు దఫ్తర్ల చుట్టూ ఫిర్యాదు పత్రాలతో రైతులు మళ్లీ చక్కర్లు కొట్టాల్సిందేనా? > 2



మాఫీ చెయ్యకుంటే ఇడిసిపెట్టేదేలేదు

నా పేరుమీద లక్షా అరవై వేల రూపాయలు, భార్యపేరు మీద అరవై వేల రూపాయలు పంట రుణం తీసుకున్నం. ఇప్పటి వరకు పైసలు పడలేదు. రుణమాఫీ సంగతి ఏందో తెలుసుకుందామని హుస్నాబాద్ ఎస్బీఐ బ్యాంకుకు వచ్చిన. రుణమాఫీ జరగలేదని చెప్పిన్రు. మెసేజ్ కూడా రాలేదని ఫోన్ చూపించిన. మాకు రుణమాఫీ రాకుంటే సీఎం రేవంత్‌రెడ్డి దాక పోతం. అప్పులు ఉతోం. మాకెందుకు పైసలు రావద్దు? అర్హతలున్న ఉన్నప్పుడు రావాల్సిందే. నలుగురిని కూడగట్టుకొని హైదరాబాద్ దాక పోత. అస్సలు ఇడిసిపెట్టేదేలేదు.

-రాముంచ వెంకటరెడ్డి, రైతు, లంకలపేట (సిద్దిపేట జిల్లా)

రుణమాఫీపై చెప్పిందెంత.. చేసిందెంత?



- రైతులను దగా చేసిన రేవంత్
- ఏదో ఘనకార్యం చేసినట్టు సంబురాలు ఎందుకు?
- కొండను తవ్వి ఎలుకను పట్టినందుకా?
- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి > 2

లక్ష రుణమాఫీ కానోళ్లు లక్షల్లోనే!



- కాంగ్రెస్ అబద్ధాలకు గోబెల్స్ ఆత్మహత్య చేసుకునేటోడు
- రేవంత్ సర్కారు చేసింది గోరంత.. చెప్పేది కొండంత
- రుణమాఫీకి ఇన్ని షరతులా?
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి > 2



బదిలీల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం రాత్రి కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ముందు రాస్తారోకో చేపట్టిన నర్సులు

నర్సింగ్ బదిలీల్లో రచ్చ

- లాంగ్ స్టాండింగ్ జాబితా నుంచి పేర్లు మాయం
- ఖాళీ పోస్టుల జాబితాను ప్రదర్శించని అధికారులు
- బదిలీ కౌన్సెలింగ్‌లో చిచ్చుపెట్టిన సిఫారసు లేఖలు
- పెద్దఎత్తున డబ్బు చేతులు మారినట్టు ఆరోపణలు
- ఉస్మానియా మెడికల్ కాలేజీలో నర్సుల ఆందోళన
- డీపీహెచ్ ఘెరావ్.. కోఠిలో రాత్రి దాకా రాస్తారోకో
- నిరసనలతో కౌన్సెలింగ్ నిలిపివేసిన అధికారులు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్‌బజార్: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) విభాగంలో నర్సింగ్ బదిలీల ప్రక్రియ రసాభాసగా మారింది. కౌన్సెలింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వందల మంది నర్సులు శుక్రవారం రాత్రి కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ముందు రాస్తారోకో > 10వ పేజీలో

గ్రూప్-2 వాయిదా

- డిసెంబర్‌లో పరీక్షకు టీజీపీఎస్సీ నిర్ణయం
- అభ్యర్థుల ఆందోళనతో దిగొచ్చిన సర్కార్
- చర్చలు జరిపిన డిప్యూటీ సీఎం విక్రమార్క
- వెనువెంటనే టీజీపీఎస్సీ వాయిదా ప్రకటన
- పోస్టుల పెంపుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం > 6

ఇటు వర్షాలు.. అటు వరద

- వాయుగుండంగా మారిన అల్పపీడనం
- మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు
- వాగుల్లో వరద ఉధృతి.. రాకపోకలు బంద్
- దేవాదుల బరాజ్ 52 గేట్లు ఎత్తివేత > 5
- పెదవాగు కింద 400 ఎకరాలు మునుపు

హైడ్రా చైర్మన్‌గా ముఖ్యమంత్రి

- పాలక మండలి.. విధి విధానాలు ఖరారు
- 15మంది ఉన్నతాధికారులతో సబ్ కమిటీ
- హైడ్రా కిందే అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ సపోర్టింగ్‌లు > 6

రుణమాఫీపై కొత్త మెలిక

- మాఫీకాని రైతులు ఏఈవోలను కలవాలని ఉత్తర్వులు
- ఫిర్యాదుల పరిష్కారానికి 30 రోజుల గడువు
- బ్యాంకర్లు, వ్యవసాయ అధికారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- త్వరలో మరో జాబితా వస్తుందని చెప్తున్న బ్యాంకర్లు
- ఇన్ని లోపాలెలా జరిగాయని రైతుల ప్రశ్న



సిద్దిపేట జిల్లా పుల్లూరులోని ఏపీజీవీబీ బ్రాంచికి శుక్రవారం రైతులు భారీగా తరలివచ్చారు. రుణమాఫీ జాబితాలో తమపేర్లు ఉన్నాయా, ఖాతాల్లో డబ్బులు పడ్డాయా అనే విషయాన్ని బ్యాంకు మేనేజర్‌ను అడిగితెలుసుకున్నారు. కొందరి పేర్లు జాబితాలో రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. కొందరికి మెసేజ్‌లు రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పూర్తి వివరాలు వచ్చాక అన్ని విషయాలు వెలుతామని బ్యాంకు సిబ్బంది తెలిపారు.

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రైతు రైతుమాఫీపై వ్యవసాయ శాఖ శుక్రవారం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎవరైన రైతులకు రుణమాఫీ కాకపోతే, ఆయా రైతులు మండల వ్యవసాయాధికారులను కలిసి ఫిర్యాదుచేయాలని మెలిక పెట్టింది. ఆయా ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలను ఇప్పటికే జిల్లా వ్యవసాయాధికారులకు జారీ చేసినట్టు పేర్కొన్నది. 'ఎవరైనా రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ జరగకపోతే, ఆయా రైతులు ఆందోళన చెందకుండా మీ పరిధిలోని మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగలరు. రైతు రుణమాఫీ-2024కు గాను ప్రతి మండలంలో రుణమాఫీ ఫిర్యాదుల విభాగాన్ని మండల వ్యవసాయ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా జూలై 18న ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి సంబంధించిన ఆదేశాలను జిల్లా వ్యవసాయ అధికారి జిల్లాలో ఉన్న ప్రతి మండల వ్యవసాయ అధికారికి అదే రోజున జారీ చేయడం జరిగింది. రైతులు ఇచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం నిర్దేశించిన 30 రోజుల్లోగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుంది. పంటరుణం తీసుకున్న, రుణమాఫీకి అర్హులైన (తేదీ 12-12-2018 నుంచి 9-12-2023 మధ్య కాలంలో రైతులు పంట రుణం తీసుకున్న పంట రుణమాఫీ 2024కు అర్హులు) ప్రతి రైతుకు సంబంధించిన పంట రుణం సమాచారం, స్థితి తెలుసుకోవడానికి జిల్లాలో క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రతి వ్యవసాయ విస్తర్ణ అధికారికి, మండల పరిధిలో ఉన్న ప్రతి మండల వ్యవసాయ అధికారికి లాగిన్స్ వ్యవసాయ శాఖ నుంచి ఇచ్చాం. రైతులు ఆధార్ నంబర్‌ను ఏఈవో, లేదా ఎంఏవోకు ఇస్తే పంట రుణమాఫీ 2024 రైతు సమాచారాన్ని తెలుసుకోవచ్చు' అని జిల్లా వ్యవసాయ అధికారుల నుంచి ప్రకటనలు వెలువడ్డాయి. దీనిని బట్టి రైతుల్లో కొందరికి రుణమాఫీ జరగలేదని స్పష్టం అవుతున్నదని నిపుణులు చెప్తున్నారు.

కార్యాలయాలు కిటకిట

రుణమాఫీ జాబితాలో పేర్లు రాని రైతులు శుక్రవారం మండల, జిల్లా వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లారు. తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం రాష్ట్రంలో ఏ వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని పరిశీలించినా ఇదే దృశ్యం కనిపించింది. వారికి ఏమని సమాధానం చెప్పాలో తెలియక వ్యవసాయ అధికారులు తలలు పట్టుకున్నారు. రైతుల ఆధార్ వివరాలతో డాటాబేస్‌ను చెక్ చేసి, రుణమాఫీ కానివారి నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ ఫిర్యాదులను ఏం చేస్తారని ప్రశ్నిస్తే.. పై అధికారులకు పంపుతామని, ఎప్పుడు మాఫీ అవుతుందో తెలియదని సమాధానం వచ్చింది. మరికొన్నిచోట్ల రైతులు బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాలోని రుణం మాఫీ అయ్యిందో లేదో మరోసారి చూడాలని అధికారులను విజ్ఞప్తిచేయడం కనిపించింది. కరీంనగర్ జిల్లాలో కొందరు బ్యాంకర్లు 'ఇప్పుడు వచ్చింది మొదటి జాబితా మాత్రమే. త్వరలో కొత్త జాబితా వస్తుంది. అందులో మీ పేర్లు ఉండే అవకాశం ఉన్నది' అంటూ సముదాయించి పంపుతున్నారు. ఇది వాస్తవమేనా? అని 'నమస్తే తెలంగాణ' ఆరా తీయగా 'మా పై అధికారులు కూడా ఇదే చెప్తున్నారు. మార్పులు, చేర్పులతో త్వరలో కొత్త జాబితా వస్తుందని చెప్తున్నారు' అని ఒక బ్యాంకు అధికారి పేర్కొన్నారు.

పక్కాగా లెక్కలు, వివరాలు

రాష్ట్రంలో పంట రుణాల మంజూరు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నది. రైతుల పంట రుణం వివరాలు, వారి బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్, పాస్‌బుక్ నంబర్.. వంటివన్నీ బ్యాంకర్ల దగ్గర ఉన్నాయి. ఈ వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖకు, రెవెన్యూ శాఖకు చేరుతున్నాయి. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పక్కాగా ఉంటాయి కాబట్టి.. ఒక్క క్లిక్‌తోనే డాటా మొత్తం వస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఇంత పక్కాగా వివరాలు ఉన్నా లోపాలు ఎందుకు జరిగాయని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం డిసెంబర్‌లో అధికారంలోకి రాగానే రుణమాఫీ కసరత్తు మొదలు పెట్టింది. అప్పటినుంచే రైతుల వివరాలు సేకరించి, పరిశీలిస్తున్నది. ఏడు నెలల సమయం దొరికినా, ఎందుకు కచ్చితమైన వివరాలు సేకరించలేకపోయారని ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. రుణమాఫీ కానివారు మండల కార్యాలయంలో ఫిర్యాదు చేయాలనడంపై రైతులు మండిపడుతున్నారు. వివరాలన్నీ బ్యాంకుల దగ్గర ఉన్నప్పుడు ఎందుకు మళ్లీ దరఖాస్తు చేయాలని ప్రశ్నిస్తున్నారు. వీటిపై ఎప్పుడు మోక్షం కలుగుతుందో? ఎప్పుడు మాఫీ అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కోవ లక్ష్మి

లక్ష రుణమాఫీ కానోళ్లు లక్షల్లోనే..

గోబెల్స్ ఉంటే కాంగ్రెస్ అబద్ధాలకు ఆత్మహత్య చేసుకునేటోడు

రేవంత్ సర్కారు చేసింది గోరంత.. చెప్పేది కొండంత

కేసీఆర్ హయాంలో రైతుల ఖాతాల్లోకి లక్ష కోట్లు: ఎమ్మెల్యే పల్లా

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ గోరంత అయితే చెప్పేది కొండంత ఉందని, గోబెల్స్ బతికి ఉంటే కాంగ్రెస్ చెప్పే అబద్ధాలను చూసి ఆత్మహత్య చేసుకునేటోడని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసింది ఆరువేల కోట్లేనని, మొత్తం రుణాలున్న రైతుల్లో 30 శాతం మందికే రుణమాఫీ అయిందని, డబ్బుల పరంగా చూస్తే ఇది కేవలం 20 శాతం మాత్రమేనని, ఇంకా లక్ష రుణం మాఫీకాని రైతులు లక్షల్లో ఉన్నారని తెలిపారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో పల్లా మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో మొదటి విడతలో 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్ల రుణమాఫీ చేశామని, రెండో విడత 37.33 లక్షల మందికి రూ.19 వేల కోట్లు సిద్ధం చేసుకొని రూ.12 వేల కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. ఇంకా ఏడు వేల కోట్లపై కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేయడంతో ఆ మొత్తం చెల్లించకుండా ఆగిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ ఏడు వేల కోట్లు ఇప్పుడు మంత్రుల కాంట్రాక్టు సంస్థలకు వెళ్లాయని ఆరోపించారు. లక్ష లోపు రుణాల మొత్తం కేసీఆర్ హయాంలో రూ.19 వేల కోట్లుంటే ఇపుడు 6వేల కోట్లకు ఎలా తగ్గిందని, దాదాపు 40 లక్షల మంది లబ్ధిదారులుంటే 11లక్షల మందికే రుణమాఫీ ఎలా చేశారని ప్రశ్నించారు. అంకెల పేరిట రుణమాఫీని కొందరు రైతులకే పరిమితం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రైతుల అకౌంట్లలో సంక్షేమ పథకాల కింద లక్ష కోట్లు జమయ్యాయని, ఇందులో 72 వేల కోట్లు రైతు బంధు ద్వారా, 28 వేల కోట్లు రుణమాఫీ కింద జమ చేశామని చెప్పారు. రైతులకు కేసీఆర్ పాలన అనం దాన్నిస్తే కాంగ్రెస్ ఆందోళన మిగిల్చిందని విమర్శించారు. కేసీఆర్ కట్టిన 2604 రైతు వేదికల్లో కాంగ్రెస్ సంబురాలు చేసుకున్నదని, కేసీఆర్ కట్టిన సచివాలయం నుంచే సీఎం రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. పంట సీజను దాటుతున్నా రైతు భరోసా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు.

హరీశ్‌రావు సవాల్‌ను పక్కకునెట్టారు

హరీశ్‌రావు రాజీనామా సవాల్‌ను సీఎం, కాంగ్రెస్ నేతలు పక్కకునెట్టారని పల్లా తెలిపారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలతో పాటు రైతు రుణమాఫీని ఆగస్టు 15 లోగా అమలు చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ విసిరారని గుర్తుచేశారు. ఇప్పటికీ హరీశ్‌రావు ఆ సవాల్‌కు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. రాజీనామాల నుంచి పారిపోయింది రేవంత్ అని, నిఖార్సుగా నిలబడ్డది హరీశ్‌రావు మాత్రమేనని పల్లా తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ నేతలు రాకేశ్‌రెడ్డి, రాంబాబు యాదవ్, తుంగ బాలు పాల్గొన్నారు.

మోసం చేసినందుకా సంబురాలు?

- రుణమాఫీ అయిన రైతులకన్నా.. కంటతడి పెట్టిన వాళ్లే ఎక్కువ
- ఇప్పటిదాకా అటెన్షన్ డైవర్షన్, ఇప్పుడు ఫండ్స్ డైవర్షన్
- రైతు రుణమాఫీపై ఎక్స్‌లో కేటీఆర్



హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణ మాఫీ 'బారాణ కోడికి బారాణ మసాలా' చందంగా ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు వ్యాఖ్యానించారు. రైతు రుణ మాఫీపై శుక్రవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. ఊరించి, ఊరించి, ఏడు నెలలు ఏమార్చి చేసిన రుణమాఫీ తీరు చూస్తే.. తెలంగాణ ప్రజలకు గుర్తొచ్చిన సామెత 'బారాణ కోడికి.. బారాణ మసాల' అని పేర్కొన్నారు. రుణమాఫీ అయిన రైతుల కన్నా.. కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువ అని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు.. రైతుమాఫీ పథకానికి మరణ శాసనాలయ్యాయని విమర్శించారు. కొంత మంది రైతులకు అన్నివిధాలా అర్హత ఉన్నా.. వారికి రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పేటోడు లేడని ఆరోపించారు. రైతులు గోడు చెప్పుకుందామంటే వినేటోడు లేడని మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులు రుణమాఫీ కాక, అంతులేని ఆందోళనలో ఉంటే మరోవైపు ప్రభుత్వం సంబురాలు జరుపుకోవడం ఎందుకని ప్రశ్నించారు. '40 లక్షల మంది అర్హులైన రైతుల్లో మెజారిటీ రైతులకు నిరాశే మిగిల్చినందుకా..? ముప్పై లక్షల మందిని మోసం చేసినందుకా?' ఎందుకు ఈ సంబురాలు అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు అయినా.. ఇంతవరకు రైతుభరోసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'జూన్‌లో వేయాల్సిన రైతుభరోసా.. జూలై వచ్చినా రైతుల ఖాతాలో వెయ్యలే.. కౌలు రైతులకు ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యనే ఇయ్యలే.. రైతు కూలీలకు.. రూ.12 వేల హామీ ఇంకా అమలే చెయ్యలేదు' అని విమర్శించారు. కాంగ్రెస్ పాలన గురించి.. ఒక్క మాటలో చెప్పాలంటే.. 'ఇంతకాలం.. అటెన్షన్ డైవర్షన్.. ఇప్పుడేమో.. ఫండ్స్ డైవర్షన్' అని వ్యాఖ్యానించారు.

బీఆర్‌ఎస్‌దే ఆల్‌టైం రికార్డు

రైతుల ఖాతాల్లో 1.2 లక్షల కోట్లు: ఎక్స్ వేదికగా హరీశ్‌రావు



హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల ఖాతాల్లో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1.2లక్షల కోట్లు జమచేశామని, ఇది దేశ చరిత్రలో ఆల్ టైం రికార్డ్ అని, ఆ పదేండ్లు సాగుకు స్వర్ణయుగమని మాజీ మంత్రి హరీశ్‌రావు వివరించారు. 69 లక్షల మంది రైతులకు రైతుబంధు ద్వారా రూ.72,872 కోట్లు, 1.11 లక్షల మందికి రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ.6,488 కోట్లు, రెండు దఫాల్లో రుణమాఫీ కింద రూ.29,144.61 కోట్లు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా 11,401 కోట్లు రైతుల అకౌంట్లలో వేశామని శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ పథకాల ద్వారా రైతులకు అందిన ఆర్థిక సాయం రూ.1,20,005 కోట్లు అని తెలిపారు. ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ సిబ్బంది ఏడు నెలలుగా జీతాలందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటి కిరాయి చెల్లించడం కూడా వారికి భారంగా మారిందని, పీఎఫ్ సైతం జమ కావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ సర్కారుకు ఈ చిరుద్యోగుల వేతలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

'రుణ విముక్తి' కలగలే..!

బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

రంగారెడ్డి జిల్లాలో రుణమాఫీ జాబితాలో వేల మంది రైతుల పేర్లు గల్లంతు

రంగారెడ్డి, జూలై 19(నమస్తే తెలంగాణ): 'నందిగామ మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నవారు 33 మంది ఉండగా..12 మందికి మాత్రమే రుణమాఫీ అయింది.' 'చేగూరు పీఏసీఎస్‌లో రూ.లక్షలోపు రుణాలను 264 మంది తీసుకోగా.. అందులో 156 మందికి మాత్రమే రుణమాఫీ అయింది.' రుణ విముక్తి కలగని రైతులు రంగారెడ్డి జిల్లాలో పెద్ద మొత్తంలో ఉన్నట్టు తెలుస్తున్నది. జిల్లాలో 49,741 మంది రైతులకు రూ.278.06 కోట్ల రుణమాఫీ చేసినట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. చాలా మంది రైతుల పేర్లు జాబితాలో గల్లంతయ్యాయని, అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదని ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాని కారణాలను తెలుసుకునేందుకు శుక్రవారం బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలకు పరుగులు పెట్టారు. హైదరాబాద్ నుంచే జాబితాలు వచ్చాయని, తమకేమీ తెలియదని అధికారులు చెబుతున్నారు. మొదటి విడత పరిస్థితే ఇలా ఉంటే.. రెండు, మూడో విడత పరిస్థితి ఎలా ఉంటుందో నన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీకాని వాటిలోమచ్చుకు కొన్ని..

- నందిగామ మండలం మేకగూడ పీఏసీఎస్ పరిధిలో 306 మంది రైతులు రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నారు. వీరిలో 181 మంది రైతులకే రుణమాఫీ అయింది.
- షాద్ నగర్ పీఏసీఎస్ పరిధిలో 313 మందికి రూ.లక్ష లోపు రుణమాఫీ వర్తించాల్సి ఉండగా.. కేవలం 174 మంది పేర్లే జాబితాలో ఉన్నాయి.
- కొందుర్గు పీఏసీఎస్ పరిధిలో 1,005 మందికి రూ.లక్ష రుణమాఫీ కావాల్సి ఉండగా 372 మందికే రుణమాఫీ జరిగినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.
- కేశంపేట మండలం కొత్తపేట పీఏసీఎస్ పరిధిలో రూ.లక్ష రుణమాఫీకి 470 మంది అర్హులుకాగా..తొలి జాబితాలో 238 మందికే రుణ విముక్తి కలిగింది.

రుణమాఫీపై చెప్పిందెంత.. చేసిందెంత?

- రైతులను దగా చేసిన రేవంత్ సర్కార్
- ఏదో ఘనకార్యం చేసినట్టు సంబురాలెందుకు?
- కొండను తవ్వి ఎలుకను పట్టినందుకా?: వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): 'డిసెంబర్ 9న చేయాల్సిన రూ.2 లక్షల రుణమాఫీని ఏడు నెలలు ఆలస్యం చేసి, రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ అని గొప్పలు చెప్పుకొని తీరా రూ.6వేల కోట్లే మాఫీచేసి సంబురాలు చేసుకుంటూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది' అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్‌కు ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాల్సిన రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి, ఆ డబ్బుల్లోంచి రుణమాఫీ కింద రూ.6,098 కోట్లు విదిల్చి ఏదో ఘనకార్యం చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నదని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. 'కొండను తవ్వి ఎలుకను పట్టినందుకు సంబురాలు చేసుకోవాలా?.. కాంగ్రెస్ చేసిన మోసానికి రైతులు సంబురాలు చేసుకోవాలా? రైతు రుణమాఫీపై కాంగ్రెస్ చెప్పిందెంత? రేవంత్‌రెడ్డి సర్కార్ ఇస్తున్నదెంత?' అని ప్రశ్నించారు. రైతు సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉన్నదని ఎద్దేవాచేశారు. కేసీఆర్ ఏమీ చేయలేదని.. అంతామేమే చేస్తున్నామనే భ్రమల నుంచి కాంగ్రెస్ సర్కార్ బయటకు రావాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రపంచంలోనే ఏ రాజకీయ నేత చేయని కార్యక్రమాలు కేసీఆర్ చేసి చూపించారని గుర్తుచేశారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్, ధాన్యం కొనుగోళ్లు, రెండు విడతల్లో రూ. 28,000 కోట్ల రుణమాఫీ, మిషన్ కాకతీయ వంటి అనేక పథకాలు అమలు చేసి ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాల ప్రశంసలు పొందారని గుర్తుచేశారు. దేశాన్ని 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

రైతంటే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు.. కేసీఆర్‌కు బాధ్యత

రైతు చేతిలో పురుగు మందు డబ్బాలు, రాత్రిపూట పొలాల్లో పాముకాట్లు కేసీఆర్ పాలనలో బందయ్యాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు 37 లక్షల మంది ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు, లోన్ రీ షెడ్యూల్, ఆదాయపు పన్నుల పేరిట 26 లక్షల మందిని ఏరిపారేసిందని ఆరోపించారు. కేసీఆర్ రెండు విడతల్లో చేసిన రుణమాఫీతో రైతులకు ఏ స్థాయిలో మేలు జరిగిందో వివరించేందుకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను ఉదహరించారు. ఆ జిల్లాల్లో రెండుసార్లు కలిపి లక్షలోపు రుణాలున్న 5,75,177 మంది రైతులకు రూ. 2518 కోట్లు మాఫీ చేశారని గుర్తుచేశారు. అవే జిల్లాల్లో కాంగ్రెస్ సర్కారు ప్రస్తుతం 94,566 మంది రైతులకు రూ. 450 కోట్లు మాత్రమే రుణమాఫీ చేస్తున్నదని వివరించారు. ఈ లెక్కన ఎవరు ఎక్కువ మొత్తం మాఫీ చేశారని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు

మాటలకు చేతలకు పొంతనేది

- బొరంపేటలో 11 మందికే మాఫీ
- ప్రకటనలకు కోట్లు కుమ్మరించారు
- కాంగ్రెస్‌కు ముందుంది ముసళ్ల పండుగ: కేపీ వివేకానంద
- సీఎంఆర్‌ఎఫ్ విషయంలోనూ వివక్ష: కోవ లక్ష్మి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా బొరంపేట ప్రాథమిక సహకార సంఘంలో రుణాలు తీసుకున్న వారిలో 11 మందికి మాత్రమే మాఫీ అయ్యాయని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్న మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన ఉండటంలేదని దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీపై రేవంత్ దేవుళ్లపై ఒట్లు వేసి వాటిని నిలుపుకోవడానికి తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. పైసాపైసా కూడబెట్టాం, నిద్రలేని రాత్రులు రుణమాఫీ కోసం గడిపామంటున్న సీఎం.. అంత కష్టపడి కూడబెట్టిన రూ.వంద కోట్లు ప్రకటనలకు ఎందుకు ఖర్చు పెట్టారని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రకటనల కోసం వృథాగా డబ్బులు ఖర్చు పెడుతున్నారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ప్రకటనల కోసం ఖర్చు చేస్తున్న డబ్బు రేవంత్ తాతదా? అని మండిపడ్డారు. బొరంపేట ప్రాథమిక సొసైటీలో 632 మంది సభ్యులు ఉంటే, అందులో 500 మంది వరకు రూ.లక్ష లోపు రుణమాఫీకి అర్హులని, కానీ, 11 మందికే మాఫీ అయిందని వివరించారు. దూలపల్లి పీఏసీఎస్ కూడా చాలా తక్కువ మందికే రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం అందరికీ రుణమాఫీ చేసినట్టుగా చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. రైతులు కాంగ్రెస్‌ను వదిలిపెట్టరని, ముం దుంది కాంగ్రెస్‌కు మొసళ్ల పండగ అని హెచ్చరించారు.

ఆరోగ్యంతో రాజకీయమా: కోవ లక్ష్మి

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఒక్క పైసా రాలేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలకు ఒక న్యాయం ఇతర పార్టీలకు ఒక న్యాయం అన్నట్టుగా ఉన్నదని విమర్శించారు. సీఎంఆర్‌ఎఫ్ విషయంలోనూ వివక్ష చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయంలోనూ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వ్యవహరించాలి తప్ప పీసీసీ అధ్యక్షుడిగా కాదని సూచించారు. కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యేలందరినీ ఒకేలా చూశారని గుర్తుచేశారు. రైతుభరోసాపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయాలు మాత్రమే తీసుకుంటున్నదని ఆరోపించారు.



షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

తెలంగాణ చౌక్, జూలై 19: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లోని సీపీఐ ఆఫీసు బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణకు కుట్రతోనే కేంద్రం బొగ్గుబ్లాకుల వేలానికి తెరలేపిందని ఆరోపించారు. కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లుపెట్టే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపాలని కోరారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, రాష్ట్ర సభ్యుడు పొనగంటి కేదారి, న్యాలపల్లి [illegible] ఆశోక్‌కుమార్ ఉన్నారు.



నిబంధనల సాకుతో రుణమాఫీకి ఎగనామం

నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, జూలై 19: నిబంధనల సాకుతో రైతుల రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెట్టిందని నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేవలం రూ. 6 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేసి రూ.31 కోట్లు మాఫీ చేసినట్టు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో రూ.16 వేల కోట్లతో 35లక్షల మందికి, 2023లో రూ.19 వేల కోట్లతో 38 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా, పట్టణాధ్యక్షులు, తోట ఆగయ్య, జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నేత కందర్ప రమేశ్‌గౌడ్ ఉన్నారు.



రుణమాఫీ షరతులతో రైతులకు అన్యాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

నిడమనూరు, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం షరతులతో కూడిన రుణమాఫీ చేయడంతో అర్హులైన పేద రైతులకు అన్యాయం జరుగుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సాంకేతిక కారణాలతో ధరణిలో నమోదు కాని భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ కాలేదని, ఈ కారణంగా రైతులకు రుణమాఫీ వర్తింప చేయకపోవడం సరికాదని హితవుపలికారు. పంట పెట్టుబడుల కోసం పేద రైతులు, కౌలు రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగారని, బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారని తెలిపారు. వారందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీ ఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్ ఉన్నారు.



కూతురు ఫొటోకు కడియం క్షీరాభిషేకం

సోషల్ మీడియాలో వైరల్

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 19: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కూతురు ఎంపీ కడియం కావ్య చిత్ర పటానికి క్షీరాభిషేకం చేయడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గురువారం జనగామ జిల్లా లింగాల్ ఘన్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన ఎంపీటీసీల వీడ్కోలు, సన్మాన సమావేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం అనంతరం రూ.2 లక్షల పంట రుణాల మాఫీ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రైతులతో కలిసి సంబురాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఎం ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కడియం శ్రీహరి క్షీరాభిషేకం చేశారు. ఆ ఫ్లెక్సీలో ఉన్న తన కూతురు ఎంపీ కడియం కావ్య ఫొటోపై కూడా శ్రీహరి పాలు పోశారు.



రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కార్పొరేషన్, జూలై 19: వానకాలం పంటలకు ఇవ్వాల్సిన రైతుభరోసాను ఎగ్గొట్టి ఆ నిధులతో రుణమాఫీ చేసిందని ప్రభుత్వంపై రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ధ్వజమెత్తారు. లక్ష రుణమాఫీలోనూ కోతలు పెట్టి రూ.2 లక్షలు అంటూ అబద్ధాలు చెబుతున్నదని విమర్శించారు. రైతుభరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతు భరోసా సొమ్ము రూ.20 వేల కోట్లకు పైగా ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల రైతులు లక్ష వరకు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే రుణమాఫీకి ఎంపికచేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. 2014లో కేసీఆర్ లక్షలోపు రుణాలు తీసుకున్న 35 లక్షల మందికి 16,144 కోట్లు చెల్లించారని, 2018లో అదే లక్షలోపు రుణమాఫీకి రూ.19,198 కోట్లు అందగా కాగా మొత్తం లబ్ధిదారుల సంఖ్య సుమారు 37 లక్షలని వెల్లడించారు.



రైతుబంధు రద్దుకు సర్కారు కుట్ర

మేడె రాజీవ్‌సాగర్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ పేరుతో రైతుబంధు పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 40 లక్షలకు పైగా రైతులు లక్షలోపు పంట రుణాలు తీసుకుంటే వారిలో 11 లక్షల మందికే మాఫీ చేయడం ఎంతవరకు సమంజసమని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో లక్ష లోపు రుణమాఫీకి రూ.19 వేల కోట్లయితే, కాంగ్రెస్ సర్కారు రూ.6098 కోట్లు మాత్రమే మాఫీ చేసిందని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావును రాజీనామా చేయాలని అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని రాజీవ్‌సాగర్ పేర్కొన్నారు.



విద్యుత్తు షాక్‌తో యువరైతు మృతి

ప్రాణం తీసిన అధికారుల నిర్లక్ష్యం

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, జూలై 19: పొలంలో నాటు వేయడానికి వెళ్లిన యువ రైతు విద్యుత్తు షాక్‌తో మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. అన్నాసాగర్‌కు చెందిన కొనగల్ల రవి (35)కి భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం తన పొలంలో నాటు వేయడానికి గంపలో వరి నారు పెట్టుకొని వెళ్తుండగా, 11 కేవీ విద్యుత్తు వైర్లు నారుకు తగిలి షాక్ రావడంతో రవి అక్కడే పడిపోయాడు. స్థానికులు వెంటనే ఎల్లారెడ్డి దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అధికారుల నిర్లక్ష్యంతోనే రవి మృతి చెందాడని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఏడీఈ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. 11కేవీ విద్యుత్తు వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయని, వాటిని సరిచేయాలని నెల క్రితమే ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం చేయడంతోనే రవి మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రుణమాఫీపై రైతన్న రణం

కాంగ్రెస్ మాటే శిలాశాసనం అంటూ రుణమాఫీపై సంబురాలు చేసిన ప్రభుత్వాన్ని రైతులు శాపనార్థాలు పెడుతున్నారు. గురువారం ఒక్కరోజే లక్షలోపు రుణాలన్నీ మాఫీఅయ్యాయని అదరగొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకుల ప్రకటనలు నమ్మి బ్యాంకులకు వెళ్లిన అన్నదాతలకు చుక్కెదురు అయింది. రుణమాఫీ జాబితాలో భూతద్దం పెట్టి వెతికినా పేరు కనిపించకపోవడంతో కన్నీరు పెట్టారు. మిత్తితో కలిపి లక్షలోపు రుణం ఉన్నా మాఫీ ఎందుకు కాలేదని ప్రశ్నిస్తే సమాధానం చెప్పే నాథుడే దొరకలేదు. వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు ఒకరిపైఒకరు నెపాన్ని నెట్టేసుకుని రైతులకు ముఖం చాటేశారు. మార్పు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మితే.. మోసపోతిమి కదరా.. రామా..! అంటూ రైతులు తలలు పట్టుకున్నారు. రుణ మాఫీ కాకపోతే కర్షకు కాల్చుకునేవని హెచ్చరించారు.

రుణమాఫీపై సప్పుడులేదు



నాకు ఎకరం 10 గుంటల భూమి ఉంది. రెండేండ్ల క్రితం ఏపీ గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో 90 వేలు అప్పు తీసుకున్నా. బ్యాంకుకు వచ్చి అడిగితే నీ పేరు రాలేదు.. రుణమాఫీ కాలేదు అంటున్నారు. ఎందుకు కాలేదు అనని అడిగితే సదీసప్పుడు చేస్తలేరు.

-పరమాల ఎల్లయ్య, పుల్లూరు, సిద్దిపేట జిల్లా

చెప్పేదొకటి.. చేసేదొకటి



నేను రూ.95 వేల రుణం తీసుకున్న. లెక్క ప్రకారం నాకు వస్తదని అధికారులు చెప్పిన్రు. కానీ నాపేరు లిస్ట్‌లో లేదు. రుణమాఫీ కాలే. కాంగ్రెస్ సర్కారు చెప్పేదొకటి.. చేసేదొకటని అర్థమయితంది. ఇప్పుడే ఇట్లుంటే కాంగ్రెస్ సర్కారు ముందుముందు ఎట్లుంటదో సూడాలె. ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్ష లోపు ఉన్నోళ్లందరికీ వెంటనే రుణమాఫీ చేయాలె.

-కూచనపల్లి రాకేశ్, యువరైతు, వీణవంక (19కేఎంఎన్‌ఆర్08బి)

రైతులను మోసం చేయొద్దు



నేను మాక్లూర్‌లోని ఇండియన్ బ్యాంక్‌లో రూ.75వేలు పంట రుణం తీసుకున్నా. కానీ రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. నిబంధనలకు లోబడి ఉన్న అర్హులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలి. రుణమాఫీలో కొర్రీలు పెట్టి రైతులను మోసం చేయొద్దు. - కుమ్మరి గంగాధర్, మాక్లూర్, నిజామాబాద్ జిల్లా


ఎవ్వరూ చెప్తలేరు



నాకు జఫర్‌గఢ్‌లోని ఏపీజీవీబీలో రూ.60 వేలు బాకీ ఉంది. నాతో పాటు చాలామందికి రుణమాఫీ కాలేదు. వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులను ఎవ్వరిని అడిగినా సక్కగ చెప్తలేరు. ఇప్పటికైనా రైతుల రుణమాఫీని వెంటనే చేయాలి.

- కొదురుపాక సుధీర్, సాగరం, జనగామ జిల్లా

కేసీఆర్ చేసిండు.. కాంగ్రెస్ చేయలేదు



నాకు ఎకరన్నర పొలం ఉన్నది. సాగు కోసం బ్యాంకు నుంచి అప్పు తీసుకున్నాను. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.56 వేలు మాఫీ కాగా.. ఇప్పుడు రూ.28 వేలు రుణం ఉన్నది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తుందని ప్రకటించడంతో డబ్బులు చెల్లించలేదు. తీరా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన లిస్ట్‌లో నా పేరు కనిపించడం లేదు.

-రాజేందర్, కోటకదిర, మహబూబ్‌నగర్

సగం మాఫీ చేసి సంబురాలా ?



కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ అన్నది. నాకున్న రూ.75 వేల రుణాన్ని మాఫీ చేయలేదు. రూ.56 వేలు మాత్రమే మాఫీ అయ్యిందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. సగం డబ్బులే మాఫీ చేసి.. కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటు.

- కృష్ణయ్య, మక్తల్, నారాయణపేట



భువనగిరి యూనియన్ బ్యాంక్ వద్ద అంటించిన రుణమాఫీ జాబితాలో తమ పేరు ఉందో, లేదో చూసుకుంటున్న రైతులు

సర్కారుకు మంచిది కాదు



నాకు ఎకరం భూమి ఉంది. ఏడాది క్రితం పీఏసీఎస్‌లో 40 వేల రుణం తీసుకున్నా. సహకార సంఘం వద్దకు వస్తే జాబితాలో పేరు లేదు. మాలాంటి పేదలోళ్లను తిప్పడం సర్కారుకు మంచిది కాదు.

-కల్లూరి రామిరెడ్డి, ధర్మారెడ్డిగూడెం, యాదాద్రిభువనగిరి జిల్లా

మాఫీ చేస్తదో.. చేయదో?



నాకు రెండెకరాల భూమి ఉంది. యూనియన్ బ్యాంకుల క్రాప్ లోన్ రూ.72 వేలు తీసుకున్న. రుణమాఫీ లిస్ట్‌లో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే సరిగ చెప్తలేరు. బ్యాంకుకు వస్తే ఇప్పుడు చెప్ప మని పోయినా అన్నరు. కొద్దిరోజులకు రెండో దఫా మాఫీ చేసినప్పుడు అయితదని చెప్పిండ్రు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తదో చేయదో తెలుస్తలేదు.

- పేరం నాగేశ్వరరావు, తొడుపునూరపల్లి, మహబూబాబాద్ జిల్లా

నాకెందుకు మాఫీ కాదు ?



నాకు ఎకరంన్నర భూమి ఉంది. కోహీర్ బ్యాంకులో 2023 ఆగస్టు 30న రూ.80వేల రుణం తీసుకున్నా. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.80,708 అయింది. మాఫీ ఎందుకు కాలేదని బ్యాంకు అధికారులను అడిగితే లోన్ తీసుకున్న వివరాల పేపరు తీసి నా చేతిలో పెట్టారు. మా కుటుంబంలో నేను ఒక్కడినే మాత్రమే లోన్ తీసుకున్నా. అయినా ఎందుకు కాలేదో ఎవరూ చెప్పడం లేదు.

-శంకర్, కోహీర్‌గ్రామం, సంగారెడ్డి జిల్లా

జాబితాలో పేరున్నా డబ్బులు రాలేదు



నాకున్న ఎకరం భూమి ఉంది. ఏపీజీవీబీలో రూ.60 వేలు రుణం తీసుకున్నా. బ్యాంకుకు వెళ్లి రుణ మాఫీ గురించి అడిగితే డబ్బులు రాలేదని మేనేజర్ చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులకు వద్దకు వెళ్లి తెలుసుకోవ్వాలని చెప్పారు. జాబితాలో నా పేరు ఉన్నా.. ఖాతాలో డబ్బులు జమ కాలేదు.

-గనపారపు కృష్ణ, లక్ష్మీపురం, ఖమ్మం


మాఫీ కొందరికే



నాకు కడ్తాల్‌లో 1.21 ఎకరాల పొలం ఉంది. కెనరా బ్యాంక్‌లో రూ.66 వేల రుణం తీసుకున్నాను. బ్యాంక్‌కి వెళ్లి అధికారులను అడిగితే నీ పేరు లిస్ట్‌లో లేదని చెబుతున్నారు. రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఏ విధంగా చేస్తుందో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికి రుణమాఫీ చేసి, మరికొందరికి చేయకపోవడం అన్యాయం.

- ఎగిరిశెట్టి దశరథం, కడ్తాల్, రంగారెడ్డి జిల్లా

మోసపోతిమి గదరా..రామా!



ఎన్నికల ముందు కాంగ్రెసోళ్లు ఏకకాలంలో రుణమాఫీ చేస్తమన్నరు. గిప్పుడేమో మూడు విడతల్లో అంటున్నరు. గురువారం ఊరులో 10 నుంచి 20 మందికే వచ్చింది. గిది న్యాయమేనా రేవంత్‌రెడ్డి సారూ.. ప్రభుత్వం చేసిన జిమ్మిక్కు రాత్రేడాగేదా ఏంటి.. ఏవో సార్ టేబుల్ ఆధార్ నంబర్ కొడితే రుణమాఫీ చేసిన బాగోతం బయట పడుతూనే ఉంది. రేవంత్ సార్ తప్పకుండా రుణమాఫీ చేస్తడని ఆశ పడ్డం. గిట్లైతదనుకోలే. మార్పు మార్పు అని మోసపోతిమి గదరా.. రామా..

- గుండాల కుమారస్వామి, నల్లబెల్లి, వరంగల్ జిల్లా


247లో 97మందికే మాఫీ



గీసుగొండ సొసైటీలో నేను రూ. 75 వేలు రుణం తీసుకున్న. గత సంవత్సరం వడ్డీ కట్టిన. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తా మని చెప్పడంతో ఆనంద పడ్డా. కానీ రుణ మాఫీ లిస్టులో నా పేరు లేదు. దీనిపై ఎవ్వ లను అడిగినా కరెక్టుగ చెప్తలేరు. గీసుగొండ సొసైటీ పరిధిలో లక్ష లోపు రుణం ఉన్న రైతులు 247 మంది లిస్టు పంపితే అందులో 97 మంది రైతులకే మాఫీ వచ్చింది. మిగతా రైతులు ఆందోళన చెందుతున్నరు.

- మంద గోపాల్, బొడ్డుచింతలపల్లి, వరంగల్ జిల్లా

31వేలే.. మాఫీ కాలే



నాకు బేతంపూడి సొసైటీలో రూ.31వేల క్రాప్ లోన్ ఉంది. ప్రతి సంవత్సరం రుణానికి వడ్డీ కట్టి రెన్యూవల్ చేయించుకుంటున్నా. కానీ రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు. రూ.2 లక్షలలోపు పూర్తిస్థాయిలో మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పేద రైతును నేను. రుణమాఫీ చేయాలని చేతులెత్తి దండంపెట్టి కోరుతున్నా.

- భూక్యావత్ జయరాం, కొత్తతండా, భద్రాద్రి కొత్తగూడెం

60 వేలే అప్పు.. అయినా కాలేదు



నాకున్న ఎకరం భూమిపై తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.60వేల క్రాప్‌లోన్ తీసుకున్న. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రూ.లక్షలోపు రుణమాఫీ అని ప్రకటించింది. సంబురాలు కూడా చేసింది. నేను బ్యాంకు వెళితే లిస్ట్‌లో నా పేరు లేదు. అధికారులు పరిశీలించి బ్యాంకు రుణాన్ని మాఫీ చేసి ఆదుకోవాలి.

-ఆత్మ నాగోరావు, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్

కేసీఆర్ మిత్తితోటి మాఫీ చేసిండు..



నాకు ఎల్లారెడ్డిపేట శివారులో వ్యవసాయ భూమి ఉంది. కేసీఆర్ ఉన్నప్పుడు మిత్తితోటి రూ.25 వేలు మాఫీ అయింది. మళ్లీ రూ.25 వేల పంట రుణం తీసుకున్న. కానీ ఇప్పుడు లిస్టులో నాపేరు రాలేదు. రూ.25 వేల అప్పుకు మాఫీ ఎందుకు కాలేదని అడిగేతందుకు బ్యాంకుకు వచ్చిన.

- బుర్ర నర్సయ్య, ఎల్లారెడ్డిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా

రేషన్‌కార్డు లేదంటున్నరు



కాదిపల్ల దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో పట్టాదారు పాస్ పుస్తకం పెట్టి పోయినేడాది రూ.60 వేలు పంట రుణం తీసుకున్న. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రూ. లక్ష వరకు రుణ మాఫీ చేస్తున్నట్టు చెప్పిన్రు. లిస్టులో నా పేరు లేకపోవడంతో బ్యాంకుకు వెళ్లి అడిగిన. ఇప్పటి వరకు వడ్డీతో కలిపి రూ.71 వేలు అయినట్టు చెప్పిన్రు. రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ కాలేదంటున్నరు.

- మల్క భాస్కర్‌రావు, కాదిపల్ల, జయశంకర్ భూపాలపల్లి

గిట్ల చేస్తరనుకోలే



నాకు ఎకరం భూమి ఉంది. పట్టా పుస్తకంతో సాగుకు రూ. 45 వేల రుణం తీసుకున్న. నాకు పెండ్లి అయ్యింది. పిల్లలు ఉన్నరు. రేషన్ కార్డు మాత్రం లేదు. రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేస్తామని చెప్పిన్రు. నేను వందకు వంద శాతం అర్హున్ని. అయినా నాకు రుణమాఫీ కాలే. రుణమాఫీ చేస్తమని వాగ్దానం చేసి.. ఇప్పుడేమో గిట్ల చేస్తరనుకోలే.

- ఎంబడి తిరుపతి, రైతు, లక్సెట్టిపేట, మంచిర్యాల జిల్లా



వడ్డీ చెల్లిస్తేనే మాఫీ చేస్తరట..

2021లో రూ.35 వేలు పంట కోసం రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేశామని ప్రకటించడంతో బ్యాంకుకు వచ్చాను. బ్యాంకు అధికారులను అడిగితే ఇంకా రూ.6వేలు వడ్డీ చెల్లించాల్సి ఉందని చెప్పారు. వాటిని చెల్లిస్తేనే రుణం మాఫీ అవుతుందంటున్నారు. అసలు రుణం, వడ్డీతో కలిపి రూ.లక్షలోపు కూడా లేదు. కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్షలోపు రుణం వడ్డీతో సహా మాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అసలు మాఫీ చేసి, వడ్డీ చేయడంలేదు. ఇదేమి న్యాయం ?

-బోయ హన్మంతు, ఉప్పేరు, జోగులాంబ గద్వాల

నిరాశే మిగిలింది



నాకు 1.04 గుంటల భూమి ఉంది. 2018 డిసెంబరులో బొంరాస్‌పేట ఎస్‌బీఐలో రూ.48 వేలు పంటరుణం తీసుకున్న. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ లోనే రుణం తీసుకున్న. మాఫీ అవుతుందని ఎంతో ఎదురు చూశా. కానీ లబ్ధిదారుల జాబితాలో నా పేరు లేకపోవడంతో నిరాశే మిగిలింది. ఎందుకు రుణమాఫీ కాలేదో అర్థం కావడం లేదు.

-రమేశ్‌గౌడ్, తుంకిమెట్ల, వికారాబాద్ జిల్లా

మమ్మల్ని మాట్లాడనివ్వరా?



కరీంనగర్ శివారులోని వీ కన్వెన్షన్‌లో జరిగిన అభిప్రాయ సేకరణలో రైతులతో మాట్లాడుతున్న మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్

- క్లైజ్ వద్ద రైతుల ఆందోళన
- రైతులను మాట్లాడకుండా నియంత్రించిన మంత్రులు
- ఉమ్మడి కరీంనగర్‌లో తూతూ మంత్రంగా 'రైతు భరోసా' అభిప్రాయ సేకరణ

కరీంనగర్, జూలై 19 (నమస్తే తెలంగాణ): 'మీరే మాట్లాడుకుంటారా.. మాకు అవకాశం ఇవ్వరా?' అని రైతు భరోసా అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులపై రైతులు మండిపడ్డారు. కార్యక్రమంలో రసాభాస జరగడంతో ఎవరు.. ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ శుక్రవారం కరీంనగర్ శివారులోని వీ కన్వెన్షన్‌లో జరిగింది. దీనికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 19 మంది రైతులతో అధికారులు మాట్లాడించారు. రైతులకు ఒక్క నిమిషం సమయం మాత్రమే ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన రైతు నారాయణరెడ్డి మాట్లాడుతూ రియల్ భూములకు రైతు భరోసా ఇవ్వరాదని అన్నారు. పంట సాగుకు ముందే రైతు భరోసా ఇస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని ఆయన మాట్లాడుతుండగానే మరో రైతును పిలిచి సమయం లేదని చెప్పడం గమనార్హం. ఇలా చాలా మంది రైతులను మధ్యలోనే ఆపేసి పంపించడం కనిపించింది. రైతు భరోసాపై జరిగిన అభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా జరిగిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది.

భరోసా అమలు చేస్తాం : మంత్రి తుమ్మల

ఎన్ని ఆటంకాలు ఎదురైనా రైతు భరోసా అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టంచేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు రుణమాఫీ పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి హామీని అమలు చేసి తీరుతామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తమది ప్రజాపాలన అని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రుణమాఫీ వర్తించదని, రేషన్ కార్డు ప్రాతిపదికన రుణమాఫీ జరుగుతుందని కొందరు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఐదెకరాలు ఉన్న వారికే మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి సూచించారు. సమావేశంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చింతకుంట విజయరమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణపై చెరగని సంతకం



జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

పాలకులు వస్తుంటారు, పోతుంటారు. కానీ, కొంతమందే ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకుంటారు. అనితర సాధ్యమనుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేయడమే కాకుండా, తెలంగాణ వస్తే ఏమొస్తుందని అనుకున్నామో వాటిని కండ్లముందే ఆవిష్కరించారు, తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్నారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. ఒక వ్యక్తి కాని, వ్యవస్థ కాని గొప్ప పేరు సంపాదిస్తే వాళ్లను తక్కువగా చూపించి, వారిపై బురద చల్లాలని కొందరు కుయుక్తులు పన్నుతూనే ఉంటారు. మరీ ముఖ్యంగా రాజకీయాల్లో.

కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని మరిపించి.. కాళేశ్వరంలో అవినీతి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు కేసీఆర్‌పై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కొత్తగా గెలిచాం, ప్రజలకు ఏమైనా మంచి పనులు చేద్దాం అన్న సోయిని మరిచి, ఎదురుదాడి దిగేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్ హయాంలో ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమంలో ముందుకు సాగుతుండగా.. గోరంత సమస్యలను కొండంతగా చూపింది, విష ప్రచారం చేయడం మూలంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. 'మనం మంచి చేస్తున్నాం కదా, వాళ్లు చెడుగా చెప్పినంత మాత్రాన అయ్యేదేమున్నది, ప్రజలు వాళ్ల మాటలు నమ్ముతారా' అని అనుకోవడం మూలంగా జరగరాని నష్టం జరిగింది బీఆర్‌ఎస్‌కు, తెలంగాణకు. చెడుతో సమాంతరంగా మంచి కూడా ప్రచారం చేస్తూనే ఉండాలని అంటారు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్. అయితే ఎవరెన్ని విమర్శలు చేసినా సత్యం ఎప్పటికీ సత్యమే అవుతుంది. తెలంగాణలో పదేండ్లలో జరిగిన అభివృద్ధి కేసీఆర్ పాలనలో 9 ఏండ్లలోనే జరిగిందనేది వాస్తవం. రైతుబంధు స్థానంలో రైతు భరోసా ఇస్తామని చెప్పి చేతులెత్తేసిన రేవంత్ సర్కార్ రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఇప్పుడు ఊదరగొడుతున్నది. వాస్తవానికి కేసీఆర్ పాలనలో రెండుసార్లు రుణమాఫీ జరిగింది. మొదటిసారి 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్లు, రెండవసారి 22.98 లక్షల మంది రైతులకు రూ.13,000 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయి. రేవంత్ సర్కార్ రూ.లక్ష వరకు రుణమాఫీ అంటూ అంక్షలు పెట్టి రైతుల సంఖ్యను కుదిస్తున్నది. 11.42 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.6098 కోట్ల రుణాన్ని మాత్రమే మాఫీ చేసింది. 'మూడు రంగుల జెండా పట్టి సింహమోలె కదిలినారు.. మా రేవంతన్న' అంటూ మురిసి ఒక్కటైన వారు నేడు రంగులేరుకుంటున్నారు.

రోహిణి కార్తె వచ్చింది. గతంలో ఈపాటికే రైతుబంధు డబ్బులు పడ్డాయా? అని రైతులు ఫోన్ల వైపు చూసేవారు. ఎలాంటి మెసేజ్ వచ్చినా ఖాతాలో డబ్బులకు సంబంధించి మెసేజ్ వచ్చిందేమో అని చూసేవారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఇప్పటి వరకు రైతుబంధు పైసలు జమ కాలేదు. రైతు బిడ్డ కేసీఆర్ అహర్నిశలు రైతుల బాగోగుల గురించే ఆలోచించేవారు. తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల గురించి కాబట్టి, వాటిని అమలు చేయడానికి శాయశక్తులా కృషి చేశారు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా రైతులకు మాత్రం రైతు బంధు ఆపలేదు. వానాకాలం, యాసంగిలో పంట సాగు సమయంలో రైతు బంధు డబ్బులు



రైతుల ఖాతాల్లో జమచేసేవారు. కేసీఆర్ పాలనలో పురుడు పోసుకున్న రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయి. అయితే మాటలు కోటలు దాటుతున్నాయి కాని చేతలు గడప దాటనట్టుంది రేవంత్ పాలన. కరెంటు, సాగునీటి కష్టాలకు తోడు పంట పెట్టుబడి సాయం అందని ద్రాక్షగానే మిగిలింది. గత యాసంగి సీజన్ రైతు బంధు వానాకాలంలో విడుదల చేశారు. ఇక వానాకాలం రైతు బంధు ఎప్పుడు ఇస్తారో తెలియదు. ఏడు నెలల్లోనే ఏం కోల్పోయామో ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. నిరుద్యోగుల ఆందోళనలు షురూ అయ్యాయి. గడీల పాలన, దొరల పాలన, మద్యం ఏరులై పారుతుందంటూ ఊదరగొట్టిన యూట్యూబ్ వార్తల దుష్ప్రచారాన్ని ప్రజలు నేడు అసహ్యించుకుంటున్నారు.

ఇక తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఒకసారి అవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం పదవిని త్యజించి, పిడికెడు మందితో ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రజాస్వామిక ఉద్యమంలోకి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌ది. నాటి ఉద్యమంలో నేటి ముఖ్యమంత్రి రేవంత్ పాత్ర సున్నా. టీడీపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పదవిని పట్టుకొని వేలాడారు. ఈ రోజు నీతులు చెప్తున్న కాంగ్రెస్ నాయకులు నాడు అసువులు బాసిన అమరులకు కనీసం నివాళి కూడా అర్పించలేకపోయారన్న విషయాన్ని మరిచిపోరాదు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ సాధించుకొని ఉండేవాళ్లమా? నేడు కొలువు తీరిన నాయకులు ఎక్కడ ఉండేవారో. తెలంగాణను సాధించి, కేసీఆర్‌తో పాటు మనగా వారికి సైతం ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన విషయం మరువరాదు.

> 'తెలంగాణ వస్తే కారు చీకట్లే, కరెంటు ఎక్కడి నుంచి తెచ్చుకుంటారు. మీకు పాలన చేతకాదు'.. ఇలా ఒక్కటేమిటి పోతూ పోతూ సమైక్య పాలకులు ఇచ్చిన ప్రజల్లో ఆందోళన, అలజడి రేపుతూ వెళ్లారు. అయితే ఏడాదిపాటు కరెంటు కష్టాలు ఉంటాయని, తర్వాత మూడు నాలుగేండ్లలో 24 గంటల కరెంటు సరఫరా చేసుకుంటామని కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే మొదట్లోనే చెప్పారు. అన్నట్టుగానే 24 గంటల కరెంటు సరఫరా చేసి సరికొత్త చరిత్ర సృష్టించారు కూడా.

తెలంగాణలో గతంలో తాళిని సైతం కుదువ పెట్టి పెట్టుబడులు సమకూర్చుకున్న రైతుల దయనీయ జీవితాలు పత్రికల్లో కనిపించేవి. అలాంటి పరిస్థితుల్లో దీక్షను చేపట్టుకుంటూ వచ్చే ఉపాధియుద్ధ వెలుగులా కేసీఆర్ రైతులకు అండగా నిలిచారు. రైతు బంధు పథకం రైతులకు కొండంత అండగా నిలిచింది. రైతుబంధు ద్వారా తెలంగాణలో లక్షల మంది రైతులకు కోట్లాది రూపాయలు అందించారు. అలాగే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందించారు. రైతు కుటుంబాలకు అండగా ఉండటానికి పక్కా ప్రణాళికతో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు బీమా పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. రైతు మరణిస్తే వారం రోజుల్లో నామినీకి రూ.5 లక్షల బీమా వచ్చే విధంగా చేశారు. అధికారుల చుట్టూ తిరగకుండా, నయా పైసా ఖర్చు లేకుండా భూమి పట్టా చేసుకునే వీలు ధరణితో కలిగింది. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, నల్లగొండ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరాయి. ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. రైతు సమస్యలను చర్చించి, పరిష్కరించడానికి రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వందలాది రైతు వేదికలు నిర్మించారు. నీటి తీరువాను రద్దు చేయడంతో పాటు పంట ధాన్యాలకు మద్దతు ధర అందించారు. ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం నిలువ కోసం పెద్ద ఎత్తున గోదాములను నిర్మించారు. బిందు సేద్యంతో పాటు, పాలీహౌజ్, గ్రీన్‌హౌజ్ నిర్మాణం కోసం కృషి చేశారు. వరి దిగుబడిలో పదేండ్లలోనే పంజాబ్‌కు దీటుగా నిలిచింది తెలంగాణ.

'సంపద పెంచు, ప్రజలకు పంచు' అనే నినాదంతో కేసీఆర్ ముందుకు సాగారు. ఉమ్మడి పాలనలో పింఛన్ రూ.200 మాత్రమే ఉండగా, వితంతువులు, వృద్ధులకు రూ.2016, దివ్యాంగులకు రూ.4016 అందించి పేదల గుండెల్లో నిలిచిపోయారు కేసీఆర్.

తెలంగాణ రాకతో సింగరేణి దశ దిశ మారిపోయింది. సింగరేణి టర్నోవర్ రూ.12 వేల కోట్ల నుంచి రూ.33 కోట్లకు చేరింది. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనంగా జాతీయ అవార్డులు వచ్చాయి. గురుకుల పాఠశాలలను గణనీయంగా పెంచడంతో పాటు విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. మన ఊరు- మన బడి ద్వారా పాఠశాలల అభివృద్ధి, ఐటీ పరిశ్రమలు, జిల్లాకు ఒక వైద్య కళాశాలల ఏర్పాటు, కంటి వెలుగు, డయాలసిస్ సౌకర్యం, బస్తీ, పల్లె దవాఖానలు, కేసీఆర్ పోషకాహార కిట్లు, హైదరాబాద్ నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, 4 లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు, అన్ని హంగులతో సచివాలయం, యాదాద్రిని గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దడం, ఆసరా, చేయూత ఇలా ఎన్నో కార్యక్రమాలకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తెలంగాణను దేశంలోనే నెం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దిన కేసీఆర్ తెలంగాణపై చెరగని సంతకం చేశారు.

> తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అనాడు రైతుబంధు కోసం ట్రెజరీలో జమ చేసిన రూ.7 వేల కోట్లను డిసెంబర్‌లో ఇవ్వకుండా, అసలు రైతుబంధునే ఎగ్గొట్టి ఇప్పుడు అదే డబ్బును రుణమాఫీ పేరుతో.. కేసీఆర్ కట్టిన 577 రైతు వేదికల్లో ఉన్న రైతులను ఉద్దేశిస్తూ, కేసీఆర్ కట్టిన సచివాలయం నుంచి రుణమాఫీ డబ్బా కొట్టుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ఏక కాలంలో మొత్తం మాఫీ అని హామీ ఇచ్చి విడతల వారీగా, అదీ అరకొరగా ఇస్తూ తనకు అలవాటైన మోసానికి పాల్పడుతున్నది కాంగ్రెస్ పార్టీ.

కేసీఆర్ కట్టిన రైతు వేదికల్లోనే!



శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371



'తిన్నా తినకపోయినా నెలకు ఏడు వేల కోట్ల రూపాయలు మిత్తి కడుతున్నరు భట్టి విక్రమార్క' అని గొప్పలకు పోయిండు రేవంత్ రెడ్డి. కానీ, వాస్తవమేమంటే.. భట్టి గారి సంపాదన ఇప్పుడే ముఖ్యంగా పెరగడం! సచివాలయం, ప్రజాభవన్ వేదికగా భట్టి ద్వారా మాత్రమే కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తున్నరు. ఎవరికెంత ఇస్తే బిల్లు పాస్ అవుతున్నదో కాంట్రాక్టర్లు బహిరంగంగా చెప్తున్నరు. పొంగులేటి సారు లీలలు వేరేలెవెల్! మిగిలిన మంత్రులదీ ఇదే దారి. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సాండ్, ల్యాండ్ మాఫియాకు హద్దుల్లేవు. కింది నుంచి పైదాకా.. 'నీకింత, నాకింత' వ్యవహారం నడుస్తున్నది. ఇక ఈ కలెక్షన్ల కోసం ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాల రావు లాగా ప్రత్యేకంగా బదావు డిపార్ట్‌మెంట్లే ఏర్పాటైనట్టు చెప్తున్నరు.

ఈ వ్యవహారం ఇట్లా ఉంటే.. హాస్టళ్ల మెస్‌లలో ఎలుకలు, పిల్లులు, బల్లులు రాజ్యమేలుతున్నయి. కుక్కల స్వైరవిహారానికి చిన్నారులు బలైపోతున్నరు. హైదరాబాద్, ఢిల్లీలో ఉద్యోగార్థులు కదం తొక్కుతున్నరు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ నాయకుల పంచాయితీ అడ్డాలుగా మారినయి. హక్కుల గురించి అడిగితే చెప్పుతో కొడతామంటున్నరు. శాంతిభద్రతలు విఫలమై నడిరోడ్లపై నరుక్కు చస్తున్నరు. కరెంట్ లేక రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నయి. ఆస్పత్రుల్లో సౌకర్యాల లేమి తారస్థాయికి చేరింది.

> ఇవేవీ మీడియాకు, మేధావులకు పట్టడం లేదు. తాము భుజాలపై ఎత్తి పట్టిన మరుగుజ్జులను ఇంకా ఇంకా మోస్తున్నరు. నిజాలు దాస్తున్నరు. బీఆర్‌ఎస్ ఆరోపణలను పక్కన పెట్టింది, జనాల ఆక్రందనలు కూడా వీళ్ల మీడియాలో చోటు నోచుకోలేకపోతున్నయి.

అయితే అబద్ధాల పునాదుల మీద కట్టిన మేడ నిలవదు. నాలుగున్నరేండ్లు కాదు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే మీ అంతు చూస్తామని కాంగ్రెస్‌కు హెచ్చరికపూర్వక హెచ్చరికలు అందుతున్నయి వివిధ వర్గాల ప్రజా బాహుళ్యం నుంచి.

> ఇపుడు ఈ రాష్ట్రాన్ని కాపాడే బాధ్యత నికార్సైన తెలంగాణ బిడ్డలపై ఉన్నది. గెలిచినా, ఓడినా.. ఎవరున్నా, ఎవరు పోయినా గులాబీ జెండా రెపరెపలాడుతది, తెలంగాణ మళ్లీ తల ఎత్తుకుని నిలుస్తది!

జై తెలంగాణ!

> కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే బీసీ కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంతేకాదు, అధికారంలోకి వచ్చాక బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి, ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని, ఐదేండ్లలో మొత్తంగా లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి రాష్ట్ర సీఎం అయ్యారే కానీ, ఇచ్చిన మాట మాత్రం నిలబెట్టుకోలేకపోయారు. కులగణన, సబ్‌ప్లాన్‌తో సహా అన్ని అంశాలను విస్మరించి బీసీలను దగా చేశారు.

రిజర్వేషన్లు కల్పించాలె



బూర్గుపల్లి కృష్ణయాదవ్
98661 70384



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలైంది. సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్నది. రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరుగుతాయి. ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉండి ఉంటే ఈపాటికే కులగణన చేపట్టి, ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేది. ప్రభుత్వం తాత్సారం చేస్తుండటంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది.

ఇక బీసీ డిక్లరేషన్ విషయానికి వస్తే.. ప్రతి మండలానికి బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని, ర్యాంకుతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పింది. కానీ, ఆ హామీ నేటికీ అమలు కాలేదు. ప్రతి జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో బీసీ భవన్ నిర్మిస్తామని, అన్ని కులాల వారికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అర్హులైన వారికి రూ.10 లక్షల రుణాలు అందిస్తామని చెప్పిన మాట తప్పారు.

అంతేకాదు, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అద్భుతమైన పాలన అందిస్తున్నామని గొప్పలకు పోతున్నారు ముఖ్యమంత్రి రేవంత్. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని రేవంత్ చెప్పారు. కానీ, ఆరు నెలలు దాటినా రైతు భరోసా, యువ వికాసం, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల పెట్టుబడి సాయంతో పాటు ఇతర అనేక హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడంపై రాష్ట్ర ప్రజలు గుర్రుగా ఉన్నారు.

> 'మాది రైతు ప్రభుత్వం' అని గొప్పలు చెప్పుకొనే ముఖ్యమంత్రి.. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఎకరాకు రూ.7500 చొప్పున వెంటనే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని వర్గాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనతికాలంలోనే అన్ని వర్గాల్లోనూ వ్యతిరేకతను మూటగట్టుకున్నది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా రేవంత్ సర్కార్ తన తీరును మార్చుకోవాలి. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలి.


దేశ రక్షణను పణంగా పెట్టలేం!

రక్షణ రంగానికి చెందిన మెజారిటీ కాంట్రాక్టులు భారతీయ పరిశ్రమలు, భారతీయ భాగస్వాములతోనే ముడిపడి ఉన్నాయి. ఆత్మనిర్భరత అనేది దేశ రక్షణను పణంగా పెట్టి జరగకూడదు. దేశ రక్షణకే ఎప్పుడూ ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

- ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్, ఐఏఎఫ్ వైస్ చీఫ్



క్లౌడ్ సర్వీసుల భద్రత ప్రశ్నార్థకమేనా?



చెర్కాల శ్రీనివాస్

ఎటువంటి సైబర్ దాడి లేదు.. ఎక్కడా వైరస్ కనబడలేదు.. ముందుగా ఎలాంటి హెచ్చరికా లేదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలను వాడుతున్న కార్పొరేట్ సంస్థల కంప్యూటర్లన్నీ అకస్మాత్తుగా ఆగిపోయాయి. ఎయిర్‌లైన్స్, ఆసుపత్రులు, బ్యాంకులు, ప్రసార మాధ్యమాలకు సంబంధించిన అన్ని కంప్యూటర్ తెరలపై విండోస్ బూట్ స్క్రీన్ వచ్చి ఆగిపోయాయి. ఫలితం, వేల కోట్ల నష్టం. సేవలన్నీ విపరీతమైన ఆలస్యమయ్యాయి. వీలైన కంపెనీలు ఒక్కొక్క కంప్యూటర్ విడిగా పనిచేయాల్సి వచ్చింది. ఇంతటి నష్టానికి కారణమైన మైక్రోసాఫ్ట్, దానికి ఈ రక్షణ వ్యవస్థల సేవలు అందించే సంస్థ అఖరికి చెప్పిందేమిటంటే.. సమస్యను గుర్తించాం.. పరిష్కారం కనుగొన్నాం.. పరిస్థితులు వేగంగా అదుపులోకి వస్తున్నాయని. కానీ, అసలు సమస్య ఎందుకొచ్చింది? అంటే.. ఎవరి దగ్గరా సమాధానం లేదు. బహుశా రాదు కూడా.

క్లౌడ్ సర్వీసెస్.. అంటే, ఒక సంస్థకు అవసరమైన సర్వర్లు, సాఫ్ట్‌వేర్లు, ఇంజినీర్లను సొంతంగా పెట్టుకుని ఆ డాటా సెంటర్‌ను మెయింటేన్ చేయడం కష్టంతో కూడుకున్న పనిగా నిర్ధారిస్తూ.. మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు తాము సొంతంగా భారీ స్థాయిలో డాటా సెంటర్లు నెలకొల్పి, ఆయా సంస్థలకు అద్దె ప్రాతిపదికన సేవలందించడమే క్లౌడ్ కంప్యూటింగ్. సంస్థల సమాచారానికి అత్యంత భద్రత, గోప్యత కల్పిస్తామని హామీ ఇస్తూ మైక్రోసాఫ్ట్ అజూర్ పేరిట ఈ సేవలు ప్రపంచవ్యాప్తంగా ప్రారంభించింది. ఈ సేవలు అందుబాటులోకి వచ్చిన క్షణం నుంచి వెంటనే అన్ని సంస్థలూ, దీనికే మొగ్గుచూపాయి. కారణం, సొంత డాటా సెంటర్లకు భారీ స్థాయి ప్రాథమిక పెట్టుబడులు, మానవ వనరులు, నిరంతర మెయింటెనెన్స్ అవసరం లేకపోవడమే. క్లౌడ్ కంపెనీలకు నెలనెలా అద్దె చెల్లించి, వారి సర్వర్లను వాడుకోవడం అందరికీ సులభంగా కనిపించింది. నిజానికి వాస్తవం కూడా. కానీ, ఇక్కడ సమస్యల్లా సమాచార భద్రత, సర్వర్ల పనితీరు. ఇవాళ జరిగిన ప్రమాదం ఎప్పుడైనా జరిగే అవకాశం ఎప్పుడూ ఉంది. ఎందుకంటే, వ్యవస్థలన్నీ మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ మీద పనిచేయడమే. ప్రపంచంలోని 73 శాతం కంప్యూటర్ వ్యవస్థలు మైక్రోసాఫ్ట్ విండోస్ మీదే నడుస్తాయి. మిగిలిన 27 శాతం మ్యాక్‌లు, లైనక్స్‌ల మీద ఉంటాయి. అసలు సమస్య మొదలైంది ఇక్కడే. విండోస్ ఏకచ్ఛత్రాధిపత్యం వల్ల ప్రపంచ సమాచార వ్యవస్థ పూర్తిగా మైక్రోసాఫ్ట్ గుప్పిట్లోకి వెళ్లిపోయింది. దాంతో సహజంగానే పొరపాట్లు, దాడులు కూడా దానిమీదే ఎక్కువవుతాయి. సరే.. దాడుల సంగతి వేరే అనుకున్నా, మరి పొరపాట్ల సంగతేంటి? నిజానికి అసలు ఈ రోజు జరిగిందేమిటో ఒకసారి చూద్దాం.

మైక్రోసాఫ్ట్ తన ఆపరేటింగ్ సిస్టమ్ విండోస్‌ను సైబర్ దాడులు, వైరస్‌ల నుంచి పూర్తిస్థాయి భద్రత కల్పించేందుకు ఓ మూడు కంపెనీలకు బాధ్యతలను అప్పజెప్పింది. అందులో ఒకటి క్రౌడ్‌స్ట్రైక్. ఇది ఎప్పటికప్పుడు మైక్రోసాఫ్ట్ వ్యవస్థలపై జరుగుతున్న దాడులను ముందే గుర్తించి, వాటికి అనుగుణంగా రక్షణ చిన్న సాఫ్ట్‌వేర్లను తయారుచేసి విండోస్‌కు అప్‌డేట్ రూపంలో పంపిస్తుంది. ఆ అప్‌డేట్ వెంటనే ప్రపంచవ్యాప్తంగా ఉన్న విండోస్ కంప్యూటర్లలో చేరిపోయి, దాడిని సమర్థవంతంగా నిరోధిస్తుంది. అప్పట్లు ఈ క్రౌడ్‌స్ట్రైక్ మైక్రోసాఫ్ట్‌కే కాకుండా ఇతర సంస్థలకు కూడా తన రక్షణ ఉత్పత్తులను అమ్ముతుంది. అయితే ఇవాళ ఉదయం రోజువారీ అప్‌డేట్‌ల పంపకంలో భాగంగా పంపిన ఒకానొక అప్‌డేట్, అకస్మాత్తుగా అన్ని కంప్యూటర్ వ్యవస్థలను కోమాలోకి పంపింది. ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. చూస్తుండగానే ఒక్కో సంస్థ కుప్పకూలడం మొదలైంది. మధ్యాహ్నానికల్లా ప్రపంచవ్యాప్తంగా చాలా పెద్ద సంస్థల్లో పనులు ఆగిపోయాయి. బ్యాంకు లావాదేవీలు, విమానాల రాకపోకలు, ఆసుపత్రులు నిలిచిపోయాయి. ఇలా ప్రజలకు నిత్యావసరాలు ఉన్న చాలా సంస్థల్లో సేవలు స్తంభించాయి. ఇవన్నీ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవ అయిన అజూర్‌ను వాడుతున్నవే. మధ్యాహ్నం తర్వాత క్రౌడ్‌స్ట్రైక్ సంస్థ తాము దీనికి పరిష్కారం కనుగొన్నట్టు, వెంటనే కొత్త అప్‌డేట్ పంపిణీ మొదలైనట్టు ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ మాత్రం దీనిపై ఆచితూచి వ్యవహరిస్తున్నది. విషయం తమ దృష్టికి వచ్చినట్టు, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు, చాలా చోట్ల వ్యవస్థల పనితీరు మెరుగుపడినట్టు చెప్పింది. అంతకుమించి ఎటువంటి బాధ్యతను మైక్రోసాఫ్ట్ తీసుకున్నట్టు కనిపించలేదు.



భారత్‌కు చెందిన ప్రభుత్వ సంస్థ సెర్ట్ (కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్) వెంటనే భారత్‌లో ఈ వైఫల్యానికి గురైన సంస్థలకు అత్యవసర పరిష్కారాన్ని సూచించింది. వినియోగదారులందరూ చెప్పినదాని ప్రకారం తమ కంప్యూటర్లలోని కొత్త అప్‌డేట్‌ను డిలీట్ చేస్తే సమస్య వెంటనే పరిష్కారమవుతుందని చెప్పింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తాము అనుక్షణం మైక్రోసాఫ్ట్‌తో సంప్రదింపుల్లో ఉన్నామని, మన జాతీయ సమాచార కేంద్రాని(ఎన్‌ఐసీ)కి ఎలాంటి ముప్పూ వాటిల్లలేదని తెలిపారు.

ప్రస్తుతానికి సమస్య పరిష్కారమవుతుంది. కానీ, ఇలాంటి సమస్య మళ్లీ రాదని మైక్రోసాఫ్ట్, దాని అనుబంధ సంస్థలు గ్యారంటీ ఇవ్వగలవా? లేదు. ఎప్పటికీ ఇవ్వలేవు. ఎందుకంటే మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ వలయం నుంచి ప్రపంచంలోని ఏ కంప్యూటరూ తప్పుకోలేదు. ఒకటి కాకపోయినా, ఇంకోదానిలైనా మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు వాడాల్సిన పరిస్థితి. జరిగింది ఒక పొరపాటు. పొరపాట్లు మళ్లీ జరగవని చెప్పలేం. ఈ పొరపాట్లే మళ్లీ మళ్లీ సంస్థల పాలిట గ్రహపాట్లుగా మారుతూనే ఉంటాయి. కావాలంటే మైక్రోసాఫ్ట్‌కు ప్రత్యామ్నాయంగా ఒక దీటైన ఆపరేటింగ్ సిస్టమ్ రావాలి. దానికి అన్ని అప్లికేషన్లు తయారుచేసే సంస్థల మద్దతు కావాలి. అది దాదాపుగా అసాధ్యం. ఇప్పటికే 16 శాతం మార్కెట్ షేర్‌తో యాపిల్ మ్యాక్ ఓఎస్ రెండోస్థానంలో ఉంది. ఇంకో ఓఎస్ అయిన లైనక్స్ వాటా 4 శాతమే. అప్లికేషన్లు ఆయా ఓఎస్‌లపై తయారు కాకపోతే ఆ ఓఎస్‌కు మార్కెట్ ఉండదు. ప్రస్తుతం దాదాపుగా అన్ని అప్లికేషన్లు విండోస్ ప్లాట్‌ఫాంపైనే ఉన్నాయి. పెద్దపెద్ద సర్వర్ల విండోస్ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ ఎడిషన్లు తయారుచేసే సామర్థ్యం ఇతర కంపెనీలకు లేదు. దాంతో మైక్రోసాఫ్ట్ ప్రపంచానికి మెడకు చుట్టుకున్న పాములా తయారైంది. అందుకే సైబర్ దాడులూ, వైరస్ దాడులు, రాన్సమ్‌వేర్ దాడులు అన్నీ విండోస్‌ను లక్ష్యంగా చేసుకునే జరుగుతున్నాయి. ఇవాళ జరిగిన భద్రతా అప్‌డేట్ లోపం యాపిల్ మ్యాక్, లైనక్స్‌లను ఏం చేయలేదు. అది విండోస్ సొంత పొరపాటు మాత్రమే.

ఇలా సంస్థలు తమ సొంత సమాచారాన్ని, ఎక్కడో బయట ఉండే సర్వర్లలో నిక్షిప్తం చేసి వాటి ద్వారా వాడుకోవడం ఎంతవరకు సబబు అనేది ప్రశ్నార్థకం. సమాచార భద్రత, గోప్యత అంశాలపై ఆయా క్లౌడ్ సర్వీస్‌లు ఇచ్చే హామీని ఎలా నమ్మాలి? మన సమాచారం బయటికి పొక్కదనే గ్యారంటీ ఏమైనా ఉందా? ఉంటే ఎలా? కావచ్చు.. వారి వద్ద అత్యున్నత స్థాయి సమాచార రక్షణ సామర్థ్యం ఉండొచ్చు గాక. కానీ, నిత్యం హ్యాకర్లు కోట్ల మంది సమాచారాన్ని మార్కెట్లో అమ్ముతున్నారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్‌లో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల కంటే గొప్ప సామర్థ్యం కలిగిన హ్యాకర్లు ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు. ఇజ్రాయెల్ కంపెనీ తయారుచేసిన పెగాసస్ సాఫ్ట్‌వేర్ ప్రపంచంలోని ఏ మొబైల్‌నైనా హ్యాక్ చేయగలదు. కాల్స్ వినగలదు. మెసేజీలు చదవగలదు. వీడియోలు, ఫొటోలు చూడగలదు. ఇంతకంటే నాశనం ఇంకేం కావాలి? అటువంటప్పుడు ఇటువంటి ఒక్క పొరపాటు అరక్షణం పాటు జరిగినా, హ్యాకర్లకు ఆ మాత్రం సమయం చాలు. ఒక్కసారి లోపలికి చొరబడ్డారంటే, తర్వాత చూడటానికి, వాడటానికి ఏం మిగలదు. ఇప్పటికే చైనా హ్యాకర్లు అమెరికా, భారత్ రక్షణ వ్యవస్థలపైనా, ముఖ్యమైన సంస్థలపైనా ఎన్నోసార్లు సైబర్ దాడులు చేశారు. చేస్తారు కూడా. ముఖ్యమైన సమాచారం శత్రువుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. మనం అటువంటి దాడి జరగకుండా ఇంకో రక్షణ గోడ అదనంగా జోడిస్తాం. ఈసారి వాళ్లు దాన్ని కూడా బద్దలు కొట్టే ప్రయత్నం చేస్తారు. మళ్లీ మనం ఇంకో గోడ కడతాం. ఇదో నిరంతర యుద్ధం. ఇందులో విజేతలు, పరాజితులు ఎప్పటికీ ఉండరు.

> మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్‌లో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కంటే గొప్ప సామర్థ్యం కలిగిన హ్యాకర్లు ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు. ఇజ్రాయెల్ కంపెనీ తయారుచేసిన పెగాసస్ సాఫ్ట్‌వేర్ ప్రపంచంలోని ఏ మొబైల్‌నైనా హ్యాక్ చేయగలదు. కాల్స్ వినగలదు. మెసేజీలు చదవగలదు. వీడియోలు, ఫొటోలు చూడగలదు. ఇంతకంటే నాశనం ఇంకేం కావాలి? అటువంటప్పుడు ఇటువంటి ఒక్క పొరపాటు అరక్షణం పాటు జరిగినా, హ్యాకర్లకు ఆ మాత్రం సమయం చాలు.

(వ్యాసకర్త: సీఈఓ ఆపరేషన్స్, తెలంగాణ పబ్లికేషన్స్)

కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధి

- పేదరిక నిర్మూలనలో దేశంలోనే రెండో స్థానం
- నీతి ఆయోగ్ నివేదికపై కేటీఆర్ హర్షం



హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందుకు నీతి ఆయోగ్ విడుదల చేసిన సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్డీజీ) లెక్కలే నిదర్శనమని శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనతోపాటు సుస్థిరమైన అభివృద్ధికి పటిష్ఠ పాటు కేసీఆర్ దీక్షతతో కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ సాధించిన విజయాలను కేంద్ర సంస్థలు ఎన్నో సందర్భాల్లో ప్రశంసించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేదరిక నిర్మూలనలో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందన్న నీతి ఆయోగ్ నివేదికపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 2020-21తో పోలిస్తే 2023-24లో (ఎస్డీజీ)లో 74 స్కోర్‌తో తెలంగాణ ముందుందని చెప్పారు. తక్కువ ధరలో క్లీన్ ఎనర్జీని అందించడంలో 100/100 మార్కులు తెచ్చుకోవడం విశేషమని తెలిపారు. తాగునీటిని అందించడంలో 90/100, అభివృద్ధి, ఆర్థిక వృద్ధిలోనూ 84/100 స్కోరు సాధించడంపై సంతోషం వ్యక్తంచేశారు. కేసీఆర్ విజన్, సాహోసోపేత నిర్ణయాలతో తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మెరుగైనస్థితికి చేర్చిందని, ఈ ప్రభుత్వం కూడా ఆ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. రాజకీయ కక్షలు, ఫిరాయింపులపై పెట్టే దృష్టి.. రాష్ట్రాభివృద్ధిపై పెడితే ప్రజలకు మేలు జరుగుతుందని సూచించారు.

ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలి

- తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కనీస మద్దతుధరకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 2018-19 నుంచి పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతు సాగుకు పెట్టిన పెట్టుబడికి 50శాతం కనీసం మద్దతు ధర నిర్ణయిస్తామని చెప్పినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా సూచించిన ధర కన్నా అతితక్కువగా కనీస మద్దతు ధరను అమలు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకం, పంట నష్టం జరిగిన 30రోజులలోపు పరిహారం చెల్లించేవిధంగా, వ్యవసాయాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




సిద్దిపేట కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

‘ఔట్‌సోర్సింగ్’ పెండింగ్ జీతాలు చెల్లించాలి

- ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 19: ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నారని, పీఎఫ్ డబ్బులు కూడా జమ కావడం లేదని తెలిపారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తక్షణమే ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపాలని, 7 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు.



లోకం పోకడ

మిమ్మల్ని కలవడానికే ఢిల్లీ వస్తున్నాం సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	33.3°c	23.0°c
రంగారెడ్డి	32.0°c	21.9°c
మెదక్	30.6°c	23.5°c
నిజామాబాద్	29.6°c	23.7°c
కరీంనగర్	29.0°c	24.0°c
వరంగల్	29.0°c	22.5°c
నల్లగొండ	29.0°c	22.4°c
హైదరాబాద్	28.2°c	23.1°c
ఖమ్మం	28.0°c	24.0°c
మహబూబ్‌నగర్	25.1°c	22.4°c

కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని నిలిచిన కాళేశ్వరం

- మేడిగడ్డను త్వరలోనే సందర్శిస్తాం
- ఎప్పటికీ గెలిచేది సత్యమే
- ప్రాజెక్టు మీద బురదజల్లితే చరిత్రహీనులే : కేటీఆర్



మేడిగడ్డను పోటెత్తిన వరదపై మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేసిన ఫొటో

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): సత్యమే ఎప్పటికీ గెలుస్తుందని, త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తానని మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. బీఆర్ఎస్ ఎక్స్ అఫీషియల్ హ్యాండిల్‌లో ‘కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టు.. నిండు కుండలా మేడిగడ్డ బ్యారేజీ’ అంటూ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద వీడియోను పోస్టు చేశారు. ‘మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయింది. కాళేశ్వరం కొట్టుకుపోయింది అని కాంగ్రెస్ పార్టీ, వందల కోట్ల యూట్యూబ్ చానెళ్లు నెలల పాటు దుష్ప్రచారం చేసినా.. వాళ్ల కుళ్లు, కుతంత్రాలను వరిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఎదుగుదలను చూసి ఓర్వలేని సన్నాసులు ఎన్ని కుట్రలు చేసినా కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార. కేసీఆర్‌పై, కాళేశ్వరం మీద బురదజల్లే ప్రయత్నం ఎవరు చేసినా చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయం. జై తెలంగాణ’ అంటూ కేటీఆర్ పోస్ట్ చేశారు.

నేడు గవర్నర్‌ను కలవనున్న బీఆర్ఎస్ ప్రతినిధి బృందం

ఫిరాయింపులు, నిరుద్యోగ సమస్యలపై వినతి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలవనుంది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి పలు అంశాలపై ఫిర్యాదు చేయనుంది. ముఖ్యంగా పార్టీ ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాల్సిందిగా గవర్నర్‌ను కోరను న్నది. దానం నాగేందర్, కడియం శ్రీహరి లాంటి నేతల పార్టీ ఫిరాయింపుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసి మూడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఆయన ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేయనున్నది. నిరుద్యోగుల సమస్యలు, వారి పోరాటం, సమైక్యమైన కేసులు తదితర విషయాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లనున్నది.

నేతన్నల ఆత్మహత్యలు పట్టవా..?

- సోమవారం నుంచి ఆందోళన ఉధృతం
- సిరిసిల్లలో కార్మిక నాయకులు



సిరిసిల్లలో జరిగిన ఆసాముల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పవర్‌లూం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

రాజన్న సిరిసిల్ల, జూలై 19 (నమస్తే తెలంగాణ): ఉపాధి లేక నేతన్నలు ఆత్మహత్యలు, ఆకలి చావులకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ప్రభుత్వ విధానాల వల్లే సిరిసిల్ల వస్త్రపరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. లేని పక్షంలో సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థనగర్ అంబభవానీ సమావేశ మందిరంలో శుక్రవారం తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసాములు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ హాజరై, మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ సక్రమంగా నడవక మరమగ్గాలు మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. 30వేల మంది కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో పది మంది కార్మికులు ఆకలిచావులు, ఆత్మహత్యలకు పాల్పడినా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మరమగ్గాలకు 10 హెచ్‌పీల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని, నాలుగో క్యాటగిరీ కింద విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని, పవర్‌లూమ్ మీటర్ల వద్ద ఆర్డర్లు ఇవ్వాలని, 2023 నుంచి కార్మికులకు రావాల్సిన సబ్సిడీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగించాలని తీర్మానించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం వంటావార్పు, మంగళవారం రాస్తారోకో, బుధవారం సిరిసిల్ల పట్టణం బంద్, గురువారం చలో హైదరాబాద్ కార్యక్రమాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి, నాయకులు చేరాల అశోక్, గోనె పర్శరాములు, పోరండ్ల రమేశ్, ప్రకాశ్‌రావు, దూస అశోక్, మండల రాజు, కొండ సుభాష్, చంద్రకాంత్, గోవిందు కనకయ్య, బూర శ్రీను, ఆడెపు కనకరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త హత్య కేసు దర్యాప్తు డైరీ ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కార్యకర్త బీ శ్రీధర్‌రెడ్డి హత్య కేసు దర్యాప్తు డైరీని సమర్పించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఇందుకు జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి పోలీసులకు నాలుగు వారాల గడువు విధించారు. తన కుమారుడి హత్య కేసును దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడంలో పోలీసులు వైఫల్యం చెందుతున్నారని ఆరోపిస్తూ మృతుడి తండ్రి బీ శేఖర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇటీవల విచారణ చేపట్టింది. గత మే 23 తెల్లవారుజామున శ్రీధర్‌రెడ్డిని పదునైన ఆయుధాలతో అతి కిరాతకంగా నరికి చంపారని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ చెప్పారు. హంతకులకు అధికార కాంగ్రెస్ పార్టీలో శత్రువులు ఉన్నారని తెలిపారు. మంత్రిగా కొనసాగుతున్న స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తెచ్చి దర్యాప్తు జరగనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు. దర్యాప్తును తొక్కిపెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. దోషులకు సహాయం చేయడం కోసమే కేసు దర్యాప్తును మందకొడిగా చేస్తున్నారని చెప్పారు. హత్య జరిగి నెల రోజులు దాటుతున్నా పోలీసులు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదని అన్నారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, పోలీసులు ఏడుగురు సాక్షులను విచారించారని, నలభై మందికి పైగా సభ్యులను క్షుణ్ణంగా ప్రశ్నించారని చెప్పారు. పోలీసుల దర్యాప్తు న్యాయమైన రీతిలోనే ఉందని, దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషన్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించి, పిటిషనర్ ఆందోళనను పరిగణనలోకి తీసుకుని కేసు డైరీని నాలుగు వారాల్లోగా సమర్పించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. అప్పటివరకు విచారణను వాయిదా వేసింది.

2 నెలల్లో మానవ హక్కుల కమిషన్

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్రం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల నియామక ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ అద్నాన్ మహమ్మద్ గత ఏడాది వేసిన పిల్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్, జ్యుడీషియల్ సభ్యులు, సాంకేతిక సభ్యుల నియామకానికి మార్చి 10న నోటిఫికేషన్ వెలువడిందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. నియామక ప్రక్రియ పూర్తికి రెండు మాసాల గడువు కావాలని చెప్పారు. దీంతో విచారణ 8 వారాలకు వాయిదా పడింది.

గోదావరికి భారీగా వరద

- లక్ష్మీబరాజ్‌కు 3 లక్షల క్యూసెక్కులు
- భద్రాచలం వద్ద 40.20 మీటర్ల ప్రవాహం
- జూరాలకు 60 వేల క్యూసెక్కులు
- హెడ్‌క్వార్టర్స్ విడిచిపెట్టవద్దు: మంత్రి ఉత్తమ్



ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్, జూలై 19 (నమస్తే తెలంగాణ): ఎగువ రాష్ట్రాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. గోదావరికి వరద పోటెత్తుతున్నది. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. స్థానికంగా కురిసిన కిరాళ్లస్థాయి వర్షాలతోపాటు ప్రాణహిత, ఇంద్రావతి క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి గోదావరికి భారీగా వరద వస్తున్నది. శుక్రవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ప్రవాహం 43 మీటర్లకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 40.20 మీటర్ల మేరకు ప్రవాహం కొనసాగుతున్నది.

మేడిగడ్డ బరాజ్‌కు పెరిగిన వరద

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌లో వరద ఉధృతి పెరుగుతున్నది. శుక్రవారం మేడిగడ్డ బరాజ్‌కు 1,93,550 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బరాజ్‌కు 15 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్టు అధికారులు తెలిపారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద 2.30 లక్షల క్యూసెక్కుల నీరు వస్తున్నది.

మేడిగడ్డపై ఆగని అసత్య ప్రచారాలు

మేడిగడ్డ బరాజ్‌పై అసత్య ప్రచారాలు ఆగడం లేదు. బరాజ్‌లో గత అక్టోబర్ 21న 20 పియర్ కుంగుబాటుకు గురికాగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకు మరమ్మతు పనులు పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం బరాజ్‌లో మరమ్మతు పనుల్లో భాగంగా గ్రౌటింగ్ చేసిన 20, 21 పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయని పుకార్లు చెక్కర్లు కొట్టాయి. దీంతో భారీ నీటి పారుదల శాఖ అధికారులు బరాజ్ వద్ద పరిస్థితిని, గ్రౌటింగ్ చేసిన పియర్‌లను పరిశీలించి ఎలాంటి కుంగుబాటు జరగలేదని నిర్ధారించారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక పంచాయతీ తానిపర్తికి చెందిన బానారి రాజు (45) గోదావరిలో గల్లంతయ్యారు. గురువారం ఉదయం చేపల వేటకు వెళ్లిన రాజు శుక్రవారం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజు ఆచూకీ కోసం గ్రామస్థులు పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా ఘటనా స్థలికి వెళ్లి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

జూరాలకు భారీగా వరద

కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉరకలేస్తున్నది. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ప్రాజెక్టులకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. శుక్రవారం ఆల్మట్టి, తుంగభద్ర, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద వచ్చి చేరుతున్నది. నారాయణపూర్ ప్రాజెక్టు 22 గేట్లు ఎత్తారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమ కాల్వకు ఎన్ఎస్పీ అధికారులు శుక్రవారం నీటిని విడుదలచేశారు. పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు తొలిరోజు 500 క్యూసెక్కులతో ప్రారంభించి, క్రమంగా పెంచుతుంటూ రోజుకు 4,000 క్యూసెక్కుల చొప్పున 4 రోజులపాటు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు.

హెడ్‌క్వార్టర్స్ విడిచిపెట్టవద్దు: మంత్రి ఉత్తమ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట దుర్ఘటన, భారీ నుంచి అతిభారీ వర్షపాతం నమోదయ్యే హెచ్చరికల నేపథ్యంలో చీఫ్ ఇంజినీర్లు, కార్యదర్శి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచిపెట్టవద్దని సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. రాబోయే 48 గంటలలో భారీ, అతి భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సాగునీటిపారుదలశాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ ఆదేశించారు.

కొనసాగుతున్న వర్షాలు

- పోటెత్తుతున్న వరద
- పలు గ్రామాల్లో నిలిచిన రాకపోకలు
- సత్తుపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- అధికారులతో సీఎస్ సమీక్ష

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట పెదవాగుకు వరద పోటెత్తడంతో గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదులుతున్నారు. ఎదపల్లి వాగు పొంగడంతో మహదేవపూర్-కాళేశ్వరం మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మహదేవపూర్ మండలం చంద్రపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ములుగు జిల్లా బొగత జలపాతానికి వరద తాకిడి పెరిగింది. సందర్శకుల రాకపోకలను నిలిపివేశారు. సమ్మక్క- సాగర్ బ్యారేజీ దగ్గర గోదావరి వరద పెరిగింది. 52 గేట్లు ఓపెన్ చేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. కాగజ్‌నగర్‌లో అత్యధికంగా 15.39 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. మరోవైపు పెదవాగుకు వరద పోటెత్తడంపై సీఎస్ శాంతికుమారి సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్, ఎస్పీ, నీటిపారుదల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరుగకుండా చూడాలని ఆదేశించారు. సహాయక కార్యక్రమాల్లో పోలీసులు పాల్గొనాలని డీజీపీ జితేందర్ సూచించారు.

వాయుగుండంగా అల్పపీడనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం వాయుగుండంగా మారిందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. శనివారం తెల్లవారుజామున ఒడిశా తీరాన్ని దాటే అవకాశముందని తెలిపింది. దీంతో రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. ఈ మేరకు రెడ్, ఎల్లో అలర్టులను జారీ చేసింది. ఇంకోవైపు ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది.

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఉత్తర తెలంగాణలోని 11 జిల్లాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. 11 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో కలెక్టర్లతో శుక్రవారం రాత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, హన్మకొండ, జగిత్యాల, ఖమ్మం, కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలిసి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టరేట్లలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేయాలని, పోలీస్ ఇతర శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినాచోంగ్తు పాల్గొన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వద్ద ట్రయల్ రన్ చేసిన ఇంజినీరింగ్ అధికారులు

‘సీతారామ’ ట్రయల్ రన్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ): సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్ రన్‌లో భాగంగా శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులు రెండో మోటర్‌ను ఆన్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఉన్న ఏడు మోటర్లలో మొదటిసారిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ట్రయల్ చేయగా.. రెండో మోటర్‌ను ఇరిగేషన్ అధికారుల బృందం శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించింది. పైపు లైన్ల ద్వారా తయారైన ఈ మోటర్ల పనితీరును అధికారులు పరిశీలించారు. ఆగస్టు కల్లా సాగునీరు అందించేలా అధికారులు పనులను వేగవంతం చేస్తున్నారు.

పెదవాగు.. పెద్ద కష్టం

- పాలకుల వైఫల్యం.. అధికారుల నిర్లక్ష్యం
- భారీ వరదతో అర్ధరాత్రి మూడు గండ్లు
- తాగునీరు, విద్యుత్తు లేక రెండు రోజులుగా అల్లాడుతున్న గ్రామస్థులు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ)/అశ్వారావుపేట రూరల్: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు గురువారం అర్ధరాత్రి గండ్లు పడ్డాయి. రుణమాఫీ సంబురాల్లో మునిగి తేలిన పాలకులు ఇటువైపు కనీసం కన్నెత్తి చూడలేదు. 300 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. 100 ఎకరాల్లో వరి పంటలు, మరో 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు కొట్టుకుపోయాయి. దిగువ గ్రామాల్లో ఇండ్లు నీట మునిగాయి. రహదారులు కోతకు గురయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. తాగునీరు, విద్యుత్తు సరఫరా లేక ఆయా గ్రామాల ప్రజలు రెండు రోజులుగా అల్లాడుతున్నారు.

మొత్తం మూడు గండ్లు

పెదవాగు ప్రాజెక్టుకు మూడు గండ్లు పడ్డాయి. 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు గుమ్మడవల్లి సమీపంలో పెదవాగుపై ప్రాజెక్టు నిర్మించారు. 6 మీటర్ల (40 వేల క్యూసెక్కులు) నీటి సామర్థ్యం, 16 వేల ఎకరాల సాగు లక్ష్యం. గుబ్బల మంగమ్మ అటవీ ప్రాంతం, చుట్టూ ఉన్న కొండల నుంచి వచ్చే వర్షపు నీరే ఆధారం. 1984లో ఈ ప్రాజెక్టుకు ఒకసారి గండి పడింది. 2014లో రాష్ట్ర విభజన తరువాత అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల రైతులు దీని కింద 2,360 ఎకరాలు సాగు చేస్తున్నారు. బచ్చువారిగూడెం, మల్లాయిగూడెం చెరువులకు గండ్లు పడ్డాయి.

విద్యుత్తు శాఖకు భారీ నష్టం

నారాయణపురం-గుమ్మడవల్లి మార్గంలో 508 పైగా విద్యుత్తు స్తంభాలు కూలిపడ్డాయి. పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. గుమ్మడవల్లిలోని 50 నివాసాల్లోకి వరదనీరు చేరింది. జిల్లా రిగూడెంలో పాఠశాల భవనాల్లో తలదాచుకున్నారు.



భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టు గేట్ల పక్కనే పడిన గండి

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే, కలెక్టర్ పర్యటన

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురం గ్రామాల్లో కూలిన ఇండ్లు, ఇసుక మేటలను పరిశీలించారు.

మరమ్మతులకు 10 కోట్లతో అంచనాలు

పెదవాగు ప్రాజెక్టుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.10 కోట్ల నిధులు అవసరమని అంచనా వేస్తున్నట్టు భద్రాద్రి జిల్లా ఎస్‌ఈ సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ నుంచి వరద ఉధృతి పెరగడం వల్లే గండి పడిందని, స్థానిక అధికారుల నిర్లక్ష్యం లేదని చెప్పారు. ప్రాజెక్టు సామర్థ్యం 40 వేల క్యూసెక్కులు కాగా.. ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు.

వరదల నుంచి రక్షణకు ఎస్డీఆర్ఎఫ్ రెడీ

- 50 మంది రెస్క్యూ టీమ్, బోట్లు, రెస్క్యూ సామగ్రి సిద్ధం
- ఈ సారి కొత్తగా ‘ఆపద మిత్ర’ పేరుతో 109 వలంటీర్లు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): వరదలు, భారీ వర్షాల్లో బాధితులను రక్షించేందుకు స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) సంసిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిష్ణాతులైన 50మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వరదల్లో పౌరుల ప్రాణాలను రక్షించేందుకు నిజామాబాద్ నుంచి భద్రాచలం వరకు.. గోదావరి పరివాహకంలో రెస్క్యూ బోట్లతో అగ్నిమాపకశాఖ మోహరించనుందని ఆయన వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి, ఇతర వరద ప్రభావిత జిల్లాల కోసం అత్యవసరమైతే ప్రత్యేక బృందాలను పంపుతామని చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్‌కు ఇండియన్ నైవీ రెస్క్యూ సిబ్బందితో శిక్షణ ఇప్పించామని తెలిపారు. నీళ్లలో, వరదల్లో పౌరులను కాపాడడంపై 73 మంది సిబ్బంది ఇటీవల శిక్షణ తీసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా ‘ఆపద మిత్ర’ పేరుతో వలంటీర్లను సిద్ధం చేస్తున్నామని నాగిరెడ్డి వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 109 మంది ఆపద మిత్రలను సిద్ధం చేశామని, త్వరలో అన్ని జిల్లాల్లో వీరి ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మ్యానిఫెస్టోను తప్పక అమలుచేస్తాం

ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జూలై 19: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టంచేశారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం సంగినేనిపల్లిలో రుణమాఫీ సంబురాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఆర్థిక భారం ఉన్నప్పటికీ అర్హులకు రుణమాఫీ వర్తించేలా కృషి చేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, గృహజ్యోతి, రూ.500కే సిలిండర్ పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. గ్రామంలో ఇండ్లు లేని పేదలను గుర్తించి మొదటి విడతలో 50 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరుచేస్తామని భరోసా ఇచ్చారు.

ఫిషరీస్ కోర్సుల్లో తెలంగాణకు అన్యాయం

- పీహెచ్‌డీ లేకున్నా అవకాశం ఇవ్వాలి
- గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): వెటర్నరీ యూనివర్సిటీలో చేపట్టే ఒప్పంద నియామకాల్లో తెలంగాణ వారికే ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తాత్కాలిక అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీకి దేశవ్యాప్తంగా వెటర్నరీ, ఫిషరీస్ సైన్స్‌లో పీజీ, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థుల ఇంటర్వ్యూలు శుక్రవారంతో ముగిశాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక విద్యార్థులకు అక్కడ ఫిషరీస్ కోర్సుల్లో పీహెచ్‌డీ చదివే అవకాశం ఉండగా, తెలంగాణ అభ్యర్థులకు ఆ అవకాశం లేక పీజీతోనే సరిపెట్టుకుంటున్నారు. దీంతో ఆ పోస్టుల్లో (ఫిషరీస్ కోర్సుల్లో) పీహెచ్‌డీ చేసిన తెలంగాణేతర అభ్యర్థులను భర్తీ చేసే అవకాశం ఉందని ఇంటర్వ్యూకు హాజరైన తెలంగాణ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పోస్టుల్లో తెలంగాణ ప్రాంతం వారికి అవకాశం ఇవ్వాలని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

హైడ్రా చైర్మన్‌గా సీఎం రేవంత్

- ప్రత్యేక పాలక మండలి ఏర్పాటు
- 15మంది ఉన్నతాధికారులతో సబ్ కమిటీ
- హైడ్రా పర్యవేక్షణలో అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ సపోర్ట్‌వింగ్‌ల స్థాపన
- తాజాగా రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం జీవో 99 జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలను కలుపుకొని ఓఆర్‌ఆర్ వరకు ఉన్న ప్రాంతాలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా ఏర్పాటు చేసింది. ఓఆర్‌ఆర్ దాకా హైడ్రాకు అధికార పరిధిని అప్పగించింది. హైడ్రా చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. జీహెచ్‌ఎంసీ చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 మేజర్ గ్రామ పంచాయతీలు హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగుతాయి.

15 మందితో సబ్ కమిటీ

ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా ఏర్పాటు చేస్తున్నట్టు 99 జీవోలో పేర్కొన్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్-2005 ప్రకారం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సబ్ కమిటీ పేరుతో 15 మంది అధికారులతో కూడిన ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా ఉంటారు. హైడ్రా కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, టీజీఎస్‌పీడీ, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీ, ఫైర్ సర్వీసెస్ డీజీ, మెట్రో వాటర్, సీవరేజ్ బోర్డు ఎండీ, హెచ్‌ఎండీఏ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, మెట్రో రైల్ ఎండీ, ఎస్పీడీసీఎల్ ఎండీ, పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ, టీసీయూఆర్ పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. ఈ సబ్ కమిటీ చైర్మన్ సమావేశానికి అదనంగా ఇతర సభ్యులను నామినేట్ చేస్తారని జీవోలో పేర్కొన్నారు. డిజాస్టర్ సబ్ కమిటీ పాలకమండలికి సహాయ సహకారాలు అందిస్తుంది. విపత్తు నిర్వహణ, ప్రణాళికలు, విధివిధానాలను అమలుచేయడంలో ఒక పాలకమండలి తరహాలో వ్యవహరించనున్నది. కాగా ఈ పాలకమండలిలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీల మేయర్లు, చైర్మన్లు, సర్పంచులకు చోటు దక్కలేదు.

ఐదీ విధులు

ప్రణాళిక, నిర్వహణ, సమన్వయం, కార్యాచరణ అమలు కోసం ప్రత్యేక ఏజెన్సీగా హైడ్రా ఉంటుంది. టీసీయూఆర్ ప్రాంతంలో ఏదైనా విపత్తు తలెత్తితే వెంటనే రెస్క్యూ కార్యకలాపాల కోసం సిద్ధంగా ఉండాలి. విపత్తు నిర్వహణ బాధ్యతలను హైడ్రా కమిషనర్ నిర్వర్తిస్తారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి మార్గదర్శకంలో కమిషనర్ నేతృత్వంలో పనిచేసేలా హైడ్రాకు ప్రత్యేక హెచ్‌వోడీ ఉంటారు. జీహెచ్‌ఎంసీ, అన్ని యూఎల్‌బీ, జీపీలతో కలుపుకొని ఓఆర్‌ఆర్ పరిధి వరకు హైడ్రా పర్యవేక్షిస్తుంది. అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ సపోర్ట్ వింగులు హైడ్రా ఆధ్వర్యంలో పనిచేస్తాయి. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ, ఈవీడీఎం పరిధిలో ఉన్న అధికారయంత్రాంగం, సిబ్బంది, వాటికి సమకూర్చిన వాహనాలు మొదలైనవి హైడ్రాలో భాగమై ఉంటాయి. అంతర్గత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు జీహెచ్‌ఎంసీ వద్దే ఉంటాయి. పోస్టులు, సిబ్బంది, వాహనాలు, ఇతర అవసరాలకు బడ్జెట్ ప్రతిపాదనలను హైడ్రా కమిషనర్ సమర్పించాలి. హైడ్రా కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఈ విషయంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని జీవోలో వెల్లడించారు.

12 మందితో పాలకమండలి

హైడ్రా పాలకమండలి చైర్మన్‌గా సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, ఎంఏయూడీ మినిస్టర్ హోదాలో సభ్యుడిగానూ రేవంత్‌రెడ్డి ఉంటారు. రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మినిస్టర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, జీహెచ్‌ఎంసీ మేయర్, చీఫ్ సెక్రటరీ, డీజీపీ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ హెడ్ సభ్యులుగా ఉంటారు. హైడ్రా కమిషనర్‌గా నియమించిన ఐపీఎస్ ఆఫీసర్ ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

- ఇసుక రీచ్‌లలో అక్రమ వసూళ్లు



ఇసుక రీచ్‌ల వద్ద కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలంగాణ స్టేట్ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్‌కు ఫిర్యాదు చేసింది. ఉపాధ్యక్షుడు యాదయ్య, సభ్యులు యాదగిరి, చంద్రయ్య, లింగన్న, వెంకటేశ్, చంద్రం, శేఖర్, రమేశ్, వెంకటేశ్ ఉన్నారు- హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)

ఏఎంసీ పాలకవర్గాల నియామకం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు నూతన చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు పాలకవర్గాలను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లా చేర్యాల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నల్లనగుల్ల శ్వేత, వైస్ చైర్మన్‌గా కమిడి జీవన్‌రెడ్డి, వనపర్తి రోడ్డు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పల్లెపాగ ప్రశాంత్, వైస్ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి, దేవరకద్ర అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కథలప్ప, వైస్ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి, బొప్పరండి అగ్రికల్చర్ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్‌గా మునిగాల రాజేందర్‌తో పాటు పాలకవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 19 అగ్రికల్చర్ మార్కెట్‌కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించినట్టు తెలిపారు. మిగిలిన మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను త్వరలోనే నియమిస్తామని చెప్పారు.

రుణమాఫీని ప్రజలు నమ్మలే

- అందుకే ఎక్కువ ఎంపీ సీట్లు గెలువలేకపోయాం
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎంపీ మల్లు రవి వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చెప్పినా ప్రజలు నమ్మకపోవడం వల్లే ఎక్కువ ఎంపీ సీట్లు గెలువలేకపోయామని నాగర్‌కర్నూల్ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి అభిప్రాయపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఎంపీలు బలరాం నాయక్, రఘురాంరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పినా ప్రజలు నమ్మకపోవడం వల్ల తాము టార్గెట్‌గా పెట్టుకున్న 14 ఎంపీ సీట్లు గెలువలేకపోయామని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 లోపు 2 లక్షల రుణమాఫీ చేసి చూపించబోతున్నారని చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత అప్పుడు యూపీఏ ప్రభుత్వంలో ప్రధాని మన్మోహన్ సింగ్‌కు దక్కితే, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి దక్కిందని తెలిపారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలని రాహుల్‌గాంధీని కోరుతామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ర్టానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, మిగతా బీజేపీ ఎంపీలు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

రేవంత్, భట్టి వెళ్తే అందరూ వెళ్లినట్టే..

రుణమాఫీ హామీని నిలబెట్టుకున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహించబోయే బహిరంగ సభకు రాహుల్‌గాంధీని ఆహ్వానించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ వెళ్లనున్నట్టు మల్లు రవి తెలిపారు. వారిద్దరూ వెళ్లి రాహుల్‌తో మాట్లాడితే మిగతా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వెళ్లినట్టేనని చెప్పారు. త్వరలో రైతు భరోసాను అమలు చేసేందుకు భట్టి ఆధ్వర్యంలో సబ్ కమిటీ కసరత్తు చేస్తున్నదని వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో గెలిచినందుకు ఏం చేశారో చర్చకు సిద్ధమా అని కేటీఆర్‌కు ఎంపీ బలరాంనాయక్ సవాల్ విసిరారు.

'అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి'

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్‌శర్మ, జనరల్ సెక్రటరీ ఆనంద్‌శర్మ, ప్రభుత్వ సలహా ఎక్స్‌క్యూటివ్ ఎడిటర్ కోరూరు శ్రీనివాస్‌రావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అర్చకుల బదిలీలు చేయకూడదని కోరారు. స్థానికంగా ప్రతి దేవాలయంలో ఆచారాలు, పద్ధతులు ఉంటాయని తెలిపారు. ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నవారిని బదిలీ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం అర్చక బదిలీలను నిలిపివేయాలని సెక్రటరీ శైలజారామయ్యర్‌కు ఆదేశాలు ఇచ్చినట్టు ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. దేవాదాయశాఖలో ఐదేండ్లకు పైగా పనిచేస్తున్న అర్చక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపసీఎస్ ద్వారా వేతనాలు అందించాలని, పదవీ విరమణ తర్వాత పింఛన్, హెల్త్‌కార్డులు అందజేయాలని డీవీఆర్‌శర్మ, ఆనంద్‌శర్మ కోరారు.

ఉపాధి లక్ష్యంగా స్కిల్స్ యూనివర్సిటీ

- 17 కోర్సులు, ఏటా 20 వేల మందికి శిక్షణ
- స్కిల్స్ వర్సిటీపై సీఎం సమీక్ష

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుపై శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

17 ప్రాధాన్య రంగాలు

కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్లో) స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పనున్నారు. మూడు, నాలుగేండ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతో పాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు ఇందులో నిర్వహిస్తారు. పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ఎంపిక చేశారు. ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్ ఇలా 17 ప్రాధాన్య రంగాలున్నాయి. తొలి ఏడాది రెండు వేల మందితో ప్రారంభించి, ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు.



డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపై దృష్టి

ఫార్మా కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి,సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

3 వరకు అంగన్‌వాడీ కేంద్రంలోనే..

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌తో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్లకు సంబంధించిన ఆర్కిటెక్ట్స్, విద్యాశాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్లేస్కూల్ తరహాలో 3వ తరగతి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే విద్యాబోధన చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశానికి దిశానిర్దేశం చేశారు. 4వ తరగతి నుంచి సెమీరెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకునేలా, గ్రామాల నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు వెళ్లేందుకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

'రేవంత్'కు క్షీరాభిషేకాన్ని అడ్డుకున్న అభ్యర్థులు

- తోకముడిచిన కాంగ్రెస్ కార్యకర్తల బృందం
- ఆర్ట్స్ కాలేజీ వద్ద తూతూమంత్రంగా కార్యక్రమం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19: గ్రూప్ 2 పరీక్షల వాయిదాతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయతలపెట్టిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఉస్మానియా యూనివర్సిటీలో చుక్కెదురైంది. ఆ కార్యక్రమాన్ని టీజీపీఎస్సీ అభ్యర్థులు అడ్డుకోవడంతో మెయిన్ లైబ్రరీ ప్రాంగణం నుంచి ఆ బృందం తోకముడిచింది. దీంతో ఓయూలో ఉద్రిక్తత నెలకొన్నది. నిరుద్యోగుల డిమాండ్ మేరకు గ్రూప్ 2 పరీక్షను డిసెంబర్‌కు వాయిదా వేయడంతో టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఓయూ మెయిన్ లైబ్రరీ ఎదుట రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయతలపెట్టారు. అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నాయకుల బృందం లైబ్రరీలోకి వచ్చి విద్యార్థులను రావాలని కోరగా వారంతా తిరగబడ్డారు. తమ న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఆందోళన చేస్తే పోలీసులను ప్రయోగించి, బలవంతంగా అణచివేయాలని ప్రయత్నించడం దారుణమని దుయ్యబట్టారు. అటువంటి సీఎంకు క్షీరాభిషేకం కార్యక్రమానికి తామెలా మద్దతిస్తామని తేల్చి చెప్పారు. కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించడంతో దయాకర్ బృందం అక్కడి నుంచి జారుకున్నది. ఆ తర్వాత ఆర్ట్స్ కళాశాల ఆవరణలో తూతూమంత్రంగా రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ద్వారా తెలుగు రాష్ర్టాల్లోని కార్మికుల పిల్లలకు ఈ ఏడాదికి స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీడీ, సినీ కార్మికులు, లైమ్‌స్టోన్, డోలమైట్, మైకా, ఐరన్‌ఓర్, మాంగనీస్ ఓర్, క్రోమ్ ఓర్ కార్మికుల పిల్లల నుంచి దరఖాస్తులు కోరారు. ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31లోపు, ఇంటర్ నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు https://scholarships.gov.in/ వెబ్‌సైట్‌ను, 01206619540 హెల్ప్‌లైన్ నంబర్, helpdesk@nsp.gov.inకు మెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

డిసెంబర్‌లో గ్రూప్-2 పరీక్షలు

- వాయిదా వేస్తూ టీజీపీఎస్సీ ప్రకటన
- అభ్యర్థులతో డిప్యూటీ సీఎం భట్టి చర్చలు
- పోస్టుల పెంపుపై స్పష్టతివ్వని సర్కారు



సచివాలయంలో గ్రూప్-2 అభ్యర్థులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల పోరాటాలకు ఎట్టకేలకు దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేసింది. ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలను డిసెంబర్ నెలలో నిర్వహిస్తామని ప్రకటించింది. త్వరలోనే కొత్త తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నది. తిరిగి డిసెంబర్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 18 ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 29న అనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అనాడు వివిధ కారణాలతో పరీక్షలు జరగలేదు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ ఏడాది ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించడానికి టీజీపీఎస్సీ అధికారులు పరీక్షల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. అనంతరం నిరుద్యోగులు వివిధ పోటీ పరీక్షల విషయంలో అస్పష్టత, ప్రభుత్వ నిర్లక్ష్యంపై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 10 ప్రధాన డిమాండ్లతో వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహించారు. వాటిలో గ్రూప్ 2 వాయిదాపైనే స్పష్టత ఇచ్చి, గ్రూప్ 2 పోస్టుల పెంపును పట్టించుకోకపోవడంపై నిరుద్యోగులు రగిలిపోతున్నారు.

గ్రూప్-2 అభ్యర్థులతో భట్టి చర్చలు

గ్రూప్ 2 వాయిదాపై అంతకు ముందు రాష్ట్ర సచివాలయంలో గ్రూప్-2 అభ్యర్థులతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చర్చలు జరిపారు. నిరుద్యోగుల కోరిక మేరకు డిసెంబర్ చివరి వారానికి గ్రూప్-2 పరీక్ష వాయిదా అంశాన్ని పరిశీలించాలంటూ టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి ఫోన్‌లో సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు చెప్పిన ప్రతి అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగాల కోసం ఉద్యమాలు చేస్తూ, బెదిరింపి బ్లాక్‌మెయిల్ చేసి ఆ తర్వాత కేసుల పాలైతే మీరే నష్టపోతారని చర్చల సందర్భంగా నిరుద్యోగులను హెచ్చరించారు. కొందరు స్వలాభం కోసం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందుల పాలు కావొద్దని కోరారు. మూడు నెలల్లోనే 54 వేల ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఉద్యోగ ఖాళీలు వెతికి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. చర్చల్లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాంనాయక్, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు నిరుద్యోగుల ప్రతినిధులు లోకేశ్‌కుమార్ యాదవ్, సంజీవ్‌నాయక్, జనార్దన్ సహా మరో 50 మంది పాల్గొన్నారు.

గ్రూప్ 1పై మాట్లాడనివ్వని భట్టి

చర్చల సందర్భంగా గ్రూప్ 1 అంశాన్ని పట్టించుకోలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఆ విషయాన్ని లేవనెత్తితే భట్టి దానిని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని తెలిపారు. గ్రూప్ 2తోపాటు గ్రూప్ 3లో కూడా పోస్టుల సంఖ్యను తప్పక పెంచాలని, లేకుంటే ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని నిరుద్యోగులు స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క జరిపిన చర్చలు సంతృప్తిగా లేవని నిరుద్యోగులు చెప్పారు. ఉద్యమాన్ని నీరుగార్చడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన కొందరు నిరుద్యోగులను విడగొడుతున్నారని, తమలో తమకే గొడవలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



పోస్టుల సంఖ్య పెంచాల్సిందే

బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేయడం కంటే పోస్టుల సంఖ్య పెంచడమే ముఖ్యమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ 2లో రెండు వేలు, గ్రూప్ 3లో మూడు వేల పోస్టుల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు ఉద్యమాలు చేపడితే, కేవలం గ్రూప్ 2ను వాయిదా వేసి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. పోస్టుల పెంపు కోసం ప్రభుత్వంపై బీఆర్‌ఎస్వీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. గ్రూప్ 2, 3 పరీక్షలను ఒకేసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌ది పటేల్ పాలన

- స్కాలర్లను వెటకారంతో చులకన చేస్తున్నారు
- ఉద్యోగార్థుల గోస పుచ్చుకుంటున్న కాంగ్రెస్ సర్కారు
- గ్రూప్ 1లో 1:100 నిష్పత్తి పాటించాల్సిందే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో గాలి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

హైదరాబాద్, జూలై 19: సీఎం రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదని, పటేల్ పాలన అని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ విమర్శించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్రూప్ 1లో మెయిన్స్‌కు 1:100 చొప్పున ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌డీలు, డిగ్రీలు చేసిన నిరుద్యోగులపై సీఎం వెటకారపు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. 90 శాతం మంది ప్రజలు ఓట్లు వేస్తేనే గెలిచామన్న విషయాన్ని మరువొద్దని హితవు పలికారు. 30 లక్షల మంది నిరుద్యోగులు, వారి కుటుంబసభ్యులు సుమారు కోటి మందికిపైగా ఉంటారని, వారు తలుచుకుంటే వచ్చే ఎన్నికల్లో గెలిచి చూపిస్తారని సవాల్ విసిరారు. స్థానిక సంస్థల్లో సీఎం రేవంత్‌రెడ్డి తన సామాజికవర్గం బలంతోనే గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. గ్రూప్ 1లో 1:100 ఇస్తే న్యాయపరమైన సమస్యలు వస్తాయని ప్రభుత్వం చెప్తున్నదని, వందకు పైగా కేసులున్న టీచర్స్ మల్లన్న, సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేసి ప్రజాప్రతినిధులైతే రాని సమస్యలు కష్టపడి చదివిన నిరుద్యోగులకు లీగల్ సమస్యలు ఎలా వస్తాయని, కోర్టు కూడా అలాంటి నిర్ణయం తీసుకోదని స్పష్టం చేశారు.

దిక్కులు తెలంగాణలోనే వస్తాయా?

ఏపీ ప్రభుత్వం గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 ఇచ్చినప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి ఎందుకు న్యాయపరమైన సమస్యలు వస్తాయో స్పష్టం చేయాలని విద్యావేత్త ఆకోక్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులతో ప్రభుత్వ వైఖరి కక్షపూరితంగా ఉన్నదని సీపీఎం నేత అభ్యర్థుడు భూక్యా సంజీవ్ నాయక్ తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చిందని, నిరుద్యోగులకు మాత్రం దొంగిలిందని తెలంగాణ విఠల్ విమర్శించారు. కాంగ్రెస్ ఏడునెలల పాలన ఏకపక్షంగా ఉన్నదని, ఒకప్పుడు కార్యకర్తలేని కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగులే కార్యకర్తలై గెలిపించడం నిజమని, అలాంటి వారిని నేడు నిర్బంధిస్తున్నారని తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ ధ్వజమెత్తారు. నిరుద్యోగులు గోసపడుతుంటే కాంగ్రెస్ పార్టీకి పత్తాను పలుకుతున్న ఆకునూరి మురళి, ప్రొఫెసర్ కోదండరాం వారికి సమాధానం చెప్పాలని వక్తలు డిమాండ్ చేశారు. అనంతరం నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడే పీజీఈసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): పీజీ సెట్, పీజీఈసెట్ అడ్మిషన్లకు నేడు నోటిఫికేషన్ విడుదల కానుంది. 2024-2025లో ఎంఈ, ఎంటెక్, ఎం ఆర్కిటెక్, ఎంఫార్మా, ఫార్మా డీ(పీబీ) లో ప్రవేశాలకు టీజీసీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అధ్యక్షతన మొదటి సమావేశం ముగిసింది. 30 నుంచి ఆగస్టు 9వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, ఆగస్టు 10న ఎలిజిబుల్ క్యాండిడేట్ల వివరాలు మెయిల్ ద్వారా తెలియజేస్తారు. 14న వెబ్ ఆప్షన్లు ఎడిట్ చేసుకునే అవకాశం ఇస్తారు. ఆగస్టు 20 నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ వేయనున్నట్టు లింబాద్రి తెలిపారు.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ పూర్తి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): ఎప్‌సెట్ మొదటిదశ కౌన్సెలింగ్ ముగిసింది. 96,298 మంది హాజరు కాగా, 75,200 మందికి సీట్లు కేటాయించారు. 3,404 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు.

బదిలీలకు మార్గదర్శకాలు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): అటవీశాఖలో బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. విధి నిర్వహణ, సర్వీసు రికార్డుల ఆధారంగా బదిలీలు జరుగుతాయని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాయిదా నిరుద్యోగుల విజయమే

బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు



ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19: గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయడాన్ని విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన స్వాగతిస్తున్నామని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ముమ్మాటికీ విద్యార్థి, నిరుద్యోగుల విజయమేనని స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా నిరుద్యోగులు నిరాహారదీక్షలు చేసి ఉద్యమించిన ఫలితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం దిగి వచ్చిందని చెప్పారు. ఎన్నికల ప్రభుత్వం పోస్టుల సంఖ్యనూ పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్ష నిర్వహించిన పోస్టులకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి వాటిని తామే భర్తీ చేశామని చెప్పుకోవడం సీఎం రేవంత్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు.

గ్రూప్ పోస్టుల పెంపు ఏమైంది?

బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్



ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19: నిరుద్యోగుల అసలు డిమాండ్లను కాంగ్రెస్ సర్కారు గాలికొదిలేసిందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ధ్వజమెత్తారు. గ్రూప్ 2 పరీక్ష వాయిదాతోపాటు కాంగ్రెస్ నిరుద్యోగులకు ఇచ్చిన ఇతర హామీల సంగతేందని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గత కొన్నిరోజులుగా నిరుద్యోగులు అనేక అంశాలపై పోరాడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం.. రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. గ్రూప్ 2లో రెండు వేలు, గ్రూప్ 3లో మూడు వేల పోస్టుల పెంపు ఏమైందని పేర్కొన్నారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు వేయలేదని, జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయలేదని, నిరుద్యోగ భృతిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగుల డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని, లేకుంటే తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

హన్మంతునాయక్ అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19 : గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేసి పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు శుక్రవారం టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓయూ జేఏసీ నాయకుడు హన్మంతునాయక్‌ను పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా హన్మంతునాయక్ మాట్లాడుతూ.. గ్రూప్-1, 2 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత ఉద్యమిస్తామని హెచ్చరించారు.

క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం వాయిదా

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : జీవో 317పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కూడిన కమిటీ సమావేశం శుక్రవారం జరగాల్సి ఉన్నది. మంత్రులు రైతు భరోసాపై అభిప్రాయ సేకరణలో భాగంగా జిల్లా పర్యటనలో ఉన్నందున సమావేశం వాయిదాపడినట్టు అధికారులు తెలిపారు. తిరిగి సోమవారం నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

మైక్రో 'స్టాప్'!

హైరానా సృష్టించిన 'మైక్రోసాఫ్ట్' సాంకేతిక సమస్య

- 'క్రౌడ్‌స్ట్రైక్' అప్‌డేట్ వల్ల ఊహించని ఉపద్రవం
- లక్షలాది కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో బ్లూస్క్రీన్ ఎర్రర్
- ప్రపంచవ్యాప్తంగా ఆటోమేటిగ్గా సిస్టమ్‌ల షట్ డౌన్
- ఇంటర్నెట్ వాడే అన్ని రంగాలపైనా తీవ్ర ప్రభావం
- గందరగోళంగా మారిన విమానయాన సేవలు
- స్తంభించిన బ్యాంకింగ్ సేవలు..కుప్పకూలిన మార్కెట్లు
- భారత్‌పైనా ప్రభావం..నివారణ చర్యలు చేపట్టిన కేంద్రం

365 యాప్ సర్వీసుల్లో సమస్య పరిష్కారం



న్యూఢిల్లీ/హైదరాబాద్, స్పెషల్ టాస్క్ బ్యూరో (నమస్తే తెలంగాణ) జూలై 19: మైక్రోసాఫ్ట్‌లో శుక్రవారం తీవ్ర సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా విండోస్‌తో పని చేసే లక్షలాది కంప్యూటర్లు మొరాయించాయి. వాటికవే షట్‌డౌన్ అయిపోయాయి. మళ్లీ ఆన్‌చేయగానే కంప్యూటర్ల స్క్రీన్‌ల మీద 'బ్లూస్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' కనిపించింది. 'మీ పీసీలో సమస్య తలెత్తింది. రీస్టార్ట్ చేయండి' అనే సందేశం స్క్రీన్‌పై దర్శనమిచ్చింది. అయితే, ఎన్నిసార్లు రీస్టార్ట్ చేసినా ఇదే సమస్య పునరావృతమైంది. దీంతో అనేక దేశాల్లో ఇంటర్నెట్ ద్వారా పని చేసే వ్యవస్థలన్నీ స్తంభించిపోయాయి. బ్యాంకింగ్, విమానయాన, ఐటీ సేవల్లో తీవ్ర అంతరాయం కలిగింది. కొన్ని విమానాలు రద్దయ్యాయి. ఇంకొన్ని ఆలస్యమయ్యాయి. కొన్ని చోట్ల ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు సైతం నిలిచిపోయాయి. దీంతో అంతటా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విండోస్ 10, 11 ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ప్రధానంగా సమస్య తలెత్తింది. విండోస్ 7 ఓఎస్‌తో నడిచే సిస్టమ్‌లు యథావిధిగా పని చేశాయి. మ్యాక్, లైనక్స్ సిస్టమ్‌లకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మైక్రోసాఫ్ట్‌పై సైబర్ దాడి జరిగిందనే ప్రచారం జరిగింది. దీంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలయ్యింది. అనేక గంటల పాటు శ్రమించిన నిపుణులు చివరకు సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నారు. కంప్యూటర్లు మళ్లీ ఎలా ఆన్ చేయాలో వినియోగదారులకు మైక్రోసాఫ్ట్ సూచనలు చేసింది.

ఎందుకు జరిగింది?

మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులైన విండోస్ 10,11 వెర్షన్‌లలో, క్లౌడ్ సర్వీసులతో నడిచే పీసీలు, ల్యాప్‌టాప్‌లు, మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీసుల్లోనూ ఇటీవల చేపట్టిన క్రౌడ్‌స్ట్రైక్ సెక్యూరిటీ అప్‌డేట్ కారణంగానే 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ (బీఎస్‌వోడీ)' సమస్య తలెత్తినట్టు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. 'క్రౌడ్‌స్ట్రైక్' అనేది అమెరికాకు చెందిన ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ. ఇది 2011లో ఏర్పాటైంది. మైక్రోసాఫ్ట్‌తో పాటు దిగ్గజ సంస్థలకు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీని అందిస్తుంటుంది. తాజాగా విండోస్ సిస్టమ్స్‌లో నెలకొన్న బ్లూ స్క్రీన్ ఎర్రర్‌కు తామిచ్చిన తాజా సెక్యూరిటీ అప్‌డేట్ 'ఫాల్కన్ సెన్సర్'లో ఓ బగ్ కారణమని క్రౌడ్‌స్ట్రైక్ కూడా అంగీకరించింది.

స్తంభించిన ప్రపంచం!

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా భారత్ మాత్రమే కాదు అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, శాంతి-భద్రతలు, బ్యాంకింగ్, ఐటీ, రైల్వే, దవాఖాన, మీడియా, పేమెంట్ సర్వీసులు, స్టాక్ మార్కెట్లు, విమానయానం ఇలా దాదాపు అన్ని రంగాలు ప్రభావితమయ్యాయి. విండోస్‌లో సమస్య కారణంగా బ్రిటిష్ న్యూస్ చానెల్ స్కైన్యూస్ వార్తలను ఎయిర్ చేయడంలో అవాంతరాలు ఎదుర్కొన్నది. లండన్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో సమస్యలు తలెత్తాయి. అక్కడి మెట్రో సర్వీసులు సైతం నిలిచిపోయాయి. జర్మనీ, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ ఇలా యూరప్‌లోని అన్ని దేశాలపై ప్రభావం పడింది. ఆస్ట్రేలియాలోని వూల్‌వర్త్స్ అనే సూపర్ మార్కెట్ సేవల్లోనూ అంతరాయం తలెత్తింది. పాయింట్ ఆఫ్ సేల్స్‌లో కస్టమర్ల బ్యాంకు కార్డులు కూడా పనిచేయడం లేదు. ఏబీసీ న్యూస్ 24 బ్రాడ్‌కాస్టింగ్‌లోనూ సమస్యలు ఏర్పడ్డాయి. ఆస్ట్రేలియా వ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్లలోని సిస్టమ్‌లు మొరాయించాయి. ప్రపంచవ్యాప్తంగా పలు విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. విమాన సేవలు ఆలస్యం, క్యాన్సిలేషన్లు పెరిగాయి. మెల్‌బోర్న్, పెర్త్ ఆస్ట్రేలియా, సిడ్నీ ఎయిర్‌పోర్ట్‌లో పలు విమానాలు నిలిచిపోయాయి. అమెరికాలో డెల్టా ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, ఫ్రంటీయర్ ఎయిర్‌లైన్స్ సంస్థలు కొన్ని విమానాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇక ఐటీ, ఐటీఈఎస్, ప్రైవేటు కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. బ్యాంకులు, దవాఖాన, మీడియాపైనా ప్రభావం పడింది. కొన్ని దేశాల్లో ఆన్‌లైన్‌తో అనుసంధానమై ఉన్న పోలీసుల వ్యవస్థలు క్రాష్ అయ్యాయి.

క్రౌడ్‌స్ట్రైక్ అప్‌డేట్ వల్లే: సత్య నాదెళ్ల

మైక్రోసాఫ్ట్‌లో అంతరాయంపై ఆ సంస్థ సీఈవో సత్య నాదెళ్ల స్పందించారు. 'క్రౌడ్‌స్ట్రైక్ విడుదల చేసిన ఒక అప్‌డేట్ ప్రపంచవ్యాప్తంగా ఐటీ వ్యవస్థలను ప్రభావితం చేయడం ప్రారంభించింది. ఈ సమస్య గురించి మాకు అవగాహన ఉంది. మళ్లీ సిస్టమ్‌లను సురక్షితంగా ఆన్‌లైన్‌లోకి తీసుకురావడం కోసం వినియోగదారులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు క్రౌడ్‌స్ట్రైక్‌తో కలిసి పని చేస్తున్నాం' అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సాంకేతిక సమస్య కారణంగా నిలిచిపోయిన మైక్రోసాఫ్ట్ 365 యాప్‌లు, సర్వీసుల్లో సమస్యను పరిష్కరించామని ఆ సంస్థ ప్రకటించింది.



ఏమిటీ 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్'?



కంప్యూటర్, లేదా ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద హఠాత్తుగా ఓ బ్లూ స్క్రీన్ కనిపిస్తుంది. అందులో ఎర్రర్ మెసేజ్ ఉంటుంది. ఆ తర్వాత కంప్యూటర్ ఒక్కసారిగా షట్‌డౌన్ లేదా రీస్టార్ట్ అవుతుంది. ఈ సమస్యను 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' లేదా 'బ్లాక్ స్క్రీన్ ఎర్రర్స్' లేదా 'స్టాప్ కోడ్ ఎర్రర్స్'గా పిలుస్తారు. సాధారణంగా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సమస్యల వల్ల ఈ ఎర్రర్స్ తలెత్తుతుంటాయి. ఏదైనా హార్డ్‌వేర్‌ను కొత్తగా ఇన్‌స్టాల్ చేయడం వల్ల బ్లూ స్క్రీన్ ఎర్రర్ తలెత్తి ఉంటే.. సిస్టమ్‌ను షట్‌డౌన్ చేసి, హార్డ్‌వేర్‌ను తొలగించి రీస్టార్ట్ చేయాల్సి ఉంటుంది. తాజాగా విండోస్‌లో తలెత్తిన ఎర్రర్ సాఫ్ట్‌వేర్ సమస్య కిందకు వస్తుంది.

భారత్‌లో ఏం జరిగింది?

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా దేశంలోని ప్రధాన రంగాలన్నీ ప్రభావితమయ్యాయి. విమాన సర్వీసుల దగ్గరి నుంచి దవాఖాన, బ్యాంకింగ్ వరకు ఇలా అన్ని సర్వీసుల్లోనూ సమస్యలు తలెత్తాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ, స్పైస్‌జెట్, విస్తారా తదితర ప్రముఖ విమానయాన సంస్థల సేవలపై దీని ప్రభావం పడింది. సాంకేతిక కారణాల వల్ల బుకింగ్, చెక్-ఇన్, బోర్డింగ్ పాస్ ఇష్యూయింగ్, ఫ్లైట్ స్టేటస్ చెకింగ్ తదితర సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఒక్క ఇండిగో విమానయాన సంస్థే 200కు పైగా విమాన సేవలను నిలిపేసింది. ఇక, బెంగళూరు ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 1 గుండా ప్రయాణాలు సాగిస్తున్న 90 శాతం విమానాలు నిలిచిపోయాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్ విమానాశ్రయాల్లోని ఫ్లైట్ ఆపరేషన్లలో అంతరాయాలు కలిగాయి. కొన్ని ప్రైవేటు బ్యాంకులు, దవాఖానల్లోనూ సేవల్లో అంతరాయం ఏర్పడినట్టు నిపుణులు వెల్లడించారు. మైక్రోసాఫ్ట్‌కు చెందిన మైక్రోసాఫ్ట్ 365, మైక్రోసాఫ్ట్ టీమ్, మైక్రోసాఫ్ట్ అజూర్ సర్వీసులతో పాటు ఇన్‌స్టాగ్రామ్, అమెజాన్, జీమెయిల్ సేవల్లోనూ సమస్యలు ఎదుర్కొన్నట్టు పేర్కొన్నారు.



సైబర్ దాడి కాదు!

తామిచ్చిన తాజా సెక్యూరిటీ అప్‌డేట్‌లో ఓ బగ్ కారణంగానే ఈ సమస్య తలెత్తింది. అయితే, ఇది భద్రతాపరమైన వైఫల్యమో, సైబర్ దాడో కాదు. ఇప్పటికే సమస్యను గుర్తించి డీబగ్‌ను ఫిక్స్ చేశాం.

- క్రౌడ్‌స్ట్రైక్ సీఈవో జార్జ్ కుర్ట్జ్



బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయంలో భారీ సంఖ్యలో వేచిచూస్తున్న ప్రయాణికులు

సాయంత్రం మొదలై...


మైక్రోసాఫ్ట్ విండోస్ 10,11 వెర్షన్‌లలో సాంకేతిక సమస్య అమెరికా కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 6-7 గంటల మధ్య మొదలైంది. అంటే భారత్‌లో శుక్రవారం ఉదయం మొదలైనట్టు. ఆ సమయంలో అగ్రరాజ్యంలో వ్యాపార కార్యకలాపాలు ముగిసిపోవడం, భారత్ వంటి పశ్చిమాసియా దేశాల్లో మొదలు కాకపోవడంతో ఆర్థికంగా కొంతమేర నష్టం తగ్గినట్టు నిపుణులు చెప్తున్నారు.

భారత్‌లో ప్రభావం స్వల్పం : ఆర్బీఐ

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం ప్రభావం మన దేశంలో స్వల్పంగా ఉందని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) శుక్రవారం తెలిపింది. 10 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల కార్యకలాపాలకు కాసేపు అంతరాయం కలిగిందని చెప్పింది. చాలా బ్యాంకుల కీలక వ్యవస్థలు క్లౌడ్‌లో లేవని, కొన్ని బ్యాంకులు మాత్రమే క్రౌడ్ స్ట్రైక్‌ను వాడుతున్నాయంది.

కాపాడిన విండోస్ 7

మైక్రోసాఫ్ట్ మార్కెట్లోకి విండోస్ 11, 10 వెర్షన్లను కొత్త ఫీచర్లతో తీసుకొచ్చినప్పటికీ, భారత్‌లో చాలామంది విండోస్ 7, విండోస్ 8, 8.1 వెర్షన్లనే ఎక్కువగా వాడుతున్నారు. మైక్రోసాఫ్ట్ గణాంకాల ప్రకారం విండోస్ 11, 10 వెర్షన్లను వాడే వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తున్నప్పటికీ అవన్నీ లైసెన్స్‌డ్ వెర్షన్లుగా గమనించాల్సి ఉంటుంది. నిజానికి ప్రతి పదిమంది యూజర్లలో ఒకరు లైసెన్స్‌డ్ వెర్షన్‌ను వాడుతుంటే, మిగతావారు అన్‌లైసెన్స్‌డ్ వెర్షన్‌నే వాడుతున్నారు. అందులోనూ అత్యధికులు విండోస్ 7, 8, 8.1 అన్‌లైసెన్స్‌డ్ వెర్షన్లనే వినియోగిస్తున్నారు. ఈ వెర్షన్లలో 'క్రౌడ్‌స్ట్రైక్' తాజా సెక్యూరిటీ అప్‌డేట్ సపోర్ట్ చేయదు. అదే ఇప్పుడు మంచిదైంది.



కోల్‌కతా ఎయిర్‌పోర్టులో మాన్యువల్‌గా ఇచ్చిన బోర్డింగ్ పాస్

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 36 విమాన సర్వీసులు రద్దు

మాన్యువల్‌గా రాసి బోర్డింగ్ పాసులు జారీ

హైదరాబాద్ సిటీబ్యూరో/శంషాబాద్ రూరల్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టం మైక్రోసాఫ్ట్ విండోస్ పనిచేయకపోవడంతో విమాన సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే పలు విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం తలెత్తింది. దేశ విదేశాలకు వెళ్లాల్సిన 36 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు ఎయిర్‌పోర్టు ప్రతినిధులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. విమానాల రాకపోకలకు సంబంధించిన కార్యకలాపాలన్నీ కంప్యూటర్ల మీదే జరుగుతాయి. మైక్రోసాఫ్ట్ విండోస్ సాంకేతిక సమస్య కారణంగా విమాన ప్రయాణికుల వివరాలను తనిఖీ, బోర్డింగ్ పాస్‌ల జారీని ఇవ్వలేకపోయారు. కొన్ని విమానాల రాకపోకలను కొనసాగించేందుకు బోర్డింగ్ పాస్‌లను మాన్యువల్‌గా రాసి ఇచ్చి విమానాల ప్రయాణాలు సాగేలా చర్యలు చేపట్టారు. సాంకేతిక సమస్య వల్ల విమాన సర్వీస్ సిగ్నల్‌కూ అంతరాయం ఏర్పడింది. అయితే విమాన సర్వీసుల రద్దు వల్ల కొందరు ప్రయాణికులు 7-8 గంటలపాటు ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు కాశారు.

మైక్రోసాఫ్ట్‌తో సమన్వయం.. ఇబ్బందులు రానివ్వం

ఎన్ఐసీ ప్రభావితం కాలేదు.. - కేంద్ర ఐటీ మంత్రి వైష్ణవ్

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక లోపంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. సమస్య ఉత్పన్నం కాగానే ప్రభుత్వం మైక్రోసాఫ్ట్ కంపెనీతో టచ్‌లోకి వెళ్లిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ ఎర్రర్ కారణంగా నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) నెట్‌వర్క్ ప్రభావితం కాలేదని పేర్కొన్నారు. ఎన్ఐసీకి చెందిన ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కమ్యూనికేషన్ సేవలు అందిస్తుంది. మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక సమస్య నేపథ్యంలో ఇండియన్ కంప్యూటర్ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్టీ) ఒక అడ్వైజరీ జారీ చేసిందని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బంది రానివ్వొద్దని ఆదేశించాం

మైక్రోసాఫ్ట్ సాంకేతిక లోపం నేపథ్యంలో విమాన ప్రయాణికుల కోసం కేంద్ర పౌర విమానయాన శాఖ గైడ్ లైన్స్ జారీ చేసింది. ఎయిర్‌పోర్టుల్లో వేచి చూస్తున్న వారికి ఆహారం, మంచినీళ్లు, ఇతర సదుపాయాలు అందించాలని, విమాన సర్వీసుల సమాచారం అందజేయాలని ఆదేశించినట్టు విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. పరిస్థితిని మంత్రిత్వ శాఖ, ఏఏఐ నిశితంగా పరిశీలిస్తున్నదని, త్వరిత పరిష్కారం కోసం మైక్రోసాఫ్ట్‌తో సమన్వయం చేసుకొంటున్నట్టు చెప్పారు.

చరిత్రలోనే అతిపెద్ద ఐటీ అంతరాయం

నిపుణుల అభిప్రాయం

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ విండోస్ సేవలకు అటంకం కలగడం ఐటీ చరిత్రలోనే అతిపెద్ద అంతరాయంగా ఐటీ నిపుణులు అభివర్ణిస్తున్నారు. సైబర్ దాడి వల్ల ఇలా జరిగి ఉండొచ్చని సైబర్ నిపుణులు అమిత్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద సంస్థలు అప్‌డేట్లు చేసే ముందు పూర్తిస్థాయిలో టెస్టింగ్ చేస్తారని, అయినా ఇది జరిగిందంటే సైబర్ దాడి కావొచ్చని పేర్కొన్నారు. ఈ సమస్య వ్యాపారాలపై తక్షణ ప్రభావం చూపించడంతో పాటు చాలా నెలల పాటు సైబర్ సెక్యూరిటీ ముప్పుకు కారణం కావొచ్చని క్లౌడ్‌సెక్ వ్యవస్థాపకుడు సందీప్ గోయల్ హెచ్చరించారు. చరిత్రలో ఇది అతిపెద్ద ఐటీ అంతరాయంగా సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ట్రోయ్ హంట్ పేర్కొన్నారు.



పెంటాగాన్‌కూ తంటా

మైక్రోసాఫ్ట్ విండోస్ లేటెస్ట్ వెర్షన్‌ను అమెరికాలోని ప్రభుత్వ, పోలీసు, రక్షణ విభాగాలు కూడా వినియోగిస్తున్నాయి. తాజాగా సమస్య ఎదురవ్వడంతో ఆ విభాగాలతో పాటు అగ్రరాజ్య రక్షణ కార్యాలయం పెంటాగాన్‌లోనూ పలు కంప్యూటర్లు మొరాయించాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

పారిస్ ఒలింపిక్స్‌పైనా ప్రభావం

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సమస్య ప్రభావం.. మరో వారంలో ప్రారంభం కానున్న పారిస్ ఒలింపిక్స్ 2024పైనా పడింది. కంప్యూటర్లు షట్‌డౌన్ కావడంతో నిర్వహణకు సంబంధించిన ఐటీ కార్యకలాపాల్లో అంతరాయం ఏర్పడినట్టు అధికారులు పేర్కొన్నారు. అయితే, సమస్యను పరిష్కరించినట్టు వెల్లడించారు.

ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌లో అంతరాయం

ఏం జరిగింది?
విండోస్‌పై నడిచే చాలా కంప్యూటర్లలో 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' సందేశాలు వచ్చి నిలిచిపోయాయి.

:(BSOD

ఎప్పుడు?
శుక్రవారం తెల్లవారు జాము నుంచి...

ప్రభావమేంటి?
మైక్రోసాఫ్ట్ వినియోగించే పలు కంప్యూటర్లు పనిచేయలేదు

అప్‌డేట్ ఏంటి?
ఫాల్కాన్ సెన్సార్ అనేది ఎప్పటికప్పుడు సైబర్ దాడుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

సమస్య ఎక్కడ?
క్రౌడ్‌స్ట్రైక్‌కు చెందిన ఫాల్కాన్ సెన్సార్ అప్‌డేట్‌లో లోపం తలెత్తింది. ఇది విండోస్ వ్యవస్థను విఫలం చేసింది.

ఏయే రంగాలపై ప్రభావం.. ఆర్థిక నష్టమెంత?

ప్రభుత్వ, ప్రైవేటు, శాంతిభద్రతలు, బ్యాంకింగ్, ఐటీ, ఐటీ ఈఎస్, రైల్వే, వైద్య, మీడియా, పేమెంట్ సర్వీసులు, స్టాక్ మార్కెట్లు, విమానయానం తదితర రంగాలపై విండోస్ ఎర్రర్ ప్రభావం చూపించింది. సేవల్లో అంతరాయంతో ఇప్పటివరకు ఎంత ఆర్థిక నష్టమన్న విషయాన్ని నిపుణులు అంచనా వేయనప్పటికీ, నష్టం విలువ ట్రిలియన్ డాలర్లలోనే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రభావితమైన దేశీయ విమానయాన సంస్థలు

- ఎయిరిండియా
- ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్
- ఇండిగో
- ఆకాశ
- స్పైస్‌జెట్
- విస్తారా

వీకెండ్ శుక్రవారమే మొదలైంది!

మైక్రోసాఫ్ట్ సాంకేతిక సమస్యపై నెటిజన్ల సెటైర్లు

న్యూయార్క్, జూలై 19: మైక్రోసాఫ్ట్ విండోస్‌లో శుక్రవారం సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పలు రంగాల్లో ఏర్పడిన అంతరాయంపై నెటిజన్లు కొందరు సరదాగా స్పందించి జోకులు, మీమ్‌లు, ఎమోజీలతో కామెంట్లు చేశారు. 'కొంతమందికి శుక్రవారమే వారాంతం ప్రారంభమైంది. హ్యాపీ వీకెండ్, థాంక్యూ మైక్రోసాఫ్ట్, థాంక్యూ బ్లూ స్క్రీన్' అని ఒకరు కామెంట్ చేశారు. 'మైక్రోసాఫ్ట్ లోపకు కారణమైన ఆ వ్యక్తికి కార్పొరేట్ ఉద్యోగులంతా కృతజ్ఞతలు చెబుతున్నారు' అని మరొకరు పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్‌లో అప్రాధాన్యమున్న బ్లూ స్క్రీన్‌ను హైలెట్ చేస్తూ మరికొందరు మీమ్స్ ఉంచారు. ఒంటి నిండా నీలం రంగు పూసుకుని ఉన్న ఒక వ్యక్తి మీమ్‌ను ఎక్స్‌లో ఒక యూజర్ ఉంచి 'ప్రస్తుతం ప్రతి కంపెనీలో ఐటీ విభాగాలు' అంటూ క్యాప్షన్ పెట్టారు. సిస్టమ్‌పై బ్లూ స్క్రీన్ చూసి కార్పొరేట్ ఉద్యోగులు బాధ నటిస్తూ లోపల ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్న భావనతో ఉండే మీమ్‌లను కొందరు షేర్ చేశారు.



మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక లోపంతో పలు రంగాల్లో వర్క్ నిలిచిపోవడంతో సోషల్ మీడియాలో పెద్దయెత్తున షేర్ అయిన పలు రకాల మీమ్స్

మైక్రోసాఫ్ట్ కాదు.. మేక్రోహార్డ్: మస్క్

మైక్రోసాఫ్ట్‌పై టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ కూడా వ్యంగ్యంగా స్పందించారు. మైక్రోసాఫ్ట్... మేక్రోహార్డ్‌గా మారిందంటూ 2021లో తాను చేసిన పోస్టును ఆయన రీపోస్ట్ చేస్తూ 'టీమ్‌లు చాలా బాగున్నప్పటికీ' అంటూ వ్యాఖ్యానించారు. రెండు నవ్వుతున్న ఎమోజీలతో డాగ్ డిజైనర్ షేర్ చేసిన మీమ్‌పై కూడా మస్క్ తన ఎక్స్‌లో స్పందించారు. 'ఆశ్చర్యపోవ్వు మూతపడినా ఈ యాప్ మాత్రం ఇప్పటికీ పని చేస్తున్నది' అంటూ క్యాప్షన్ ఉంచారు. ప్లే గ్రౌండ్‌లో కొందరు క్రికెట్ ఆడుతుండగా, ఒక వ్యక్తి పడుకుని తాపీగా వారిని చూస్తున్న దృశ్యం మస్క్ షేర్ చేసిన మీమ్‌లో ఉంది.



'గాలి'లో బతుకులు..!

మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక కారణాల వల్ల ఫ్లైట్ బుకింగ్, చెక్-ఇన్, బోర్డింగ్ పాస్ ఇష్యూయింగ్‌లో మాత్రమే కాకుండా ఫ్లైట్ ట్రాకింగ్, ఫ్లైట్ స్టేటస్ చెకింగ్‌లోనూ సమస్యలు తలెత్తినట్టు అమెరికన్ విమానయాన సంస్థ ఫ్రంటియర్ ఎయిర్ లైన్స్ పేర్కొంది. విండోస్ ఓఎస్‌లో తలెత్తిన సమస్యతో తమ విమానాలు గాల్లో ఎక్కడ ఉన్నాయన్న సమాచారమూ తమకు తెలియలేదని అధికారి ఒకరు వాపోయారు.

మైక్రోసాఫ్ట్ విండోస్ చరిత్ర

డెవలపర్ – మైక్రోసాఫ్ట్
తొలి వెర్షన్ – విండోస్ 1, 1985
తాజా విడుదల 23జూన్, 2024
అందుబాటులోని భాషలు – 110
లైసెన్స్‌డ్ యూజర్లు –110 కోట్లు
అన్‌లైసెన్స్‌డ్ యూజర్లు–540 కోట్లు
మొత్తం యూజర్లు
650 కోట్ల మంది
ప్రపంచవ్యాప్తంగా వాడే కంపెనీలు – 90 శాతం
విండోస్ వాడే దేశాలు – 190

అంగన్‌వాడీల సమరశంఖారావం

- సమస్యలు పరిష్కరించాలని యూసుఫ్‌గూడ స్టేట్‌హోం వద్ద ధర్నా

జూబ్లీహిల్స్, జూలై 19 : తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమరశంఖారావం పూరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ స్టేట్‌హోం ఎదుట భారీ ధర్నాకు దిగారు. ప్రభుత్వ వైఖరిపై ఆసహనం వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై రెండు రోజుల క్రితం స్వయంగా మంత్రి హామీ ఇచ్చినా విశ్వసనీయత లేని ప్రకటనగా పేర్కొంటూ మెరుపు సమ్మెకు దిగారు. దీంతో అమీర్‌పేట్ మైత్రి వనం నుంచి యూసుఫ్‌గూడ మీదుగా నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ప్రజలు ట్రాఫిక్‌జామ్‌తో గంటల కొద్దీ ఇబ్బందులు పడ్డారు. అంతకుముందు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్, డైరెక్టర్ కాంతి వెస్లీకి అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, ప్రధాన కార్యదర్శి జయలక్ష్మితో చర్చలు జరిపి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



యూసుఫ్‌గూడ స్టేట్‌హోం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్

1104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): మింట్ కాంపౌండ్ హైదరాబాద్‌లోని విద్యుత్తు కార్మికభవన్ 1104 యూనియన్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం యూనియన్ ఆవిర్భావ కార్యదర్శి వరప్రసాద్ స్టార్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. స్టార్ హాస్పిటల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ నిశాంత్‌రెడ్డి విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్స్‌కు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నందన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేశారు. ఆర్థోపెడీషియన్ డాక్టర్ అభిషేక్ ఎముకల పటిష్టం, ఇతర ఆరోగ్య సమస్యలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సుదీర్, సలహాదారు జనార్దన్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు వేణు, అదనపు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరావు పాల్గొన్నారు.

'రేషన్ డీలర్ల' హామీలను అమలు చేయండి

రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తామని, కమీషన్ పెంచుతామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర కమిటీ తరఫున విజ్ఞప్తి చేశారు. 17,200 మంది రేషన్ డీలర్లు చాలీచాలని కమీషన్లతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

545 దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 545 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 95, పౌరసరఫరాలు 84, విద్యుత్తు 82, హౌసింగ్ 79, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి 47, ఇతర శాఖలకు 158 దరఖాస్తులు అందాయి.

ఎస్సీ వర్గీకరణ కోసం ఢిల్లీలో దీక్షలు

ఆగస్టు 6 నుంచి మూడ్రోజులపాటు: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 19 : అసెంబ్లీ ఎన్నికల ముందు దేశ ప్రధాని హోదాలో మోదీ తెలంగాణకు వచ్చి ఎస్సీ వర్గీకరణ చేపడుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఆగస్టు 6,7,8 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ ఆ అంశాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టిందని ఆరోపించారు. తాజాగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా కమిటీ వేసి కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ జాప్యాన్ని, మోసాన్ని ఎండగట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్లపెంజర రమేశ్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు శ్యామ్‌రావు, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకట్, ప్రధాన కార్యదర్శి గుమ్మడేలి తిరుమలేశ్, లక్ష్మణ్, ప్రేమదాస్, రాజు, నరేశ్, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

బీజేపీకి చిరు, పవన్ ఎలా మద్దతిస్తారు?

- రైతులపై ప్రేమ సినిమాలకే పరిమితమా?
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధ్వజం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రైతుల కష్టాలపై సినిమాలు తీసే చిరంజీవి, పవన్‌కల్యాణ్ రైతు వ్యతిరేక బీజేపీకి ఎలా మద్దతిస్తారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులపై ప్రేమను ఒలకబోస్తూ సినిమాలు తీసిన చిరంజీవి, పవన్‌కల్యాణ్ నిజ జీవితంలో మాత్రం నల్లచట్టాలు తీసుకొచ్చి రైతుల ప్రాణాలు తీసిన బీజేపీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. నల్లచట్టాలపై చిరంజీవి, పవన్‌కల్యాణ్ ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్, రైతులకు ఎన్ని వేల కోట్ల రుణమాఫీ చేసిందో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణాలను మాఫీ చేసిన దాఖలాలున్నాయా? అని ప్రశ్నించారు. బడా పారిశ్రామికవేత్తలకు మోదీ సర్కార్ 16 లక్షల కోట్ల బ్యాంక్ రుణాలను మాఫీ చేసిందే తప్ప రైతు రుణాలను మాఫీ చేసిందా? అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేయడంతో ప్రతిపక్ష నేతలకు నిద్రపట్టడం లేదని విమర్శించారు.

బీజేపీ మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

- టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

యాదగిరిగుట్ట, జూలై 19: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ధీమా వ్యక్తంచేశారు. ఆగస్టు 9వ తేదీ ఢిల్లీ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మాదిగ, మాదిగ ఉపకులాల వారంతా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం యాదగిరిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్య మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణే ఏకైక లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని స్పష్టంచేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ.. ఆ తర్వాత మోసం చేసిందని మండిపడ్డారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సంక్రపల్లి వెంకటయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, మేధావుల ఫోరం నాయకులు డాక్టర్ రాజు మాళి, ప్రొఫెసర్ డాక్టర్ మల్లేశ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గిల్లయ్య, దాసి మోహన్, మంచాల యాదగిరి, టీ శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

'యువ లిమిట్‌లెస్' పాడ్‌కాస్ట్‌లో సందీప్ శాండిల్య

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య 'యువ లిమిట్‌లెస్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడినట్టు యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎక్స్ వేదికగా తెలియజేసింది. ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ 'యువ లిమిట్‌లెస్' అనే పాడ్‌కాస్ట్‌ను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ దుష్పరిణామాలపై విస్తృతంగా చర్చించామని టీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు యువతను ప్రోత్సహించేలా సందీప్ శాండిల్య మాట్లాడారని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కొనియాడింది.

ప్రణీత్ హనుమంతుపై నార్కోటిక్ కేసు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : యూట్యూబర్ ప్రణీత్ హనుమంతుపై డ్రగ్స్ కేసు నమోదుకాగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో ఉంచారు. చంచల్‌గూడలోని సెంట్రల్ జైలులో ఉన్న ప్రణీత్ హనుమంతు గతంలో డ్రగ్స్ సేవించినట్టు నార్కోటిక్ బ్యూరో దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఓ తండ్రి, కూతురు వీడియోపై అసభ్యకరంగా మాట్లాడిన కేసులో ఈ యూట్యూబర్‌ని ఇటీవలే సైబర్ సెక్యూరిటీ పోలీసులు అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం ప్రణీత్‌ను మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని సైబర్ సెక్యూరిటీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

నకిలీ ఆధార్‌తో సుప్రభాత టికెట్లు

- తిరుమలలో 400 సార్లు రిజిస్ట్రేషన్
- 20సార్లు సేవకు వెళ్లిన బెంగళూరు భక్తుడు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి దర్శనం, సుప్రభాత సేవకు ఓ భక్తుడు నకిలీ ఆధార్ కార్డులను వినియోగించి విజిలెన్స్ అధికారులకు అడ్డంగా దొరికాడు. బెంగళూరుకు చెందిన శ్రీధర్ నకిలీ ఆధార్ కార్డుల ద్వారా టీటీడీ లక్కీడిప్ సేవా టికెట్ల కోసం ఏకంగా 400 రిజిస్ట్రేషన్లు చేసినట్టు గుర్తించారు. ఇప్పటి వరకు 20 సార్లు సుప్రభాత సేవ టికెట్లు పొందినట్టు తేల్చారు. బుధవారం మరో సారి సుప్రభాత సేవకు రాగా టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించి పట్టుకుని తిరుమలలో పోలీసులకు అప్పగించారు.

హోటల్ లైసెన్స్ రద్దు

తిరుమలలోని తొమ్మిది పెద్ద హోటళ్లలో ఒకటైన, కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలోని బాలాజీ భవన్ హోటల్ లైసెన్సును టీటీడీ రద్దు చేసింది. ప్రస్తుతం హోటల్ చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు రూ.76,04,196గా ఉంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా, లైసెన్సు ఫీజు చెల్లించనందుకు హోటల్ లైసెన్సును రద్దు చేసి, టీటీడీ రెవెన్యూ, హెల్త్, విజిలెన్స్ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం హోటల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌పీఏలో ముగిసిన ఆక్వాటిక్ మీట్

బెస్ట్ స్విమ్మర్‌గా పంకజ్ యాదవ్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో రెండు రోజులపాటు నిర్వహించిన అన్యువల్ ఆక్వాటిక్ మీట్ శుక్రవారం విజయవంతంగా ముగిసింది. స్విమ్మింగ్ పోటీల్లో 76వ ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ట్రైనీలు ఉత్సాహంగా పోటీపడ్డారు. ఈ ఆక్వాటిక్ మీట్‌లో బెస్ట్ స్విమ్మర్‌గా పంకజ్‌యాదవ్ నిలిచారు. జాతీయ పోలీసు అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్, పారా స్విమ్మర్ నిరంజన్ ముకుందన్ డైరెక్టర్స్ విజేతలకు పతకాలు అందజేశారు.



బహుమతి అందుకుంటున్న పంకజ్

తహసీల్‌లో కొట్టుకున్న కాంగ్రెస్ రియల్టర్లు

- మర్పల్లి మండలం సిరిపురంలోని ఇనామ్ భూమి విషయంలో దాడి

వికారాబాద్, జూలై 19, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ నియోజకవర్గంలో ఓ భూమి విషయంలో కాంగ్రెస్ నాయకులు కొట్టుకున్నారు. మర్పల్లి మండలం సిరిపురం గ్రామంలో సర్వే నెంబర్ 461, 462లలోని ఇనామ్ భూమి.. అదే గ్రామానికి చెందిన మోహన్‌తోపాటు మరికొందరి పేరుమీద ఉంది. ఈ భూమి పంచనామా విషయంలో శుక్రవారం మోహన్‌ను వెంటబెట్టుకొని కాంగ్రెస్ నాయకులు చిన్న మైసగళ్ల నర్సింలు మర్పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో సిరిపురం గ్రామానికి చెందిన మరో కాంగ్రెస్ నాయకుడు మాణిక్యరావు అలియాస్ మల్లేశంతోపాటు తుమ్మలపల్లికి చెందిన దొడ్డ జయరాజ్ కలిసి ఈ భూమి పంచనామా విషయమై ఆర్ఐతో మాట్లాడుతున్నారు. అక్కడే ఉన్న నర్సింలు వర్గీయులు కలుగజేసుకొని 'మా గ్రామానికి సంబంధించిన భూముల గురించి నీకేం అవసరం' అంటూ తుమ్మలపల్లికి చెందిన జయరాజ్‌పై దాడి చేశారు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు తహసీల్దార్ కార్యాలయంలోనే కొట్టుకున్నారు. ఈ దాడిలో మాణిక్యరావు తలకు గాయం కావడంతో మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కొట్టుకున్న వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్‌గా మారింది.



తహసీల్దార్ కార్యాలయంలో కొట్టుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


రాష్ట్రాభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర

- తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల

NABARD

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నాబార్డ్ కీలకపాత్ర పోషించిందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల్ అన్నారు. 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకాలలో నాబార్డ్ భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందన్నారు. నాబార్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడంతోపాటు ఇంక్యుబేషన్ సెంటర్‌లతో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మాట్లాడుతూ..నాబార్డు ప్రోత్సాహంతో పంటలపైన కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, ఫిషరీస్ తదితర రంగాలద్వారా కూడా ఆదాయం గణనీయంగా పెరుగుతున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి తలసరి ఆదాయంలో 10వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ప్రస్తుతం మూడో స్థానానికి ఎగబాకిందన్నారు. ఈ సందర్భంగా టీజీసీఏబీ అధ్యక్షుడు ఎం రవీందర్ రావు మాట్లాడుతూ.. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాబార్డ్ గ్రాస్ రూట్ స్థాయిలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

స్టాక్ మార్కెట్లకు మైక్రోసాఫ్ట్ దెబ్బ



ముంబై, జూలై 19: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. రికార్డు స్థాయి గరిష్ఠాల్లో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. మరోవైపు మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక సమస్య అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. ఈ పరిణామం భారతీయ మార్కెట్ల నష్టాలను మరింత పెంచింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 738.81 పాయింట్లు లేదా 0.91 శాతం పడిపోయి 81 వేల మార్కుకు దిగువన 80,604.65 వద్ద ముగిసింది. నిజానికి తీవ్ర ఒడిదొడుకుల్లోనే ట్రేడింగ్ సాగింది. ఒకానొక దశలో గురువారం ముగింపుతో చూస్తే 244 పాయింట్లకుపైగా ఎగిసి ఆల్‌టైమ్ హైని తాకుతూ 81,587.76 వద్దకు సూచీ వెళ్లింది. అయితే ఈ ఉత్సాహం ఎంతోసేపు నిలబడలేకపోయింది. ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోవడంతో 844.36 పాయింట్ల నష్టాన్ని సెన్సెక్స్ మూటగట్టుకోవడం గమనార్హం. చివరకు కొంతమేర కోలుకున్నా.. నష్టతీవ్రత ఎక్కువగానే ఉన్నది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 269.95 పాయింట్లు లేదా 1.09 శాతం దిగజారి 24,530.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మునుపెన్నడూ లేనివిధంగా 24,854.80 స్థాయికి చేరినా.. నిలదొక్కుకోలేకపోయింది. ఈ నేపథ్యంలోనే 292.7 పాయింట్ల మేర నష్టపోయింది. అయితే ఆఖర్లో కాస్త కోలుకున్నది. అంతకుముందు 4 రోజులపాటు స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే కదలాడిన విషయం తెలిసిందే. సెన్సెక్స్ 1,446.12 పాయింట్లు లేదా 1.80 శాతం పుంజుకున్నది.

8 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల నష్టాల నేపథ్యంలో మదుపరుల సంపద ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో హరించుకుపోయింది. బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.8 లక్షల కోట్లదాకా ఆవిరైపోయింది. రూ.7,94,059.53 కోట్లు క్షీణించి రూ.4,46,38,828.75 కోట్ల (5.34 ట్రిలియన్ డాలర్ల)కు పరిమితమైంది. వరుస లాభాల మధ్య మదుపరుల సంపద రూ.455 లక్షల కోట్లను తాకిన సంగతి విదితమే.

రంగాలవారీగా..

మెటల్ రంగ షేర్లు అత్యధికంగా 4.11 శాతం పడిపోయాయి. కమోడిటీస్ 3.07 శాతం, చమురు-గ్యాస్ 2.87 శాతం, విద్యుత్తు 2.67 శాతం, ఆటో 2.53 శాతం, యుటిలిటీస్ 2.51 శాతం, రియల్టీ 2.44 శాతం, సేవలు 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. టాటా స్టీల్ షేర్ విలువ 5 శాతానికిపైగా దిగజారింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటర్స్, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య.. అన్ని రంగాలనూ ప్రభావితం చేసింది. దీంతో ఆయా దేశాల స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది. ఆసియా దేశాల్లో ప్రధానంగా దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టాలను చవిచూశాయి. చైనా సూచీ లాభపడింది. అలాగే కీలక ఐరోపా మార్కెట్లలో ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ సూచీలూ నష్టపోయాయి. గురువారం నష్టాల్లో ముగిసిన అమెరికా మార్కెట్లూ.. శుక్రవారం తీవ్ర ఒడిదొడుకుల్లో ట్రేడ్ అయ్యాయి. మైక్రోసాఫ్ట్ దెబ్బకు విమానయాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బ్యాంకింగ్, మీడియా రంగాల్లోనూ ఇబ్బందులు తలెత్తాయి. కాగా, భారతీయ స్టాక్ మార్కెట్లపై సాంకేతికంగా మైక్రోసాఫ్ట్ ప్రభావం లేదని బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలు ప్రకటించాయి.

విప్రో లాభం 3 వేల కోట్లు

బెంగళూరు, జూలై 19: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన విప్రో ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,003.2 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 4.6 శాతం వృద్ధి కనబరిచినట్టు పేర్కొంది. కానీ, కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 3.8 శాతం తగ్గి రూ.21,963.8 కోట్లకు పరిమితమైంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ శ్రీని పల్లియా మాట్లాడుతూ.. ఈ ఏడాది లాభంతో ఆరంభించినట్టు, ముఖ్యంగా బిలియన్ డాలర్ల కంటే అధిక విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు చెప్పారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ బీమా(బీఎఫ్‌ఎస్‌ఐ), కన్జ్యూమర్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు.


ఏడాదిలోగా 12 వేల ఉద్యోగాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 10-12 వేల మంది సిబ్బందిని క్యాంపస్‌లతోపాటు ఇతర మార్గాల ద్వారా నియమించుకునే ఆలోచనలో విప్రో ఉన్నది. తొలి త్రైమాసికంలో 337 మంది చేరడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,34,391కి చేరుకున్నారు.

రిలయన్స్‌కు చమురు సెగ

- క్యూ1లో 5 శాతం తగ్గిన నికర లాభం

న్యూఢిల్లీ, జూలై 19: దేశంలో అత్యంత విలువైన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లాభాలకు చమురు సెగ గట్టిగానే తాకింది. రిఫైనింగ్ మార్జిన్లు తక్కువగా ఉండటంతోపాటు పెట్రోకెమికల్ మార్జిన్లు తగ్గడంతో ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపింది. టెలికం, రిటైల్ రంగాలు రాణించినప్పటికీ మిగతా రంగాలు నిరాశాజనక పనితీరు కనబరిచాయి. దీంతో గడిచిన త్రైమాసికానికిగాను కంపెనీ రూ.15,138 కోట్లు(ప్రతి షేరుకు రూ. 22.37) కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది వచ్చిన రూ. 16,011 కోట్లు(ప్రతిషేరుకు రూ.23.66) పోలిస్తే 5 శాతం తగ్గింది. జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.18,951 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం తగ్గింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.2.57 లక్షల కోట్లకు ఎగబాకింది.



రిటైల్ ఆకర్షణీయం

రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ ఆకర్షణీయమైన లాభాలను ప్రకటించింది. జూన్ త్రైమాసికానికిగాను రూ.75,615 కోట్ల స్థూల ఆదాయంపై రూ.2,549 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.69,948 కోట్ల ఆదాయంతో పోలిస్తే 8.1 శాతం వృద్ధి నమోదుకాగా, రూ. 2,436 కోట్ల నికర లాభంతో పోలిస్తే 4.63 శాతం ఎగబాకింది. గత త్రైమాసికంలో కొత్తగా 331 రిటైల్ అవుట్‌లెట్లను ప్రారంభించడంతో మొత్తం సంఖ్య 18,918కి చేరుకున్నాయి.

> చమురు, గ్యాస్ వ్యాపారాలు బలహీనంగా ఉన్నప్పటికీ కన్జ్యూమర్ విభాగాలు రాణించాయి. డిజిటల్ సర్వీసెస్, రిటైల్ రంగాలకు కస్టమర్ల నుంచి అందించిన స్థాయిలో కంటే అధికంగా మద్దతు ఉండటంతో ఈ విభాగాలను మరింత వేగవంతంగా విస్తరించనున్నాం.
>
> -ముకేశ్ అంబానీ, రిలయన్స్ సీఎండీ

- జియో కస్టమర్లు 48.18 కోట్ల నుంచి 48.97 కోట్లకు పెరిగాయి. సరాసరిగా ఒక్కో కస్టమర్‌పై వచ్చే ఆదాయం రూ.180.5 నుంచి రూ.181.7 పెరిగింది.
- తలసరి డాటా వినియోగం నెలకు 30.3 జీబీ లేదా రోజుకు జీబీ డాటా కంటే అధికంగా నమోదైంది.
- కంపెనీ రుణాలు రూ.1.16 లక్షల కోట్ల నుంచి రూ.1.12 లక్షల కోట్లకు తగ్గాయి.
- కేజీ బేసిన్‌లో రోజుకు 28.7 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నది.

జియో లాభం 5,445 కోట్లు

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో లాభాలతో కళకళలాడుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.5,445 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 12 శాతం ఎగబాకింది. వరుస త్రైమాసికాలతో పోలిస్తే 2 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10 శాతం ఎగబాకి రూ.26,478 కోట్లకు చేరుకున్నట్టు ప్రకటించింది.

వాణిజ్య

రూపాయికి చిల్లులు

7 పైసలు పడిపోయిన విలువ

ముంబై, జూలై 19: రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. మరో 7 పైసలు తరిగిపోయి 83.70కి జారుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతోపాటు ఈక్విటీ మార్కెట్లు డీలా పడటం కరెన్సీ పతనానికి ప్రధాన కారణమని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. గ్లోబల్ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమనడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగిందని, ఆర్బీఐ జోక్యం చేసుకున్నప్పటికీ పతనం మాత్రం ఆగలేదు. 83.64 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 83.60 గరిష్ఠ స్థాయికి చేరుకోగా, 83.70 కనిష్ఠ స్థాయికి జారుకున్నది. చివరకు 7 పైసలు తగ్గి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయినట్టు అయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరిస్తుండటం, రూపాయి పతనానికి అడ్డుకట్ట వేయడానికి ఆర్బీఐ చర్యలు తీసుకుంటే తిరిగి కోలుకునే అవకాశాలున్నాయని చెప్పారు. డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 83.40-83.90 స్థాయిలో ఉండనున్నట్టు తెలిపారు.

టీ హబ్‌తో తమిళనాడు టెక్నాలజీ హబ్ జట్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 19(నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో తమిళనాడు టెక్నాలజీ హబ్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో దేశ వ్యాప్తంగా ఆవిష్కరణలను పెంపొందించడానికి, స్టార్టప్ కార్యకలాపాల పురోగతి సాధించడానికి ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. యువత ఆలోచనలను వ్యాపార నమూనాగా రూపొందించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక, మార్గనిర్దేశం ఇచ్చేలా రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని తెలిపారు.

కార్పొరేట్లకు నో చాన్స్

ముంబై, జూలై 19: బ్యాంకుల ప్రమోటర్లుగా కార్పొరేట్లను అనుమతించే యోచనేదీ ప్రస్తుతానికి లేదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఇక్కడ ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులిచ్చారు. వ్యాపార సంస్థలు బ్యాంకులను ఏర్పాటుచేస్తే బ్యాంకింగ్ ప్రమాణాలు దెబ్బతింటాయన్నారు.

ప్రమాద రహిత సంస్థగా సింగరేణి

- గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు
- రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సీఎండీ ఎన్ బలరాం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, కార్మిక సంఘాలు చేసిన సూచనలూ పరిగణలోకి తీసుకుంటామని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం ప్రకటించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ వి. సీతారామయ్య అధ్యక్షతన జరిగిన 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, రక్షణలోనూ ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని బలరాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ రీజియన్ 2 ఎన్ నాగేశ్వరరావు, సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణ (ఈ అండ్‌ఎం) ఎన్వీ కే శ్రీనివాస్ (ఆపరేషన్స్ అండ్ పర్సనల్), జీ వెంకటేశ్వర్ రెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) రక్షణ చర్యలపై ప్రసంగించారు.

అసభ్య ప్రవర్తన.. మహిళల దాడిలో యువకుడి మృతి

శంషాబాద్ రూరల్, జూలై 19: ఓ యువకుడి అసభ్య ప్రవర్తనను విసిగివేసారిన మహిళలు అతడిని చెప్పులు కట్టెతో కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక ఆ యువకుడు మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఘటన చోటుచేసుకున్నది. పట్టణంలోని ప్రగతినగర్ కాలనీకి చెందిన రాచమల్ల కుమార్ (30) జులాయిగా తిరుగుతూ ఒంటరిగా ఉన్న మహిళల వద్దకు వెళ్లి ఒంటిపై ఉన్న బట్టలు విప్పి అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. పలుమార్లు కాలనీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా, అతడిలో మార్పు రాలేదు. బుధవారం కాలనీ మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించి, దుర్భాషలాడాడు. దీంతో మహిళలు అతడిని చెప్పులు కట్టెతో కొట్టారు. దెబ్బలు భరించలేక అతను మృతి చెందాడు. యువకుడి మృతికి కారణమైన కృష్ణవేణి, సంగీత, మహేశ్వరి, చంద్రకళను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నర్సింగ్ బదిలీల్లో రచ్చ


కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు

› మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. డీఎంఈ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపైనే నిరసన తెలిపారు. 'హెల్త్ మినిస్టర్ రావాలి'.. 'మాకు న్యాయం చేయాలి' అంటూ నినాదాలు చేశారు. లాంగ్ స్టాండింగ్ జాబితా నుంచి పలువురి పేర్లు మాయమయ్యాయని, అర్హత లేని, బయటి సంఘాల నుంచి వచ్చిన సిఫారసు లేఖలను తీసుకొని కొందరిని రిటెయిన్ చేశారని, ఒక్కో బదిలీకి రూ. లక్షల్లో డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు. రాత్రి వరకు నర్సుల ఆందోళన కొనసాగింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నర్సులను సర్దిచెప్పేందుకు డీఎంఈ రవీంద్రనాయక్ మెడికల్ కాలేజీకి రాగా.. నర్సులు ఆయనను ఘెరావ్ చేసి నిలదీశారు. తమకు న్యాయం చేసేవరకు కౌన్సెలింగ్ నిర్వహించొద్దంటూ వాదించారు.

సీనియార్టీ లిస్టుల్లో తప్పులతో మొదలు..

డీఎంఈ పరిధిలో స్టాఫ్ నర్సుల బదిలీల కోసం ఉస్మానియా మెడికల్ కాలేజీలో శుక్రవారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. సీనియర్, జూనియర్ నర్సింగ్ ఆఫీసర్లు రెండు వేల మంది వరకు వచ్చారు. సీనియార్టీ లిస్టును ముందుగానే ప్రకటించాల్సి ఉండగా, గురువారం రాత్రి ప్రకటించారు. దీంతో శుక్రవారం కౌన్సెలింగ్‌కు వచ్చిన తర్వాత తప్పులు ఉన్నట్టు నర్సులు గుర్తించారు. వాటిని సవరించిన తర్వాతే కౌన్సెలింగ్ చేయాలంటూ ఆందోళన ప్రారంభించారు. దీంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తామని, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని అధికారులు ప్రకటించడంతో నర్సులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపైకి వచ్చారు.

'రాజకీయ' సిఫారసు లేఖలతో రచ్చ

లాంగ్ స్టాండింగ్ జాబితా నుంచి 40 మంది స్టాఫ్ నర్సుల పేర్లు మాయమయ్యాయని నర్సులు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ జరుగుతున్న సమయంలోనే.. సంఘాల నాయకులమని చెప్పుకొనే ఇద్దరు ముగ్గురు లీడర్లు వచ్చి, పదుల సంఖ్యలో లేఖలు అధికారులకు ఇచ్చి, అందరినీ రిటెయిన్ చేయాలని సూచించారని తెలిపారు. సిఫారసు లేఖల్లో ఉన్న పేర్లన్నీ ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, పెట్లబుర్జులో పనిచేస్తున్నవారే ఉన్నట్టు తెలిసింది. వీరంతా దశాబ్దాలుగా అక్కడే పాతుకుపోయారని ఆరోపణలున్నాయి. లీడర్లు ఆ లేఖలకు డబ్బులు వసూలు చేశారని, వైద్యారోగ్య శాఖలోని ఓ కీలక అధికారికి భారీగా ముట్టజెప్పి లిస్టులో నుంచి తమ పేర్లను తీసేయించుకున్నారని ఆరోపించారు. లిస్ట్ నుంచి పేర్లు మాయం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన ప్రారంభించారు.

డీఎంఈ ఘెరావ్

ఆందోళనలను శాంతింపజేయడానికి డీఎంఈ రవీంద్ర నాయక్ ఉస్మానియా మెడికల్ కాలేజీకి వచ్చారు. ఆయన నర్సులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా, అందరూ ఆయనను చుట్టుముట్టారు. కౌన్సెలింగ్ ఆపాలని, సీనియార్టీ లిస్టు, వేకెన్సీ లిస్టు ప్రకటించాలని, పారదర్శకంగా నర్సుల బదిలీలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక డీఎంఈ తిరిగి వెళ్లిపోయారు.

రాత్రివేళ కోఠి రోడ్డుపై నిరసన

కౌన్సెలింగ్ నిర్వహిస్తామంటూ పొద్దంతా కాలయాపన చేసిన అధికారులు.. చివరిదశ సమయంలో 'కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నాం' అంటూ ప్రకటించారు. దీంతో నర్సులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ ముందు కోఠి ప్రధాన రహదారిని దిగ్బంధించారు. ఆప్షన్లు ఇవ్వకుండా, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగుల సాధారణ బదిలీలను ప్రకటించినప్పటి నుంచి డీఎంఈ పరిధిలో సీనియార్టీ జాబితాపై ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. నర్సుల ఆందోళనతో మూడుసార్లు జాబితాను సవరించారు.


హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జగన్

ఏపీలో అరాచక పాలన

- 45 రోజుల్లో 36 హత్యలు
- 300కు పైగా హత్యాయత్నాలు
- లోకేశ్ రెడ్‌బుక్ ప్రకారమే ఇదంతా
- దీనిని దేశం దృష్టికి తీసుకెళ్తాం
- ప్రధానిని కలిసి వివరిస్తాం
- 24న ఢిల్లీలో ధర్నా చేస్తాం
- రాష్ట్రపతి పాలన కోరుతాం
- ఏపీ మాజీ సీఎం జగన్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన కొనసాగుతున్నదని, నీచ సంస్కృతి రాజ్యమేలుతున్నదని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. దీనిని దేశం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని, అందుకే రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై ప్రధాని మోదీని కలిసి వివరిస్తామని చెప్పారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితులను నిరసిస్తూ ఢిల్లీలో ధర్నా చేస్తామని, రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తామని తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని జగన్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని, హత్యారాజకీయాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. వైఎస్సార్సీపీ ఎంపీ, ఎమ్మెల్యేలపైనా దాడి చేశారని చెప్పారు. మిథున్ రెడ్డి, రెడ్డప్పపై దాడి చేసి వాళ్లపైనే మర్డర్ కేసు పెట్టారని వాపోయారు. గత ఐదేండ్లలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదని చెప్పారు. లోకేశ్ రెడ్‌బుక్ ప్రకారమే ఇదంతా జరుగుతున్నదని విమర్శించారు. దాడులపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో నిరసన తెలుపుతామని, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఏపీలో పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారని జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అండగా నిలవాల్సిన పోలీసులే బాధితులపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఏపీలో పాలన ఆటవిక రాజ్యాన్ని తలపిస్తున్నదని, 45 రోజుల పాలనలోనే 36 హత్యలు, 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయని, 560 ప్రాంతాల్లో ప్రైవేట్ ఆస్తులు ధ్వంసమయ్యాయని, వైసీపీ సానుభూతిపరుల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, 490 ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, వెయ్యికిపైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 24న రాజ్యసభ, లోక్‌సభ, శాసనసభ, శాసనమండలి సభ్యులతో కలిసి ఢిల్లీలో శాంతియుతంగా ధర్నా చేస్తామని వెల్లడించారు. ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తామని చెప్పారు. వచ్చే బుధవారం ఢిల్లీలో జగన్ నేతృత్వంలో ధర్నా జరుగుతుందని, ఇందులో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని వైఎస్సార్సీపీ ప్రకటించింది. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన హత్యలు, లైంగికదాడులు, దాడులపై నారా లోకేశ్ శ్వేతపత్రం ఇవ్వాలని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి శుక్రవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

రిజిస్ట్రేషన్లు ఎలా తిరస్కరిస్తారు?

- తిరస్కరణలు రాతపూర్వకంగా ఉండాల్సిందే
- మార్గదర్శకాలు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్ల ద్వారా తలెత్తిన వివాదాలు పరిష్కారమైనప్పటికీ కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలంటూ సబ్ రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తుండటంపై హైకోర్టు మండిపడింది. కీలక మార్గదర్శకాలు జారీచేసింది. నిషేధిత జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో సబ్ రిజిస్ట్రార్‌లు తమ స్థాయిలో నిర్ణయం తీసుకోవడానికి అధికారాలు ఉన్నప్పటికీ, మౌఖికంగా తిరస్కరిస్తున్నారని ఆక్షేపించింది. ఫలితంగా పలువురు కోర్టుకు రావాల్సివస్తున్నదని, పైగా తాము తిరస్కరించలేదని సబ్ రిజిస్ట్రార్‌లు చెబుతున్నారని పేర్కొంది. ప్రజలు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లకుండానే వివాదాస్పద స్థలాల వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపింది. కోర్టు వివాదం పరిష్కారమైనా కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలంటూ పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన రామేశ్వరిదేవి వేర్వేరుగా 24 పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ జరిపారు.

కోర్టులకు జోక్యం చేసుకొనే అధికారం

కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలంటూ రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తున్నారని జస్టిస్ శ్రవణ్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. అందువల్ల ప్రజల హక్కులకు సంబంధించి తగిన మార్గదర్శకాలు చేస్తున్నామన్నారు. పట్టాల్లో ప్లాట్లు, యూనిట్లు ఒక్కోసారి మొత్తం ప్రాపర్టీని నిషేధిత జాబితాలో ఉంచుతున్నారని, ఈ చర్యలు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన 300ఏ హక్కును భంగం కలిగిస్తున్నాయని అన్నారు. రిజిస్ట్రేషన్‌లో పారదర్శకత కోసం మార్గదర్శకాలు ఇస్తున్నామని చెప్పారు.

మార్గదర్శకాలు..

రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం వారంలోగా పత్రాలను రిజిస్ట్రేషన్ చేయాలని, లేదంటే తిరస్కరించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలని డిమాండ్ చేయరాదంటూ సబ్ రిజిస్ట్రార్లకు ఉన్నతాధికారులు సర్క్యులర్‌లు జారీ చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించినట్టయితే అప్పటికే చెల్లించిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను వాపసు చేయడానికి సులువైన విధానాన్ని అమలు చేయాలి. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్/జనరల్ డైరీ (జీడీ బుక్/ఎంట్రీబుక్/రిజిస్టర్)ను నిర్వహించాలి. నిషేధిత భూములకు చెందిన సెక్షన్ 22ఏను సమర్థిస్తూ వింజమూరి రాజగోపాలాచారి వర్సెస్ ఏపీ, ఇన్విక్టా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ ఏపీ కేసుల్లో ఇచ్చిన తీర్పులను రిజిస్ట్రేషన్ అధికారులు అమలు చేయాలి. కోర్టు ఉత్తర్వుల కోసం పట్టుబట్టకుండా అధికారం ఉన్న సబ్ రిజిస్ట్రార్ /ఎమ్మార్వోలు ఉత్తర్వులు జారీ చేయాలి.

ఆర్టీఏ అధికారులమని బెదిరించి లారీ చోరీ

- 120 పసుపు బస్తాలు అపహరణ

వినాయకనగర్/నవీపేట, జూలై 19: సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన వెంకటేశ్వరరావుకు చెందిన లారీ సిమెంట్‌లోడ్‌తో గురువారం నిజామాబాద్‌కు వచ్చింది. తిరుగు ప్రయాణంలో 30 టన్నుల పసుపు బస్తాలతో డ్రైవర్ రమేశ్ గుంటూరుకు బయల్దేరాడు. ఇందల్వాయి టోల్ ప్లాజా వద్దకు రాగానే కారులో వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆర్టీఏ అధికారులమని బెదిరించి, లారీతో సహా అక్కడి నుంచి పరారయ్యారు. నాలుగు వ్యాన్లలో 120 పసుపు బస్తాలను నవీపేటలోని ఓ గోదాంలో డంప్ చేశారు. జీపీఎస్ ఆధారంగా జన్నేపల్లిలో లారీ ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు లారీని, నవీపేటలో పసుపు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. నవీపేటకు చెందిన ఓ వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

పోలీసుల డీపీలతో 'సైబర్' కాల్స్!

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : సైబర్ నేరగాళ్లు పోలీసుల ఫొటోలు డీపీలుగా పెట్టుకొని కాల్స్ చేస్తున్నారు. వీరితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ జితేందర్ ఎక్స్ వేదికగా ప్రజలను కోరారు. అపరిచితులు కాల్ చేసి.. డ్రగ్స్, హత్య, రేప్ కేసులోనో మీ వాళ్లను అరెస్టు చేశామని నకిలీ వ్యక్తులతో మాట్లాడించి బురిడీ కొట్టిస్తారు. అలాంటి కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

చిత్రం




అంతర్జాతీయ వేడుకకు అతిథిగా..

'ప్రతిష్ఠాత్మకమైన ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్(IFFM)లో భాగం కావడం నటుడిగా నాకు దక్కిన పెద్ద గౌరవం. ఈ వేదికపై భారతీయ సినిమా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులంతో, సినీ ప్రముఖులతో కనెక్ట్ కావడం మరింత ఉత్సాహాన్నిస్తోంది' అంటూ రామ్‌చరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్(IFFM) వేడుకలు ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి 25 వరకూ ఘనంగా జరుగనున్నాయి. ఇది ఆస్ట్రేలియాలోని విక్టోరియన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే అధికారిక చలన చిత్రోత్సవం. ఈ వేడుకకు చెందిన IFFM 15 ఎడిషన్‌కు గౌరవ అతిథిగా రామ్‌చరణ్ హాజరు కానున్నారు. అంతేకాక, 'గెస్ట్ ఆఫ్ హానర్' అవార్డును కూడా అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఇంకా మాట్లాడుతూ 'ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఎంతటి విజయాన్ని దక్కించుకుందో తెలిసిందే. మెల్‌బోర్న్‌లో ఆ సినిమాకు సంబంధించిన అనుభవాలను ప్రేక్షకులతో పంచుకోబోతుండటం ఊహించుకుంటేనే చెప్పలేని ఆనందాన్నిస్తోంది. అలాగే మెల్‌బోర్న్‌లో మన జాతీయ జెండాను ఎగురవేసే అద్భుతమైన క్షణాలకోసం ఎదురుచూస్తున్నాను' అని రామ్‌చరణ్ అన్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించిన రామ్‌చరణ్ IFFM వేడుకల్లో పాల్గొనబోతుండటం తమకెంతో గర్వకారణమని IFFM డైరెక్టర్ మితు భౌమిక్‌లాంగ్ అన్నారు.



ఆగస్ట్‌లో ఆగమనం



విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'తంగలాన్'. కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్ నేపథ్య కథాంశమిది. ఈ సినిమాలో బంగారు గనుల్లో పనిచేసే ఓ తెగకు సంబంధించిన నాయకుడిగా విక్రమ్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. యథార్థ ఘటనల ఆధారంగా రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని, ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని చిత్ర బృందం పేర్కొంది. మాళవిక మోహనన్, పార్వతి తిరువోతు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పా.రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మాత.

చిత్రీకరణ చివరిదశకు?



మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'విశ్వంభర'. పూర్తిస్థాయి సోషియో ఫాంటసీ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో చిరంజీవి మునుపెన్నడూ చూడని వైవిధ్యమైన పాత్రలో నటిస్తున్నారు. మల్లిడి వశిష్ఠ రూపొందిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ దాదాపు పూర్తి కావొచ్చిందని సమాచారం. కొన్ని పాటలు, పతాక సన్నివేశాలకు సంబంధించి భారీ ఫైట్ మాత్రమే ఇక మిగిలివున్నాయని ఫిల్మ్‌వర్గాల వినికిడి. ఈ సినిమాకు సంబంధించిన సాలిడ్ టీజర్‌ని కూడా మేకర్స్ రెడీ చేస్తున్నారు. చిరంజీవి పుట్టినరోజైన ఆగస్ట్ 22న ఈ టీజర్‌ని విడుదల చేయనున్నారు. ఇందులోని వీఎఫ్‌ఎక్స్ థ్రిల్ కలిగిస్తాయని, ఎం.ఎం.కీరవాణి స్వరాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని మేకర్స్ చెబుతున్నారు. యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 10న సినిమా విడుదల కానుంది.

బాలీవుడ్ వైపు నడిపించింది అదే!


'లైగర్'తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన బాలీవుడ్ భామ అనన్యపాండే. ప్రస్తుతం ఈ స్టార్‌కిడ్‌కి బాలీవుడ్ అవకాశాలకు కొదవలేదు. త్వరలో 'కాల్ మీ బే' అనే వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ఈ అమ్మడి చేతిలో రెండుమూడు సినిమాలు కూడా ఉన్నాయి. తాజాగా అనన్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాను నటిని కావడానికి ప్రేరేపించిన అంశాల గురించి ఆసక్తికరంగా చెప్పింది. 'చిన్నప్పట్నుంచి నటన అంటే పిచ్చి. అది ఏ స్థాయిలో ఉంటే, ఎదుటివారి దృష్టిని ఆకర్షించడానికి తరచూ మా అన్నయ్య, చెల్లితో గొడవ పడేదాన్ని, వాళ్లను కొట్టేదాన్ని కూడా. కానీ నాది నటన అని వాళ్లకు తెలిసిపోతుండేది. చివరకు నిజంగా కొట్టుకున్నా నటనే అనుకునేవారు. ఆ నటనే నన్ను బాలీవుడ్‌వైపు నడిపించింది. ఒకరిని ఇమిటేట్ చేయడం అన్నా, అందర్నీ కూర్చోబెట్టి కథలు చెప్పడం అన్నా నాకిష్టం.' అని చెప్పుకొచ్చింది అనన్యపాండే.

వర్షంలో తడిసినట్లే అనిపిస్తుంది



అగ్ర నటుడు ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆయ్'. అంజి కే మణిపుత్ర దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. బన్నీవాస్, విద్యా కొప్పినీడి నిర్మాతలు. ఈ చిత్ర థీమ్‌సాంగ్‌ను శుక్రవారం అగ్ర నిర్మాత అల్లు అరవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తూర్పు గోదావరి జిల్లాలో వర్షం నేపథ్యంలో సినిమా తీస్తామని హీరో నితిన్ నాతో చెప్పారు. వర్షం కోసమే చాలా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే నిజంగా మనం వర్షంలో తడుస్తున్నట్లే ఉంటుంది' అన్నారు. గోదావరి నేపథ్యంలో స్నేహం గురించి చెప్పే చిత్రమిదని నార్నే నితిన్ అన్నారు. ఈ కథ విని హాయిగా నవ్వుకున్నానని, ప్రేక్షకులు కూడా అదే విధంగా ఫీల్ అవుతారని బన్నీ వాసు చెప్పారు. ఇప్పటివరకు గోదావరి నేపథ్యంలో వచ్చిన చిత్రాల్లో ది బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర తెలిపారు.

ఏజెంట్ జనార్దన్ సున్నిపెంట



హీరో నితిన్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయిక. అగ్రనటుడు డా.రాజేంద్రప్రసాద్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. డిసెంబర్ 20న క్రిస్మస్ కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు. ఈ రోజు డా.రాజేంద్రప్రసాద్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ఏజెంట్ జాన్ స్నో అకా జనార్దన్ సున్నిపెంట'గా ఆయన పాత్రను పరిచయం చేస్తూ, లుక్‌ని విడుదల చేసి, శుభాకాంక్షలు అందించారు. ఇందులో రాజేంద్రప్రసాద్ అద్భుతమైన వినోదాన్ని పంచనున్నారని, ఆయన గెటప్‌లాగే పాత్ర కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

'డార్లింగ్'కు ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణ



'థియేటర్లో ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూశాను. కామెడీ, ఎమోషన్స్‌కు వారు బాగా కనెక్ట్ అవుతున్నారు. సినిమా చూస్తూ మా అమ్మగారు క్లాప్స్ కొట్టడం చాలా ఆనందంగా అనిపించింది' అన్నారు ప్రియదర్శి. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'డార్లింగ్' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. నభానటేష్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అశ్విన్‌రామ్ దర్శకుడు. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ 'ఈ సినిమా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతున్నది. అన్ని కేంద్రాల్లో అద్భుతమైన స్పందన లభిస్తున్నది. అందరూ థియేటర్లలో సినిమాను ఎంజాయ్ చేయండి' అన్నారు. తాము ఊహించినట్లుగానే మహిళా ప్రేక్షకులు సినిమాను బాగా ఇష్టపడుతున్నారని, రాబోవు రోజుల్లో ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉందని దర్శకుడు అశ్విన్ రామ్ పేర్కొన్నారు. నభానటేష్ మాట్లాడుతూ 'ఇదొక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ద్వితీయార్థంలోని కొన్ని సన్నివేశాలకు ప్రేక్షకులు ఎమోషనల్‌గా ఫీలవుతున్నారు. ఈ సినిమా మా అంచనాలను అందుకుంది' అని చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ
జిందగీ

పరిష్వంగాల్లో తేలిపోండి



అలసిన మనసుకు మంచిమాట సాంత్వనను ఇస్తుంది. అదే బడలిన శరీరానికి కౌగిలింత కన్నా గొప్ప ఉపశమనం లేదంటున్నారు ప్రాజ్ఞులు. హద్దుల్లేని హగ్గిస్తే నాలుగు పెగ్గులు వేసుకున్నంత కిక్ వస్తుందట పురుషుడికి. శ్రీవారి ఆత్మీయ కౌగిలింత శ్రీమతికి మతిపోగొడుతుందట. అంతేకాదు.. రోజంతా ఒకరి కౌగిట్లో మరొకరు తనువు దాచుకుంటే.. శారీరక, మానసిక సమస్యలు కరిగిపోతాయని నిపుణుల మాట. జీవిత భాగస్వామిని కౌగిలించుకుని పడుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని వాళ్లు చెబుతున్నారు. ఆలుమగలు గాఢంగా హత్తుకొని నిద్రిస్తే ఉభయుల శరీరంలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుందట. ఫలితంగా ఆరోగ్యం మెరుగవుతుంది. అంతేకాదు... ఒకరినొకరు ఒత్తిగిలి పడుకున్నప్పుడు రేగే వెచ్చని నిట్టూర్పులు నిద్రాదేవిని ఆవాహన చేస్తాయట. ఆవిడగారి ఒంపుల పైజరిలో ఇమిడిపోతూ ఒద్దికగా ఉండే ఆయనగారు జిరోకొర్ట్ మైండ్ రిలాక్స్ మోడ్‌లోకి వెళ్లిపోతుందట. ఈ కౌగిలింతలో వింత వింత భంగిమలు ప్రయత్నించిన వారికి బోనస్‌గా గుండె లయబద్ధంగా ఆడుతుందట. రక్తపోటు నియంత్రణలో ఉంటుందట. ప్రేమను, అభిమానాన్ని వ్యక్తపరచడానికి ఇచ్చిపుచ్చుకునే ఆలింగనంతో ఎన్ని లాభాలు ఉన్నాయో చదివారుగా! ఇంకేం.. పరిష్వం'గాల్లో' తేలిపోండి.

షేక్ చేస్తే.. సేఫ్టీ



అభివృద్ధి పరుగులు పెడుతున్నా.. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్నా.. మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. దేశంలో ఏదో ఒకచోట వారిపై దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో టెక్నాలజీని వాడుకుని మహిళలను సురక్షితంగా ఉంచేందుకు పలు కంపెనీలు రకరకాల యాప్‌లను అభివృద్ధి చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, స్నేహితులు, ఆత్మీయులు, తల్లిదండ్రుల సాయం కోరేందుకు, వారు ఉన్న ప్రదేశాన్ని ట్రేస్ చేసేందుకు సాయపడేలా వీటిని రూపొందిస్తున్నాయి. అందులో భాగంగా రూపొందించినదే షేక్‌సేఫ్టీ. కొన్ని అత్యవసర సమయాల్లో నంబర్ డైల్ చేసే పరిస్థితి ఉండదు. కాంటాక్ట్స్ వెతికే అవకాశం కూడా దొరకదు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుంది షేక్‌సేఫ్టీ. అత్యవసర పరిస్థితుల్లో మొబైల్ షేక్ చేసినా, పవర్ బటన్‌ను నాలుగుసార్లు క్లిక్ చేసినా యాప్‌లో ఎంపిక చేసుకున్న నంబర్లకు అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. మీరున్న పరిస్థితికి సంబంధించిన ఆడియో కూడా ఎమర్జెన్సీ నంబర్లకు చేరుతుంది. ఎస్ఓఎస్ మెసేజ్ పంపడానికి సైరన్ బటన్ కూడా జతచేసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈ అప్లికేషన్ అందుబాటులో ఉంది.



జేడీ వాన్స్ ఉషస్సు



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పెద్దగా చెప్పుకోదగ్గ విధానపరమైన చర్చల్లేవు. హామీలూ లేవు. ప్రపంచానికి ఆసక్తి లేదు. ఎప్పుడైతే మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ని హత్య చేసేందుకు దుండగుడు కాల్పులు జరిపాడో అప్పటినుంచి ఎన్నికల ప్రచారం ఓ మలుపు తిరిగింది. ప్రపంచమూ ఆ ఎన్నికల వైపు చూసింది. కాల్పుల తర్వాత ట్రంప్ గురించే కాదు ఉపాధ్యక్ష అభ్యర్థి కూడా రంగంలోకి వచ్చారు. ఈ కాల్పులకు అధ్యక్షుడు బైడెన్‌కే సంబంధం ఉందంటూ ఆరోపణలు చేసిన జె.డి. వాన్స్‌ని రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్ ప్రకటించారు. వాన్స్ తెలుగింటి అల్లుడు కావడంతో భారతీయులంతా ఆయన అభ్యర్థిత్వం పట్ల ఆసక్తి చూపుతున్నారు. వాన్స్ భార్య ఉషా చిలుకూరి ప్రవాస తెలుగమ్మాయి.

> "ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని వడ్లూరు ఉషా చిలుకూరి పూర్వీకుల ఊరు. వాళ్ల తాత చిలుకూరి రామశాస్త్రి స్వగ్రామం ఇది. మద్రాస్ ఐఐటీ స్థాపించినప్పుడు ఆయనకు ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చింది. అలా ఆ కుటుంబం మద్రాస్‌లో స్థిరపడింది. డెబ్బయ్యో దశకం చివరి రోజుల్లో ఉష తల్లిదండ్రులు అమెరికా వలస వెళ్లారు. ఉష అమెరికాలోనే పుట్టి, పెరిగింది."

అతనికి ఆమే అండ

ఉష శాండియాగోలోని మిడిల్ క్లాస్ కమ్యూనిటీలో పెరిగింది. యేల్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ చదివింది. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఫిల్ పూర్తిచేసింది. యేల్ లా స్కూల్‌లో న్యాయశాస్త్రం చదివేప్పుడు... 'సోషల్ డిక్లైన్ ఇన్ వైట్ అమెరికా' అనే కార్యక్రమంలో వీరిద్దరూ పాల్గొన్నారు. ఆ సమయంలో ఉషకు జేడీ పరిచయం అయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారి, పెండ్లికి దారితీసింది. వాన్స్ క్యాథలిక్ మతాన్ని అనుసరిస్తారు. ఉష హిందూ మత విశ్వాసాలను ఆచరిస్తుంది. ఉష అమెరికా సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ దగ్గర కొంతకాలం క్లర్క్‌గా పనిచేసింది. ప్రస్తుతం లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నది. చదువు, ఉద్యోగాల్లో మంచి ప్రతిభ చూపిన ఆమె రాజకీయాల్లో భర్తకు అండగా ఉంటూ మంచి పేరు తెచ్చుకుంది. ఉషను యేల్ యూనివర్సిటీ 'ఆధ్యాత్మిక గురువు'గా ఆమె భర్త అభివర్ణిస్తుంటారు. ఎందుకని ప్రశ్నించినవాళ్లకు 'నాకు కూడా తెలియని ప్రశ్నలను ఆమె అర్థం చేసుకుంటుంది' అని బదులిస్తారు. ఒహియో సెనేటర్‌గా ఉన్న వాన్స్ పలు ఇంటర్వ్యూల్లో 'నా భార్యే నా ధైర్యం' అని చెప్పారు.

'**నేను** ఊహల్లో ఉన్నప్పుడు వాస్తవంలోకి తీసుకొచ్చే గైడ్‌గా ఉష నాకు సాయపడుతుంటుంది' అని భార్య మేలుని వాన్స్ తలుచుకున్న సందర్భాలు అనేకం. 'నేను చాలా తెలివైనవాడినని గర్వంగా ఫీలైనప్పుడు ఆమె గుర్తుకొస్తే ఆ గర్వం నీరుగారిపోతుంది. ఎందుకంటే ఆమె నాకంటే తెలివైనది. ఆమె వెయ్యి పేజీల పుస్తకాన్ని కొన్ని గంటల్లోనే చదివేయగలదు' అని వాన్స్ ఉషను పొగిడిన సందర్భాలెన్నో. ఇప్పుడూ ఎన్నికల సభల్లో, ఇంటర్వ్యూల్లో ఉష తెలివిని, సమయస్ఫూర్తిని ప్రశంసిస్తున్నారు. ఈ అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలిచి, జేడీ వాన్స్ ఉపాధ్యక్షుడు అయితే.. ఆతగాడి నిర్ణయాల్లో ఉషోదయం పొడచూపకుండా ఉండదనేది కాదనలేని వాస్తవం.

ప్రపంచాన్ని అమెరికా శాసిస్తున్నది! ఆ అమెరికాను భారతీయ మేధ పాలిస్తున్నది!
రెండు దశాబ్దాల క్రితం.. 'అమెరికా అధ్యక్షుడి రాకే మహాభాగ్యం' అనుకున్నది భారతదేశం.
ఇప్పుడు రెండడుగులు ముందుకేసి.. వైట్‌హౌస్ అధికారానికి వారసుల్ని అందిస్తున్నది!



శ్వేతసౌధంలో భారతనారి

అమ్మ చూపిన గెలుపు బావుట

అమెరికా రాజకీయాన్ని శాసించే రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలు శ్వేతసౌధంలోకి వెళ్లేందుకు నల్లజాతి మహిళలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదు. ఆ అవకాశం దక్కిన నల్లజాతి మహిళలు గెలిచిందీ లేదు. రెండు వందల ఏండ్ల ప్రజాస్వామ్యం అని చెప్పుకోవడమే కానీ, ఆ చరిత్రలో మహిళ లేదు. దాన్ని తిరగరాసిన మహిళ కమలా హ్యారిస్. ఓ మహిళ శ్వేతసౌధంలో అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న మరో ఎన్నిక ఇది. అధ్యక్ష ఎన్నికల్లో ప్రత్యర్థులైన ట్రంప్, బైడెన్‌ల సామర్థ్యాల గురించి చర్చ జరుగుతున్న వేళ ట్రంప్ తెంపరితనానికి కమలా హ్యారిస్ సరైన ప్రత్యర్థి అనే వాదన వినిపిస్తున్నది. ఇప్పుడు ఆమె అధ్యక్ష అభ్యర్థిగా బరిలో దిగే అవకాశాలూ కనిపిస్తున్నాయి. 'నా ధీమా, ధైర్యం మా అమ్మే. నా ప్రయాణం ఇంత దూరం వస్తుందని తను అప్పుడు ఊహించి ఉండకపోవచ్చు. కానీ, మా అమ్మ ఢిల్లీ నుంచి ధైర్యంగా అమెరికా చేరుకోవడం వల్లే నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను'ని అమెరికా ఉపాధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే చెప్పింది కమల. ఈ ఉపాధ్యక్షురాలు గెలుపు బావుటా ఎగురవేయడానికి వాళ్లమ్మ ఏనాడో శంఖం పూరించిందన్నమాట!

శ్యామల సంధ్యారాగం

కమల తల్లి పేరు శ్యామల. 19 ఏండ్ల వయసులో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లింది. ఆ రోజుల్లో ఆ కుటుంబానికి అమెరికాలో తెలిసిన వాళ్లు కానీ, సాయం చేస్తామన్న వాళ్లు కానీ ఎవరూ లేరు. న్యూఢిల్లీలోని లేడీ ఇర్విన్ కాలేజ్‌లో హోంసైన్స్ చదువుతూ ఇంట్లో ఎవరికీ తెలియకుండా శ్యామల అమెరికాలో పై చదువుకు దరఖాస్తు చేసింది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో సీటు వచ్చింది. స్కాలర్‌షిప్ వచ్చింది. శ్యామల వాళ్ల నాన్న సెంట్రల్ సెక్రెటేరియట్ ఉద్యోగి. తండ్రి అంగీకారంతో తమిళనాడు నుంచి అమెరికా బయలుదేరింది శ్యామల. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎండోక్రైనాలజీలో పీహెచ్‌డీ పట్టా సాధించింది. అక్కడే (బ్రిటిష్) జమైకా నుంచి అమెరికా వచ్చిన ఎకనామిక్స్ విద్యార్థి డొనాల్డ్ జె. హ్యారిస్ ఆమెకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత వాళ్లిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇల్లినాయిస్ యూనివర్సిటీలో ఇద్దరూ ఉద్యోగాల్లో చేరారు. ఆ తర్వాత వేర్వేరు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు చేస్తూ ప్రయాణాలు చేశారు. ఈ దంపతులకు రెండో సంతానంగా కమలా హ్యారిస్ పుట్టింది. అమెరికాలో పెరిగినా అమ్మమ్మ ఊరైన మద్రాస్‌తో హ్యారిస్‌కు అనుబంధం ఉంది. చాలాసార్లు ఇక్కడికి వచ్చింది.



న్యాయం కోసం.. న్యాయం వైపు

కమల చిన్నప్పటినుంచి చదువుల్లో చురుకు. హోవర్డ్ యూనివర్సిటీ, కాలిఫోర్నియా యూనివర్సిటీ, హేస్టింగ్స్ కాలేజ్ ఆఫ్ లా విద్యాసంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించింది. న్యాయశాస్త్ర విద్య పూర్తయ్యాక అలమెడా కౌంటీకి జిల్లా అటార్నీ అధికారిగా ఉద్యోగ జీవితం ప్రారంభించింది. ఆ తర్వాత శాన్‌ఫ్రాన్సిస్కో నగర అటార్నీగా పదోన్నతి పొందింది. అమెరికా సుప్రీంకోర్టులోనూ ఉద్యోగిగా పనిచేసింది. కొన్నాళ్ల తర్వాత.. అటార్నీ జనరల్ ఆఫ్ కాలిఫోర్నియాగా ఎన్నికైంది. 2014లో మరోసారి అదే పదవికి ఎన్నికైంది. 2021లో అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయానికి అమెరికాలో నల్లజాతి ప్రజలు హక్కుల కోసం ఆందోళనలు చేస్తున్నారు. ఆ సమయంలో కాలిఫోర్నియా అటార్నీ జనరల్‌గా ఉన్న కమల.. నల్లజాతి ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. ప్రజాస్వామికంగా, శాంతియుతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆఫ్రో అమెరికన్లపై పోలీసుల అరాచకాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అల్లర్లు చెలరేగడంతో డెమొక్రటిక్ పార్టీ నల్లజాతి మహిళను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంచుకుంది. దేశ పరిస్థితుల పట్ల డెమొక్రాట్ల అంచనా తప్పలేదు. కమలా హ్యారిస్ గెలిచింది.

పదేండ్ల కిందట హ్యారిస్ కాలిఫోర్నియా సెనేటర్‌గా గెలిచింది. అమెరికా చరిత్రలో సెనేటర్‌గా గెలిచిన మొట్టమొదటి దక్షిణాసియా- అమెరికన్‌గా, రెండో ఆఫ్రికన్-అమెరికన్‌గా చరిత్రకెక్కింది. నేటి ఎన్నికల్లో బైడెన్ ఆరోగ్యం, సామర్థ్యం విషయంలో సందేహాలు తలెత్తుతున్నాయి. సొంత పార్టీలోనే గందరగోళం ఏర్పడింది. బైడెన్.. వద్దు బాబోయ్ అంటున్నారు. హ్యారిస్ కావాలంటున్నారు. డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కమల ఎంపికైతే అధ్యక్ష స్థానానికి పోటీపడ్డ తొలి నల్లజాతి మహిళగా చరిత్ర సృష్టిస్తుంది. ఇక గెలిస్తే మరో చరిత్ర!

గీతా గాగ్రా

అంబానీ ఇంట పెండ్లిసందడి ముగిసి వారం గడిచినా.. ఆ వేడుక ముచ్చట్లు నెట్టింట ఇంకా చక్కర్లు కొడుతున్నాయి. నీతా అంబానీ చీరకట్టు.. ఈశా అంబానీ ధరించిన జాకెట్టు.. ఇవన్నీ ఇంకా వైరల్ అవుతున్నాయి. నూతన వధూవరుల కన్నా ఈ తల్లీకూతుళ్ల ముచ్చట్లపైనే నెట్టింట ముచ్చట్లు నడుస్తున్నాయి. ఈ వేడుకలో పూలపూలంబా సరికొత్త ఆహార్యంతో అలరించిన ఈశా.. శివశక్తి పూజ సందర్భంగా ధరించిన లెహంగా టాక్ ఆఫ్ ద సోషల్ మీడియాగా మారింది. ఈ కార్యక్రమానికి అంబానీ పరివారమంతా సంప్రదాయ దుస్తుల్లో హాజరైంది. ఈశా ఆగ్రా తాజ్‌మహల్ కన్నా వేడుకైన గాగ్రా ధరించింది. దీనిపై అంబానీ అలంకారాలు, భారతీయ సంప్రదాయాన్ని చాటిచెప్పే చిత్రాలు ముద్రించారు. ఈ ప్రత్యేకతలు చాలవన్నట్లు గీతాసారాన్ని చాటిచెప్పే 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన, మా కర్మ ఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి' అనే శ్లోకం కూడా గాగ్రాపై లిఖించి ఉంది. 'పని చెయ్.. ఫలితం ఆశించకు' అని ఈ శ్లోకార్థం. సిరిగలవారు ఏం చేసినా చెల్లునే! అయితే, ఒంటిమీద ధరించే దుస్తులపై గీతాశ్లోకం రాయడం ఏంటని కొందరు నెటిజన్లు పెదవి విరుస్తున్నారు.

పుదీనా తిందాం.. తేనె వేసుకుందాం!

చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా దవాఖానకు పరుగులు తీస్తుంటారు చాలామంది. సమస్య ఉన్నప్పుడు వైద్యులను సంప్రదించడం మంచిదే! అయితే, ప్రతి చిన్న విషయానికీ మందులు వాడటం అంత మంచిది కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. తరాలుగా వస్తున్న కొన్ని సంప్రదాయ చిట్కాలు పాటించి చిన్నాచితకా సమస్యలకు చెక్ పెట్టొచ్చు. ఔషధాల వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్ నుంచి తప్పించుకోవచ్చు.



నోటి దుర్వాసన, చిగుళ్ల సమస్యలు చాలామందికి ఎదురవుతూ ఉంటాయి. ఎన్నిరకాల పేస్టులు వాడినా సమస్య పరిష్కారం కాదు. ప్రతి రోజూ నాలుగైదు పుదీనా ఆకులు తినడం వల్ల ఈ ఇబ్బంది నుంచి బయటపడొచ్చు.

రెండుమూడు రకాల మందులు వేసుకున్నా.. పడిశం ఓ పట్టాన లొంగదు. అలాంటప్పుడు మిరియాల చారు భేషుగ్గా పనిచేస్తుంది. పాలలో మిరియాల పొడి వేసుకొని తాగినా గుణం కనిపిస్తుంది. అంతేకాదు ఆహారంలో మిరియాల పొడి తీసుకోవడం అలవాటు చేసుకుంటే.. రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గుతుంది. నాళాల్లో రక్తం గడ్డకట్టే సమస్య కూడా దూరమవుతుంది.

రక్తపోటు సమస్యకు సరైన వైద్యం తీసుకోవాలి. బీపీ నియంత్రణలో ఉండాలంటే మునగాకు పొడి తరచూ తీసుకోవడం మంచిది. ప్రతి రోజూ చిటికెడు మునగాకు పొడి తీసుకుంటే.. బీపీ కంట్రోల్‌లో ఉంటుంది.

రక్తహీనత సమస్యకు తేనె చక్కని పరిష్కారం. చక్కెర వినియోగాన్ని తగ్గించి.. టీ, కాఫీ, ఇతర ఆహార పదార్థాల్లో తేనెను ఉపయోగిస్తే రక్తహీనత నుంచి బయటపడొచ్చు.

రక్తనాళాలు మందంగా ఉండే సమస్యలను ఎదుర్కొనే వాళ్లు బీట్‌రూట్ రసాన్ని రోజూ తాగితే మంచిది. అప్పుడు రక్త ప్రసరణ మెరుగవుతుంది. గుండె సమస్యలు కూడా దరిచేరవు.